# కడలి మీద కోన్-టికి

# కడలిమీద కోన్-టికి

రచన:

థార్ హెయెర్డ్‌హాల్

అనువాదం:

విద్వాన్, దేవరకొండ చిన్నికృష్ణశర్మ

Copyright : George Allen & Unwin Ltd., London.

CHECKED
JUNE 1981

T
83
H51K

KED
1992

CHECKED June 85

ఈ తెలుగు అనువాదమునకు సంబంధించిన
సర్వహక్కులు ప్రకాశకులవి.

ప్రచురణ : 1957.
ప్రతులు : 5000

దక్షిణభాషాపుస్తకసంస్థ సహకారమున ప్రకటితము.

1117
17 JAN 70
LIBRARY

ముద్రణ :
విక్టరీ ప్రెస్, విజయవాడ-1

# పరిచయము

దక్షిణభాషా పుస్తక సంస్థవారు ప్రోత్సహించిన ఉత్తమ గ్రంథసంచయములోని తొలి ప్రచురణలివి. తమిళం, తెలుగు, మళయాళం, కన్నడం-నాలుగు దక్షిణాది భాషలలో విద్యా సాంస్కృతిక వికాసాలకు దోహదమిచ్చే ఉత్తమగ్రంథాలను చౌకగా ప్రచురింపచేయాలనే సత్సంకల్పంతో, సముదార దూరదృష్టితో ఫోర్డు దర్మనిధివారు ఈ సంస్థనిర్మాణాన్ని తలపెట్టారు. ఇందుకోసం వారు దక్షిణదేశంలో ఉన్న ఏడు విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులతోను సంప్రదించి ఈ నాలుగు భాషలు మాట్లాడే ప్రజలకు, మంచిమంచి పుస్తకాలను, ప్రచురణకర్తలచే అందంగా అచ్చువేయించి అందరికి అందుబాటులోఉండే సరసమైనధరలకు అందచేయాలనే ఆదర్శంతో మూడేళ్ళ కార్యక్రమాన్ని రూపొందించారు. వీరి కృషివలన మనకు లభించిన ప్రథమ ఫలాలివి. దీన్ని కూర్చడంలో వీరు ప్రౌఢశైలిలో ఉండే విద్వత్కావ్యాల జోలికిపోకుండా కేవలం మాతృభాషలో మాత్రమే అక్షరాస్యులైన, ఆంగ్లభాషా వాసనలేని అసంఖ్యాక సామాన్య ప్రజానీకాన్ని అలరించి, ఆకర్షించి, వారికి విజ్ఞానాన్ని, వినోదాన్ని, వికాసాన్ని పూర్తిగా అందించగల సులభ సుందర శైలిలో ఉన్న ఉత్తమగ్రంథాలను మాత్రమే ఎన్నుకున్నారు.

ఉన్నత సారస్వతశ్రేణికి చెందిన స్వతంత్ర రచనలనే కాకుండా వైజ్ఞానిక, సాంస్కృతికగ్రంథాలనూ, ప్రపంచ సార

స్వతంలోని ఉత్తమగ్రంథాల అనువాదాలనూ కూడా ప్రచురింపచేయడం వీరి ప్రధాన లక్ష్యం.

ఒక్కమాటలో చెప్పాలంటే "ఉత్తమ గ్రంథాలను చౌకగా అందించడం" అనేదే దక్షిణభాషా పుస్తక సంస్థవారి పరమాశయం. ఇందులో వీరెంతవరకు కృతకృత్యులైనదీ ఇప్పుడీ గ్రంథాలనుబట్టి ప్రజలే నిర్ణయించవలసి ఉంది. ఇప్పుడు ప్రారంభమైన ఈ కృషి ఫలితం బహుశా వచ్చే పదిసంవత్సరాలవరకు అంతగా కనబడకపోవచ్చు. కాని ఈ ప్రణాళిక అద్భుతమైనదని, అత్యంత ప్రధానమైనదని మాత్రం దూరదృష్టి గలవారందరూ ఒప్పుకొనక తప్పదు. ఇందుకుగల అవకాశాలు అనేకం. అందమైన అచ్చుతో చౌకగా అందరికీ అందుబాటులోఉండే ఈ ఉత్తమగ్రంథాలు దేశంలో మారుమూల కుగ్రామాలలో నివసించే లక్షలాది స్త్రీ పురుషులందరి జీవితాలకు కొత్త వెలుగునీ, విజ్ఞానాన్ని అందించగలవు.

దక్షిణభాషా పుస్తకసంస్థవారి కార్యక్రమాలు ప్రస్తుతానికి తమిళం, తెలుగు, మళయాళం, కన్నడం - నాలుగు దక్షిణాది భాషలకే పరిమితమై ఉండడం వింతకాదు. ప్రాచీన కాలంలో వింధ్యకు దక్షిణానఉండే దేశమంతా దక్షిణాపథమనే పేరుతో వ్యవహారంలో ఉన్నప్పటికీ, సాంస్కృతికంగా ఇక్కడ నివసించే ప్రజలందరూ ఈ నాలుగుభాషలనూ,వాటి ప్రాంతీయ వికృతులను మాత్రమే వాడుకచేసేవారు. నిజానికి ఈ నాలుగు భాషలున్నూ ఒకేకోవకు చెందినవి. వీటిని 'ద్రావిడ' భాషలనడం నా అభిమతం కాదు. ఈ రోజుల్లో 'ద్రావిడ' పదం

జాతి, భాషాపరమైనదిగాకాక ప్రత్యేకమైన రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకోవడమే నా యీ సంకోచానికి కారణం. ఈ నాలుగుభాషలకు మధ్య సహజమైన సన్నిహిత సంబంధాలు చాలా ఉన్నవి. పైగా ఆర్యావర్తంలో వ్యాప్తిలో ఉన్న సంస్కృతికంటె భిన్నమైన దక్షిణ భారతీయ సంస్కృతికి ఈ ప్రాంతం ఆటపట్టు. కర్ణాటక సంగీత సంప్రదాయం ఇక్కడిదే. అలాగే ఇక్కడి వాస్తు, శిల్ప సంపద ఉత్తరాది దానికంటె భిన్నమైనది. ఈ నాలుగుభాషలు మాట్లాడే ప్రజలు అనూచానంగా అనుసరించే సాంఘికాచార వ్యవహారాలన్నీ కూడా ఒక్కటే.

దక్షిణభాషా పుస్తకసంస్థవారి ప్రోత్సాహంవల్ల ప్రచురితమయ్యే పుస్తకాలన్నీ దాక్షిణాత్య సంస్కృతిని ప్రతిబింబించేవిగా ఉండగలవని ఆశిస్తున్నాను. అయితే సంకుచితమైన స్వస్థానభాషా వేషానురతి శృతిమించిపోకుండా సమగ్రభారత సంస్కృతిని ప్రతిబింబింపజేసే పుస్తకాలను, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని, ప్రపంచ కల్యాణాన్ని కాంక్షించే ఉత్తమ గ్రంథాల అనువాదాలను ప్రచురించడం చాలా అవసరం.

పా. వేం. రాజమన్నారు

స్వతంలోని ఉత్తమగ్రంధాల అనువాదాలనూ కూడా ప్రచు రింపచేయడం వీరి ప్రధాన లక్ష్యం.

ఒక్కమాటలో చెప్పాలంటే "ఉత్తమ గ్రంధాలను చౌకగా అందించడం" అనేదే దక్షిణభాషా పుస్తక సంస్థవారి పరమాశయం. ఇందులో వీరెంతవరకు కృతకృత్యులైనదీ ఇప్పు డీ గ్రంధాలనుబట్టి ప్రజలే నిర్ణయించవలసి ఉంది. ఇప్పుడు ప్రారంభమైన ఈ కృషి ఫలితం బహుశా వచ్చే పదిసంవత్స రాలవరకు అంతగా కనబడకపోవచ్చు. కాని ఈ ప్రణాళిక అద్భుతమైనదని, అత్యంత ప్రధానమైనదని మాత్రం దూర దృష్టి గలవారందరూ ఒప్పుకోనక తప్పదు. ఇందుకుగల అవకాశాలు అనేకం. అందమైన అచ్చుతో చౌకగా అందరికీ అందుబాటులోఉండే ఈ ఉత్తమగ్రంధాలు దేశంలో మూరు మూల కుగ్రామాలలో నివసించే లక్షలాది స్త్రీ పురుషులందరి జీవితాలకు కొత్త వెలుగునీ, విజ్ఞానాన్ని అందించగలవు.

దక్షిణభాషా పుస్తకసంస్థవారి కార్యక్రమాలు ప్రస్తు తానికి తమిళం, తెలుగు, మళయాళం, కన్నడం - నాలుగు దక్షిణాది భాషలకే పరిమితమై ఉండడం వింతకాదు. ప్రాచీన కాలంలో వింధ్యకు దక్షిణానఉండే దేశమంతా దక్షిణాపథమనే పేరుతో వ్యవహారంలో ఉన్నప్పటికీ, సాంస్కృతికంగా ఇక్కడ నివసించే ప్రజలందరూ ఈ నాలుగుభాషలనూ,వాటి ప్రాంతీయ వికృతులను మాత్రమే వాడుకచేసేవారు. నిజానికి ఈ నాలుగు భాషలున్నూ ఒకేకోవకు చెందినవి. వీటిని 'ద్రావిడ' భాష లనడం నా అభిమతం కాదు. ఈ రోజుల్లో 'ద్రావిడ' పదం

జాతి, భాషాపరమైనదిగాకాక ప్రత్యేకమైన రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకోవడమే నా యీ సంకోచానికి కారణం. ఈ నాలుగుభాషలకు మధ్య సహజమైన సన్నిహిత సంబంధాలు చాలా ఉన్నవి. పైగా ఆర్యావర్తంలో వ్యాప్తిలోఉన్న సంస్కృతికంటె భిన్నమైన దక్షిణ భారతీయ సంస్కృతికి ఈ ప్రాంతం ఆటపట్టు. కర్ణాటక సంగీత సంప్రదాయం ఇక్కడిదే. అలాగే ఇక్కడి వాస్తు, శిల్ప సంపద ఉత్తరాది దానికంటె భిన్నమైనది. ఈ నాలుగుభాషలు మాట్లాడే ప్రజలు అనూచానంగా అనుసరించే సాంఘికాచార వ్యవహారాలన్నీ కూడా ఒక్కటే.

దక్షిణభాషా పుస్తకసంస్థవారి ప్రోత్సాహంవల్ల ప్రచురితమయ్యే పుస్తకాలన్నీ దాక్షిణాత్య సంస్కృతిని ప్రతిబింబించేవిగా ఉండగలవని ఆశిస్తున్నాను. అయితే సంకుచితమైన స్వస్థానభాషా వేషానురతి శృతిమించిపోకుండా సమగ్రభారత సంస్కృతిని ప్రతిబింబింపజేసే పుస్తకాలను, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని, ప్రపంచ కల్యాణాన్ని కాంక్షించే ఉత్తమ గ్రంథాల అనువాదాలను ప్రచురించడం చాలా అవసరం.

పా. వేం. రాజమన్నారు

# తొలిపలుకు

సహజంగా మనుష్యులందరూ శాంతిప్రియులై నిరాటంకమైన మార్గాన్నే అనుసరిస్తారు. అతి ప్రాచీనకాలంనుంచీ వారు సారవంతంమాత్రమే కాక, భౌతికంగాకూడా ఇబ్బందులు లేని ప్రదేశాన్నే ఎన్నుకొని, అక్కడ స్థిరపడుతూ వచ్చారు.

ప్రపంచంలోని కొన్నిభాగాలు ఎంతో దుర్గమస్థలాలై బాహ్యప్రపంచానికి సంబంధంలేకుండా ఉన్నాయి. అయినా సాహసులైనవారు కొందరు అటువంటిచోట్ల నివాసం ఏర్పఱచుకోవటంకూడా జరుగుతూ వస్తున్నది. అయితే ఏదో తప్పని పరిస్థితులవల్ల ఉద్వేగంగా వలసలు సాగితేనేగాని అటువంటి ప్రదేశాలలో మానవనివాసం ప్రారంభం కాలేదు. మానవ చరిత్ర పరిశీలిస్తే పై అభిప్రాయం యథార్థమని ధ్రువపడుతుంది. బుద్ధిపూర్వకంగానే నూతన ప్రదేశాలకు సాహస యాత్రలు చేయటంచేతగానీ, నిర్బంధంచేత ఉన్నచోటు విడిచిపోవటంచేతగానీ, మానవులు అటువంటిచోట్లకు చేరుకొనటం సంభవించేది. దక్షిణఅమెరికా సముద్రతీరానికి దాదాపు నాలుగువేల మూడువందలమైళ్ళదూరానఉన్న పాలినేషియన్ ద్వీపాలలో నివాసం ఏర్పఱచుకొన్న పాలినేషియన్లు అధిగమించరాని ఆటంకాలను ఉత్తరించగలిగిన మానవ చిత్తస్థైర్యానికి చక్కని తార్కాణం చూపినవారు.

పాలినేషియన్లంటే, దక్షిణఅమెరికాలోని "ఇంకాస్" అనే జాతికి చెందినవారే; అని యిప్పుడు తెలుస్తున్నది. ఇంకాస్ రాజులు సముద్రపుమట్టానికి పదివేలనుండి పదునాలుగు వేల అడుగులఎత్తువఱకూ కల ఆండీస్ పర్వతపులోయలలో వ్యవసాయానికి వలసిన నీటిపాఱుదల సౌకర్యాలుచేసి, అత్యద్భుతమైన నాగరకతను సృష్టించారు.

ఇంకాస్ జాతివారు పర్వతప్రాంతాలలో ఱాళ్లుతొలిచి మనుష్యవిగ్రహాలూ, పిరమిడ్లూ నిర్మించిన మహాశిల్పులు. సమున్నతాలైన ఆండీస్ పర్వతాలవద్ద వీరు నిర్మించిన ఱాతి వంతెనలూ, సింహద్వారాలూ ఈనాటికీ కనబడుతున్నవి. పసిఫిక్ సముద్రంపైన వారు నిర్మించిన శిల్పకళలోని నేర్పు గుణవత్తరం కాకపోయినా, గుణవంతం మాత్రం కానవక తప్పదు.

దక్షిణఅమెరికా పశ్చిమతీరం చేరి, కాలక్రమాన ఆ ప్రాంతాన్ని జయించిన ఐరోపావాసులలో ప్రప్రథములు స్పెయిను దేశీయులు. వారు అక్కడికి వెళ్ళేసరికే, ఆ పర్వత భూములమీద ఇంకాస్‌జాతి సార్వభౌమత్వం చెల్లుబడి అవుతూనే ఉన్నది.

పసిఫిక్ సముద్రపు తూర్పుభాగాన విడివిడిగా కనబడే ద్వీపాలలో పాలినేషియన్లు నివసిస్తున్నారు. అయితే ఈ వేర్వేఱు ద్వీపాలలో ఉన్నవారికందఱికీ సాధారణ సాన్నిహిత్యం కలిగిస్తున్నది భాష. ఈ భాషలో స్వల్పమైన మార్పులున్నప్పటికీ మూలంమాత్రం ఒక్కటే. అది పాలినేషియన్ భాష.

పాలినేషియన్లు తమ పూర్వులను పూజిస్తూ ఉంటారు. మృతులైన నాయకులు ఇప్పటికీ ఆ ప్రజల స్మృతిపథంలో విహరిస్తూనే ఉన్నారు. పేనిన త్రాళ్ళమీద వరుసప్రకారం బిగించే మేకులు కల ఆచారం మూలాన పాలినేషియన్ల పూర్వుల కాల నిర్ణయం చెయ్యటానికి వీలుకలుగుతున్నది. ఆ ద్వీపాలలో ఉన్న ఇటువంటి త్రాళ్ళ నన్నింటినీ జాగ్రత్తగా పరిశీలిస్తే, వాటి కన్నింటికీ సమన్వయం కుదురుతున్నది. ఆ యా నాయకుల పేర్లలోగానీ, వారి కాలాలలోగానీ తేడాలు కనబడటం లేదు. ఈ విధంగా గడచిన తరాలు లెక్కించి చూస్తే దక్షిణ అమెరికానుంచి పాలినేషియన్ల వలస మొట్టమొదట క్రీ. శ.500 సంవత్సరాలనాడు జరిగినట్లు తెలుస్తున్నది. క్రీ. శ. 1100 సం॥ వఱకూ ఇటువంటి వలసలు జరుగుతూవచ్చాయనీ, అటు తర్వాత మాత్రం ఆ ద్వీపాలకు వెళ్ళినవారు లేరనీ బోధపడుతున్నది.

ఈ సాహసకృత్యాలన్నింటిలోనూ ముఖ్యమైన సత్యం పసిఫిక్ మహాసముద్ర తరణం. నాటి ఆ సాహసికులకు ప్రపంచంలోని ఋతుపవనాలను గుఱించీ, సముద్రంలోని ప్రవాహాలనుగుఱించీ తెలిసే ఉంటుందని నమ్మటం చాలా కష్టం. అయితే దక్షిణఅమెరికా సముద్రతీరంనుంచి వారు పయనించిన మార్గాన కల ప్రవాహాలతో వారికి పరిచయం కలిగిఉండటంలో అసంభవం ఏమీ లేదు. వాటినిగుఱించి వారికి మంచి అనుభవమే ఉండిఉంటుంది. విశాలసముద్రంమీద పయనించేటప్పుడు సంభవించే అవరోధాలన్నింటినీ తమ సామాన్యపు పడవ అధిగమించగలదనీ, సముద్రప్రవాహం తోడ్పాటే తమ్ము

ముందుకు నడిపించగలదనీ వారు అమాయికంగా విశ్వసించారు. అయినా ఈ వలస వెళ్ళినవారందఱూ అదృష్టవంతులనీ, అందఱూ కూడా ఆ నూతన భూభాగానికి చేరుకొన్నారనీ వేఱే చెప్ప నక్కఱలేదు. ఇంతమందీకూడా సాహసవంతులనీ, అపాయాలను ఎదుర్కొని నూతన భూభాగాన్ని కనిపెట్టాలనే ఉత్సాహంతో అలా ముందంజ వేశారనీ అనటంలో అసత్యం ఏమీ లేదు.

ఈ నాడు పసిఫిక్ మహాసముద్రంపైన పాలినేషియన్లు నివసించి ఉండటం చూస్తే, వీరు సామాన్య ప్రజలు కారనీ, పసిఫిక్ మహాసముద్రాన్ని దాటటంలో వీరి అభిప్రాయం ఏమైనప్పటికీ ఆ కర్తవ్యపాలనలో కృతార్థులైనారనీ ఋజువవుతున్నది.

1950 వ సంవత్సరం నాటి కోన్-టికీ సముద్రయాన కథలో పూర్వకాలంనాటి పాలినేషియన్ సంస్కృతి మనకు గోచరమవుతున్నది. జన్మతః నార్వే దేశానికి చెందిన థార్ హెయెర్డ్‌హాల్ ప్రకృతిశాస్త్రాభిమాని. ఇతను పాలినేషయన్ల వలసవిధానాన్ని మన దృష్టిపథానికి తెచ్చి అది ఒక సజీవసత్యంగా నిరూపించాడు. భౌతికశాస్త్రజ్ఞుడు కావటంచేత తాను చెప్పదలచుకొన్నదానిని విశదంగా తెలియబఱచాడు. తన సిద్ధాంతాన్ని ఋజువుపఱచటంకోసం, సహచరులైదుగురినీ ప్రోత్సహించి యాత్ర సాగించాడు. ఈ మహాకార్యం అతన్ని చిరస్మరణీయుడుగా చేస్తున్నది. ఈ యువకుల సాహసంవల్ల చారిత్రకులకూ, భూగర్భశాస్త్రజ్ఞులకూ అయోమయంగా కనబడుతున్న ఒక అద్భుతసమస్య సుపరిష్కృతమైనది. థార్ హెయెర్డ్‌హాల్


నేకులు ఉపయోగించకుండా ఇంకాస్ జాతివారి ప్రాచీన పద్ధ
తిని తొమ్మిది బాల్సా దుంగల తెప్పను నిర్మించి, దానినే
సముద్రతరణ సాధనంగా చేసి, దానికి ఇంకాస్ జాతిలో ప్రాచీ
నుడైన కోన్-టికీ పేరుపెట్టాడు.

ఈ యువకుల ఉత్సాహశక్తికి అడుగడుగునా పరీక్షలు
జరిగాయి. మనుష్యులను తినటానికి అలవాటుపడ్డ సొరచేప
లతో కలసిమెలసి ఉండవలసిన పరిస్థితులున్నూ కలిగాయి.
అయితే ఎట్టి పరిస్థితులలోనూ ఈ మిత్రమండలి స్థైర్యం చెక్కు
చెదఅకపోవటం, ఎంత విపత్తునైనా వినోదప్రాయంగా చూడటం
ఎవరికైనా ఆశ్చర్యం కలిగించే పరమసత్యాలు. వీటివల్ల ఈ
కోన్-టికీ యాత్ర ఒక అద్భుతగాథ అయింది.

ఈ సాహసయాత్రకు తగ్గ ప్రోత్సాహమూ, సహాయ
సంపత్తీ, శ్రేయోభిలాషులూ కొఅతపడలేదు. ఏది యేమైనా
కోన్-టికీ దక్షిణఅమెరికా తీరంనుంచి సుదూరభూములకు
బయలుదేఱుతున్నప్పుడు అది ఒక అవివేకపు కుతూహలంగానే
పరిగణితమైంది. అయితే నూటఒకటవరోజున ఆ పడవ నూతన
భూమి చేరుకోగానే ఆ యత్నమంతా ఒక మహాకార్యంగా
భావించగల విచిత్రవాతావరణం కలిగింది.


ఇంతకూ కోన్-టికీ యాత్రవల్ల ప్రాచీన ప్రజలు మహా
సాహసికులనీ, ఈ యిరవయ్యో శతాబ్దంలోని మనకు అసాధ్య
మనిపించే విధంగా తెప్పవంటి పడవమీదనే పెద్దపెద్ద సముద్ర
ప్రయాణాలు వారు చేశారనీ ఋజువవుతున్నది.

—ఎ. ఆర్. ఐరావతి.




కోన్-టికీ ప్రయాణం చేసిన మార్గం.

కోన్-టికీ నమూనా.





కల్లా హార్బరులో ప్రయాణానికి సిద్ధంగా ఉన్న నౌక. రెండు స్తంభాలకు మధ్య సమ
చతురంగా బిగించికట్టిన తెఱచాపతో అచ్చంగా " ఇండియన్ " పడవవలె ఉంది.

# కదలిమీద కోన్-టికి

## శాంతమహా సముద్రంమీద (i)

ఆరోజున కెల్లావ్ హార్బరులో మహా కోలాహలంగా ఉన్నది. కోన్-టికి సముద్రయాన ప్రారంభం ఆనాడే. నౌకా మంత్రి అప్పటికే గార్డియన్‌రయన్‌లాంచి ద్వారా మేము జలసంధి దాటడానికీ, తీరం పొడుగునా చేపలుపట్టుతూ ఉండే ఇండియన్ల పడవలవల్ల మా ప్రయాణానికి ఆటంకం కలుగకుండా చూడడానికీ తగిన యేర్పాట్లకు ఉత్తరువులు ఇచ్చాడు. పత్రికల్లో నలుపు ఎఱుపురంగుల శీర్షికలతో మా ప్రయాణ విషయం ప్రకటించడంచేత ఏప్రిల్ ఇరవైఎనిమిదో తారీఖున ఉదయానికే తీరాన జనం గుమిగూడి ఉన్నారు.

ఓడమీాదకు చేరుకోవలసిన మా అరుగురికీ ఆ చివరి నిమిషాల్లో చేయవలసిన పనులు ఏమీ లేవనే చెప్పవచ్చు. నేను తీరందగ్గఱకు వచ్చేటప్పటికి పడవమీాద హెర్మన్ కనిపించాడు. తీరానికి చాలాదూరంలోనే నేను కారు ఆపివేసి అక్కడనుండి నడిచే వెళ్ళాను. కాలుసాగేట్టు నడవడం మళ్ళీ ఎన్నాళ్ళకో అనుకొన్నాను. ఒక్కగంతుతో పడవమీాదకు దూకాను. బనానా గెలలతోనూ, పండ్లగంపలతోనూ, సంచులతోనూ నిండిఉండడంవల్ల అక్కడ అడుగుపెట్టే సందులేనట్టు కనిపించింది. ఆ గుట్టలమధ్య చేతిలో ఒక చిలకపంజరంతో హెర్మన్ కూర్చుని ఉన్నాడు. ఆ చిలకా, ఆ పంజరమూ రైమా

లోని మిత్రులెవరో అతనికి పిస్టోలు వేళ బహుమతిగా ఇచ్చారు.

హెర్మన్ నన్ను చూడగానే "ఒక్క నిమిషం ఈ చిలకను చూస్తూఉండు. నేను ఒడ్డుకు వెళ్ళి కడసారి గ్లాసెడుబీరు త్రాగిరావాలి. పడవ ఇక్కడ గంటలతరబడి ఉండదుగదా!" అన్నాడు.

తర్వాత, తన్ను వేలు పెట్టిచూపుతూ చేతులు ఊగించే జనసమూహాన్ని ఒత్తిగించుకొంటూ, అతికష్టంమీద అతను అవతలికి వెళ్ళిపోయాడు. ఇంతలోనే తన సంపూర్ణ వేగంతో గార్డియన్ రయస్ మేము ఉన్నచోటికి వచ్చించి. కోన్-టికీకి చేరుకొనే మార్గంఅంతా అరికట్టినట్లు ఉండి మహారణ్యంలో గాలికి ఊగే చెట్లలాగా అటూ ఇటూ ఊగుతూఉన్న తెరచాపకొయ్యలగుంపుదగ్గర లంగరు దించారు. మోటారు బోటు బయలు దేరింది గార్డియన్ రయస్‌లో నావికోద్యోగులూ, సినీమాఫొటోగ్రాఫర్లూ క్రిక్కిరిసిఉన్నారు. అధికారుల అనుమతికాగానే కెమేరాలు క్లిక్కుమన్నాయి. ఒక బలమైన మోకుతో రేవులోఉన్న పడవల్నీ తెప్పల్నీ ఒకదాని ఒకటి కట్టివేశారు.

నేను ఆందోళనతో "ఆగండి!" అంటూ, కూర్చున్న చోటినుంచే కేక వేశాను. "ఇంకా రావలసినంతసమయం ఉంది. రావలసినవాళ్ళు ఉన్నారు. వాళ్ళకోసం మనం ఆగాలి!" అని కూడా అన్నాను.

అయితే నామాటలు ఎవరూ అర్థంచేసుకున్నట్టు కనబడలేదు. అధికారులు మృదువుగా నవ్వి ఊరుకున్నారు.

పడవల ముందుభాగాలను మోకుల్తో బిగించి, అన్నింటినీ ఒకటిగా కట్టడం పూర్తి అయింది. నేను మోకు పడవమీదనుంచి విసిరి వేస్తూ, సాధ్యమైన అన్ని సంజ్ఞలవల్లనూ నా భావాన్ని వ్యక్తం చేశాను. ఇంతలో, చిలక ఈ అవకాశాన్ని బాగా వినియోగించుకొన్నది అది పంజరపు తలుపును ముక్కుతో నెట్టివేసి బయటికి వచ్చింది. నేను తిరిగి దానివంక చూచేసరికి, అది వెదురుగడల తెప్పమీద ఉత్సాహంతో తిరుగుతూ ఉన్నది. నేను దానిని పట్టుకోడానికి ప్రయత్నిస్తే, అది స్పెయిన్ భాషలో నన్ను మోటుగా తిట్టుతూ, బనానా గెలలవైపు ఎగిరింది. పడవలన్నింటినీ మోకుల్తో ముడిపెట్టే నావికుల్ని ఒకకంటకనిపెడుతూనే, చిలకను తరిమిపట్టుకోటానికి విశ్వప్రయత్నం చేశాను అది మూలుగుతూ, వెదురుకఱ్ఱలతో పడవమీద మేము ఏర్పాటుచేసుకొన్న గదిలో దూరింది. నేను దానిని వెన్నంటి, అది ఱెక్కలతో నన్ను వదలించుకోటానికి ఎంత ప్రయత్నంచేసినా, గట్టిగా ఒక కాలుపట్టుకొని, ఇవతలకు తీసుకువచ్చి, పంజరంలో పెట్టాను. ఇంతలో ఒడ్డున ఉన్న నావికులు పడవల త్రాళ్ళు విప్పివేశారు. వెనుకనుంచి ఉద్ధతంగా వచ్చిపడే అలలతాకిడికి పడవలు అటూ ఇటూ ఊగిపోతుంటే, మేము నాట్యం చెయ్యవలసి వచ్చింది. నాకు భయంతో ఏమీ తోచలేదు. ఒక తెడ్డు తీసికొని, రేవుదగ్గఱఉన్న దుంగలకు కొట్టుకొనేలాగా పడవను బలంకొద్ది త్రోసివెయ్యడానికి ప్రయత్నించాను. ఈలోపల మోటారుబోటు బయలుదేరింది. ఒక్క ఊపుతో కోన్ టికీ సుదీర్ఘ సముద్రయానానికి ముందుకు సాగింది. ఆ సమయంలో స్పెయిను మాటలుగొణిగే ఆ చిలక

తప్పితే, నాకు సహచరులు ఎవ్వరూ లేరు. ఒడ్డునఉన్న ప్రజలు హర్షధ్వానాలు చేశారు; చేతులు ఊపారు. పెరూనుంచి సాగే మా ఈసముద్రయానవిధానం అడుగడుగునా ఫొటోలు తియ్యాలనే ఆకాంక్షతో, మోటారు బోటులోఉన్న సినిమా ఫొటోగ్రాఫర్లు సముద్రంలో ఉఱికినంత పనిచేశారు. నేను నిరుత్సాహంతో పడవచెక్కమీద నిలబడి నా సహచరులకోసం ఎదురు చూశాను. ఒక్కరుకూడా రాలేదు. అందువల్ల అందఱమూ గార్డియన్ రయన్ సమీపించాము. అది లంగరుఎత్తి, ప్రయాణానికి సంసిద్ధంగా ఉన్నది. నేను త్రాటినిచ్చిన ఎక్కుతూ కూడా, ప్రయాణం అప్పటికాపుజేయించడానికీ, తిరిగి రేవులోకి పడవ పంపించడానికీ ప్రయత్నంచేశాను. మళ్ళీ మోటారు బోటు రేవుకు వెళ్ళింది. కొంతసేపటికి కన్నులవిందుగా స్పెయిన్ ఆఫీసర్లతో భర్తీఅయి తిరిగివచ్చింది. కాని కోన్-టికీ తప్పిపోయిన నా సహచరుల్లో ఒక్కరూకూడా అందులో లేరు. ఇంతమందీ రావడం చక్కగానే ఉన్నప్పటికీ, ఇందువల్ల నాసమస్య ఏమీ పరిష్కారంకాలేదు. మళ్ళీ ఒకసారి ప్రత్యేకంగా కోన్-టికీ ప్రయాణీకుల నిమిత్తం బోటు రేవులోకి వెళ్ళింది.

ఇంతలో ఎరిక్కూ, బెంగ్టూ చదవడానికి కావలసినన్ని పత్రికలూ, పుస్తకాలూ, ఇంకా ఏవేవో పట్టుకొని రేవుదగ్గఱకు వచ్చారు. ఇండ్లకు మరలిపోయే జనప్రవాహం వారికి ఎదురైంది. ఆ జనాన్ని తప్పించుకొనేసరికి, వారిని, అప్పుడే బయలుదేరిన ఒక పోలీసుకారు అడ్డగించింది. "ఇక ఇక్కడ చూడవలసిందేమీ లేదు." అని ఒకపోలీసు వారితో

అన్నాడు. బెంగ్టు సిగరెట్టు పొగ వదులుస్తూ, తాము వినోదం చూడ్డానికి రాలేదనీ, పడవలో తాముగూడా ఎక్కి వెళ్ళవలసి ఉన్నదనీ చెప్పాడు.

"అదేం లాభంలేదు," అన్నాడు కానిస్టేబులు విచారిస్తున్నట్టు. "కోన్-టికి గంటక్రిందటనే వెళ్ళిపోయింది," అని చెప్పివేశాడు.

తన చేతిలో ఉన్న ఒక బంగీ పోలీసుకు చూపుతూ, "అసంభవం! లాంతరు ఇక్కడనే ఉన్నది!" అన్నాడు ఎరిక్.

"అతను నావికుడు; నేను నౌకలోవారికి ఆహారవస్తువులు సరఫరా చెయ్యవలసినవాణ్ణి!" అన్నాడు బెంగ్టు.

ఇలా చెప్పి, వాళ్ళు ఇద్దరూ పరుగెత్తుకు వచ్చారుగానీ, అప్పటికి బోటు కదిలిపోయింది. దిగులుతో వాళ్ళు అటూ ఇటూ తిరుగుతుండగా, తప్పిపోయిన బోటుకోసం చూచే మరికొంతమంది వాళ్ళతో కలిశారు. ఇంతలో, బోటు తిరిగి వెళ్ళడం, వాళ్ళు దాంట్లో ఎక్కి రావడం జరిగింది. ఆరుగురమూ కలుసుకొన్నాము. గార్డియన్ రయస్ రివ్వున పోతుంటే, సముద్రం నురుగులు కక్కుతున్నది.

మేము రేవులో బయలుదేరేసరికి, మధ్యాహ్నం దాటింది. తీరంవెంట మా ప్రయాణానికి ఇండియన్ల పడవల వల్ల ఆటంకం కలగకుండా చూడడంకోసం మరునాటిఉదయం దాకా, గార్డియన్ రయస్ మాతోనే ఉన్నది. మేము తిన్నగా సముద్రం నోట్లోకి వచ్చేశాము. ఇక ఇండియన్ల పడవలవల్ల మాకు కలిగే ఆటంకం లేదని నిశ్చయమైంది. చిన్నపడవలు

ఒకదానివెంట ఒకటి వెనక్కి మళ్ళాయి. ఇంకా కొంతదూరం కనిపెట్టి ఉండడంకోసం పెద్దపడవలు మాతో వచ్చాయి.

గార్డియన్ రయస్ వెంట వస్తుగత్తే కోన్-టికీ మెడకు త్రాడుగట్టి యీడ్చుకుపోతుంటే, కోపంతో గంతులువేస్తూ పోయే మేకపోతులాగా ఉన్నది. సముద్రజలం ఇటువైపులా పైకి చిందుతోంది. అతి ప్రశాంతంగా ఉన్న ఇక్కడే ఇలాఉండడంవల్ల, ముందుజరిగే ప్రయాణాన్ని తలచుకొంటే, మాకు కొంచెం భయం కలిగింది. అంతలోనే గార్డియన్ రయస్‌తో మా పడవను బంధించివున్న త్రాడు తెగిపోయింది. అది గబగబా పోతూఉంటే, త్రాడు కాస్తా నీళ్ళల్లో మునిగిపోయింది. మేము పడవప్రక్కలకుచేరుకొని, త్రాడుకోసం నీళ్ళల్లో చేతులు పెట్టి వెతుకుతూఉంటే, పెద్దపడవలు గార్డియన్‌రయస్‌ను ఆపటానికి ప్రయత్నించాయి. పడవప్రక్కల్ని పెద్దపెద్ద జెల్లీచేపలు ఎగిరిపడడం మొదలుపెట్టాయి. అందువల్ల త్రాడు దొరకడం కష్టమైంది. పడవ ఒకప్రక్కకుఒరిగిపోతుంటే, మహాప్రయాసతో ఎలాగో త్రాడు వెతికివట్టుకోగలిగాము. ఇంతలో పడవ బాగా ఒరిగింగి మాతలలు సముద్రపునీళ్ళల్లో మునిగాయి. ఉప్పునీళ్లూ, జెల్లీచేపలూ మాతలలమీద నాట్యంచేశాయి. ఉప్పునీటిని ఉమిసి, జెల్లీచేపల్ని తిట్టుకొంటూ, మాతలల్లో చిక్కుపడ్డ వాటి పొలుసుల్ని దులుపుకొన్నాము. ఇంతలో గార్డియన్ రయస్ దగ్గఱకు వచ్చింది. తెగినత్రాడు ముడివేయబోతున్నాము. ఈలోపున గార్డియన్‌రయస్ వేగానికి పొంగివచ్చే నీళ్ళు మమ్మల్ని సముద్రంలోపలికి నెట్టివేసేట్టు కనిపించి, మేము దాని క్రింద పడిపోతామనే అనుకొన్నాము. మాదగ్గఱ ఉన్న

నన్నీ విసరివేసి, వెదురుగడల్తో, తెడ్లతో మమ్మల్ని మేము రక్షించుకోటానికి ప్రయత్నించాము. ఆ ప్రయత్నాలేమీ ఫలించలేదు. మేము గార్డియన్‌రయన్ క్రింద పడిపోయే స్థితిలో ఉన్నాము. దానిమీద జనం ఇటూ అటూ కంగారుగా పరుగెత్తుతున్నారు; కేకలు వేస్తున్నారు. అదృష్టవశాత్తూ గార్డియన్‌రయన్ కొంచెం మరోవైపు జరగడంవల్ల, మాకు ప్రమాదం తప్పింది. పడవమీదకు మాటిమాటికీ అలలు విరిగిపడుతున్నాయి గానీ, కొంతసేపటికి వాటి తీవ్రత తగ్గింది.

అప్పుడు హెర్మన్ ఇలా అన్నాడు: "ఒక పనికి ఇలా అనేక విఘ్నాలు తటస్థిస్తే, ఫలితంమాత్రం తప్పకుండా అనుకూలమవుతుంది. గార్డియన్‌రయన్ కనక తిరిగి రాకపోతే, మనపడవ ఈపాటికి ముక్కలుముక్కలయేది."

రాత్రిఅంతా ప్రయాణం నిదానంగా జరిగింది ఎక్కడో ఒకటిరెండుచోట్ల తీవ్రత కలిగినా, ప్రమాదం జరుగలేదు. పెద్ద పడవలు మమ్మల్ని ఎప్పుడో విడిచిపెట్టిపోయాయి. తీరాన కనబడే చిట్టచివరి దీపంకూడా అదృశ్యం అయింది. అప్పుడప్పుడు ఏవో కొన్ని ఓడలదీపాలు కనబడుతూ వచ్చాయి. మేము రాత్రిఅంతా రెండువంతులుగా కాచిఉండి, పడవకుకట్టిన త్రాటిమీద ఒక కన్ను పెట్టుకొనిఉన్నాము. అందఱమూ వంతుల ప్రకారం కాపలావేసికోవటంచేత హాయిగా నిద్రపోగలిగాము కూడాను. తెల్లవారేసరికి పెరూతీరం అంతా మంచులోమునిగిపోయింది. పడమటివైపు నీలాకాశం కనిపిస్తున్నది. చిన్నచిన్న తెల్లని నురుగుకెరటాలతో సముద్రం ప్రశాంతంగా కదలిపోతున్నది. మాబట్టలూ, చేతుల్లో ఉన్న తెడ్లూ, సమస్తం మంచుతో

తడిసి నానిపోయాయి. బాగా చలిగా ఉన్నది. మాచుట్టూ ఉన్న పసుపుపచ్చని నీరు పన్నెండు డిగ్రీల ఉష్ణతలో మరీ చల్లగా ఉండి, వేలు పెడితే కఱిచేట్టున్నది. దీన్ని హాంబోల్టు ప్రవాహం అంటారు. ఇది అంటార్కిటిక్ నుంచి వస్తూ ఉంటుంది. పెరూతీరం వెంట ఉత్తరానికి సాగిపోతుంది. అటనుండి పడమటికి మళ్ళి, సముద్రంపైన భూమధ్యరేఖకు దిగువగా పోతుంది. ప్రాచీన స్పెయిను నావికులు పిజారో, జాకేట్ మొదలయిన వారు "ఇంకాస్" ఇండియనుల పెద్దపడవల్లో ఇంతవఱకూ వచ్చారు. ఆ పడవల్లో ఇంతదూరమూ వచ్చి, ఈ హాంబోల్టు ప్రవాహంలో ఇండియనులు చేపలుపట్టేవాళ్ళు. పగలంతా ఇక్కడ గాలి సముద్రంవైపు వీస్తే, సాయంకాలానికి తీరంవైపు వీస్తుంది. అందుచేత వాళ్ళు ఇండ్లకు వెళ్ళిపోవడం ఆ సమయంలో అతిసుకరం.

గార్డియనరయన్ మాకు చేరువగా ఉండగా, కోన్-టికీ నుంచి మేము ఒక రబ్బరు డింగీలో వినోదంకోసం ఎక్కాము. అది అలల తాకిడికి ఫుట్‌బాల్‌లాగా దొరలడానికి సిద్ధమైంది. బెంగ్టూ, ఎరిక్కూ, నేనుకూడా నాట్యం చెయ్య వలసి వచ్చింది. తత్క్షణం గార్డియన్‌రయన్ త్రాటినిచ్చేన పట్టుకొని, పైకి వెళ్ళి, ఆ అపాయం తప్పించుకొన్నాము. బెంగ్టు ఆ సమయంలో మా ఉనికి పటంలో చూపించాడు. కెల్లా హార్బరుకి వాయవ్యంగా 50 మైళ్ళ దూరాన ఉన్నాము. మొదటి కొన్నిరాత్రులు మేము తప్పకుండా దీపాలు వెలిగించాలి. లేకపోతే తీరంవెంట వచ్చే ఓడలకు చీకట్లో మా ఓడ కనబడకపోవచ్చు; మేము దానిక్రింద పడిపోవచ్చు కూడా.

కొన్నాళ్ళు గడచిన తరువాతనైతే అటువంటి ప్రమాదం ఉండదు. అసలప్పుడు మాకు ఓడ అన్నదే కనబడదు. ఎందు వల్లనంటే పసిఫిక్ రెండో ప్రక్కకు ఓడల ప్రయాణం చెయ్యటం అంతవరకు సాగలేదు.

గార్డియన్‌రయన్‌లో ఉన్న వారందరిదగ్గర సెలవు తీసికొని, మేము రబ్బరుడింగీలో ఎక్కి, అటూఇటూ ఊగుతూ కోన్-టికీలో ఎక్కాము. తిరిగి వెళ్ళేవాళ్ళంతా మావైపే చూస్తున్నారు. ఆ 35 మందీ అలాగే నిలబడి, చూస్తూఉంటే, మేము ఆరుగురమూ పెట్టెలమీద కూర్చుండి, వాళ్ళు కన బడుతూ ఉన్నంతవరకూ అటే చూస్తున్నాము. గార్డియన్ రయన్ వెడల్పగక్కే పొగచాలుకూడా అదృశ్యమైన తర్వాత మేము పరస్పరం చూచుకొన్నాము.

టార్‌స్టీన్ గార్డియన్ రయన్‌లోని మిత్రులకు బిగ్గరగా వీడ్కోలు పలుకుతూ, మాతో "బాలకులారా! ఇక మనం ఇంజన్ నడిపించాలి," అన్నాడు.

మేము పక్కన నవ్వాము. గాలి సాగింది. అయితే అది మందమందంగా దక్షిణంనుంచి ఆగ్నేయానికి వీస్తున్నది. అప్పుడు మేము మా వేణు స్తంభాన్ని నలుచదరపు తెరచాప గుడ్డతో తిన్నగా నిలబెట్టాము. అది ప్రక్కకి ఒరిగిపోతూ, కోన్-టికీ అసంతృప్తి వదనంలాగా కనిపించింది.

ఎరిక్ ఇలా అన్నాడు: "ముసలివాడికి ఈగాలి నచ్చినట్టులేదు. పడుచుదనంలో ఇంతకంటె స్వచ్ఛ మారుతాన్ని సేవించి ఉంటాడు."

"మనం దారితప్పుతున్నట్లున్నది," అంటూ, హెర్మన్

బాల్సాకొయ్యముక్క ఒకటి కోన్-టికీ ప్రక్కనే నీళ్ళలో వేశాడు.

“ఒకటి - రెండు - మూడు......ముప్పైతొమ్మిది - నలభై-నలభై ఒకటి” అని లెక్కపెట్టాడు.

ఆ కొయ్యముక్క అలాగే కదలకుండా ఉన్నట్లుఉంది. అన్ని అంకెలు లెక్కపెట్టడం జరిగినా, అది మా ఓడపార్శ్వాన సగందూరమైనా గడవలేదు.

టార్‌స్టీన్ భాపిశుభం సిద్ధాంతీకరిస్తున్నట్లు, “మనం దానితో వెళ్ళాలి!” అన్నాడు.

“సాయంకాలవాయువు మనల్ని తీరానికి నెట్టకుండా ఉండాలి! కెల్లా హార్బరులో మనకు వీడ్కోలు ఎంతో వినోదంగా నడిచింది. తిరిగి మనకు స్వాగతంలేకుండా పోతుందేమో!” అన్నాడు బెంగ్టు.

ఇప్పటికి ఆ కొయ్యముక్క ఓడ అగ్రాన్ని సమీపించింది. మేము జయజయధ్వనులు చేశాము. ఓడపార్శ్వాన ఉన్న వస్తువులన్నీ గబగబా సర్ది, స్టౌ వెలిగించాము. బెంగ్టు ఒక ఖాళీపెట్టెలో ప్రిమస్ స్టౌ ఉంచాడు. కొద్దిసేపట్లో మేము ఇన్ని బిస్కట్లుతిని, వేడికోకోతోపాటు కొబ్బరినీళ్ళు బొండానికి రంధ్రంచేసి, త్రాగివేశాము. బనానాపళ్ళు ఇంకాపూర్తిగా పండలేదు.

“మనం ఇప్పుడు ఒకదారినపడ్డాం,” అని ఎరిక్కు చమత్కరించాడు. గొర్రెచర్మంతో కుట్టిన పెద్ద ట్రౌజర్లతో, ఇండియన్ టోపీతో, భుజాన చిలకతో అతను విచిత్రరూపంలో కనబడుతున్నాడు.

"నాకు నచ్చనిదల్లా ఒకే ఒక చిన్న సంగతి. మనం ఇలాగే ఇక్కడ పడుకొని ఉంటే, మనకు పరిచితాలు కాని ఈ ప్రవాహాలేవైనా మన నావని తీరంవైపు నెట్టవచ్చు. అక్కడ ఉండే శిలాశ్మృకు మన నావ కొట్టుకొని ముక్కలు కావచ్చు." అన్నాడతను.

తెడ్లు ఉపయోగించాలని మేము ఒక నిర్ణయానికి వచ్చాము. అయితే వచ్చేగాలిని కనిపెట్టి మళ్ళీ ఆపని చెయ్య వచ్చునని అనుకొన్నాము.

అంతలో గాలి సాగింది. ఆగ్నేయంనుంచి ప్రశాంతంగా వీస్తున్నది. తెఱచాప గాలితో ముందుకు ఉబికి, ఉచ్ఛ్వాస్వసంతో పైకి ఉబికే వక్షస్థలంలాగా కనిపించింది. కోన్-టికీ నీళ్ళతో దెబ్బలాటకు తల ముందుకు చాచి, పోతున్నట్టున్నది. మేము 'పడమటికి! పడమటికి!' అని కేకలు వేస్తూ, నావ త్రాళ్ళూ, లంగరూ భద్రంగా పట్టుకొని, నావను ముందుకు నడపడానికి ప్రయత్నించాము. చుక్కాని పట్టి, తెడ్లు నీళ్ళల్లో బలంగా తోస్తూఉంటే, ప్రయాణ కాలసూచి లబగబా పని చెయ్యడం ప్రారంభించింది. కాగితపు ఉండలూ, కొయ్యముక్కలూ నీటిలో విసిరి, ఆతురతతో పరికించాము.

"ఒకటి-రెండు-మూడు-పద్దెనిమిది-పందొమ్మిది..... ఇప్పుడు!" ఆ కాగితపు ఉండలూ, దారుఖండాలూ చుక్కాని దాటి త్వరలోనే ముత్యాలహారంలో ముత్యాలలాగా అలలో మునుగుతూ, తేలుతూ దూరంగానే ఉండిపోయినాయి. గజం గజం మేము ముందుకు వెళ్ళాము. కోన్-టికీ నీళ్ళల్లో చురుగ్గా చొచ్చుకొని పోతున్నట్టులేకున్నా, నిబ్బరంగా, అలలకి వెను

కీయకుండా సాగిపోతున్నది. తొందరలేకపోయినా, వెనక్కి పోవడంమాత్రంలేదు. అంతో ఇంతో పురోగమిస్తూనేఉన్నది.

'నావని ఏవిధంగా నడిపించాలి?' అనేది ఆ క్షణంలో మాకు ఒక సమస్యగా కనిపించింది. స్పెయిను దేశీయులు వర్ణించినట్టుగానే నావను నిర్మించడం జరిగింది. అయితే సము యానికి ఆచరణపూర్వకంగా ఇండియను నావను నడిపిచూపే వాళ్ళెవ్వరూ బ్రతికిఉన్నవాళ్ళల్లో కనపడలేదు. ఆ సమస్యను గురించి తీరాన ప్రవీణులతో చర్చలు జరిగాయిగాని, ఫలితం మాత్రం చెప్పదగ్గది కనబడలేదు. ఆ విషయంలో మా కెంత తెలుసునో వారికీ అంతే తెలుసు. ఆగ్నేయపవనం సాగినకొద్దీ, తెరచాప దానికి ఎదురుగాకుండా ఉంచడం అవసరం అయింది గాలికి గురిగానక అయితే, అది మా మీదకు త్రోసుకొనివచ్చి క్రమంగా నావయావత్తూ తిరిగిపోయేటట్టు ఉన్నది. ముగ్గురు తెరచాపతో కుస్తీపడుతుంటే, ముగ్గురు చుక్కానిపట్టుతూ, తెడ్లతో, పవనానికి గురికాకుండా, నావను నడిపించవలసి వచ్చింది మేము తెరచాపను త్రిప్పివేయగలిగేసరికి, పడవ నడుపుతూ ఉన్నవారు మళ్ళీ అటువంటి ప్రమాదం తటస్థించ కుండా, జాగరూకతతో వ్యవహరించాలి.

చుక్కాని తెడ్డు పందొమ్మిది అడుగుల పొడుగు. అది ఒక పెద్ద దుంగమీద రెండు మేకులమధ్య అమర్చబడిఉన్నది. ఈక్వేడార్ లో పాలంకీకి దిగువ కలప తెచ్చేటప్పుడు ఉపయోగిం చింది ఇదే తెడ్డు. మాంగ్రోవుకర్రతో చేసినచుక్కాని స్తంభం ఉక్కుకడ్డీలాగాఉన్నది. నీళ్ళల్లోపడితే ఆబరువుకి మునుగుతుందే గాని తేలదు. ఆ స్తంభానికి పైన ఫిర్ కొయ్యతో చేసిన తెడ్డు

బంధించబడి ఉన్నది ఈ చుక్కాని గట్టిగా పట్టుకోడానికి మా తలప్రాణం తోకకు వచ్చింది. తెడ్డుకొన నీళ్ళలో నిలబడేట్టు పట్టుకోవడంవల్ల, మా వ్రేళ్ళు బాగా నొప్పిపెట్టాయి. ఈ చుక్కాని తెడ్డుపైన అడ్డంగా ఒక కొయ్యముక్క బిగించితే, పట్టుకోడానికి వీలు ఉంటుంది,' అని తోచింది. తోచింది తోచినట్టు ఆచరణలో పెట్టాము అప్పటికి ఒక బాధనుంచి విముక్తి లభించింది. ఇంతలో గాలి వేగం హెచ్చింది.

సాయంకాలంనుంచీ వ్యాపారపవనం బలంగా వీస్తూనే ఉన్నది. దానిమూలాన సముద్రం చెలరేగింది. సముద్రం దాటడంఅంటే ఎలాంటిదో ఆ సమయంలో మాకు బోధపడ్డది. మాకు చుట్టుప్రక్కల ఎవరితోనూ ఏవిధమైన అనుబంధమూ ఉండడానికి వీలు లేదు. మాసంగతి ఇతరులకు తెలియదు; ఇతరుల సంగతి మాకు తెలియదు. మా నావ నాణ్యం ఒక్కటే మమ్మల్ని గట్టెక్కించాలి. అప్పుడు తీరానికిచేర్చే గాలి వీచటంగానీ, మేము ప్రయత్నించినా వెనక్కి వెళ్ళగలగడంగానీ అసంభవం అని గ్రహించాము. ఈ పవనంవల్ల మేము రోజురోజూ ముందుకు పోతూఉంటాము. తెరచాప చక్కగా ఎత్తిఉంచి, వీలయినంతత్వరగా ప్రయాణంసాగించడమే, మేము అప్పుడు చెయ్యవలసిన పని వెనక్కి కనక తిరిగితే, సముద్రం పాలుగావడం ఖాయం. ప్రొద్దు తిరిగే దిక్కుకు ఒకేవిధంగా పోతూఉండడమే మావంతు కోన్-టికీగాని, ప్రాచీన సూర్యభక్తులుగాని, పెరూతీరంనుంచి సముద్రంలోకి బలాత్కారంగా కొనిపోబడుతున్నప్పుడు ఇల్లాగే చేసిఉండాలి.

అలలు ఉవ్వెత్తుగా వస్తూఉంటే, మా నావ పైకిలేచి, నిర

ప్రాయంగా పురోగమిస్తోంది అప్పుడు మాకు కలిగిన ఆనందం వర్ణనాతీతం అయితే చుక్కాని పట్టే మనిషి మాత్రం నలిగిపోతున్నాడు. ఒక్కొక్క అల వచ్చినప్పుడు చుక్కాని తెడ్డు చెయ్యి జారిపోతున్నది. లేదా ఒకప్రక్కకి ఒరిగిపోతున్నది. అక్కడ ఇద్దరు మనుష్యులు ఉన్నా, విరిగిపడే కెరటాలవల్ల చిందే నీళ్ళతో తడిసిపోతూ, ఎంతోసేపు అక్కడ నిలువలేకపోతున్నారు. 'ఇది లాభంలేదు,' అనుకొన్నాము. మోకుల్తో చుక్కాని అటూ ఇటూ ఒరిగిపోకుండా కట్టివేయాలనీ, అలాచేస్తే కొంతశ్రమ తగ్గుతుందనీ అనుకొన్నాము. వెంటనే ఆ పని చేశాము. 'అమ్మయ్య!' అనుకొన్నాము.

అంతలో, అలకూ అలకూ ఉండే అంతరం మరీ అగాధంగా కన్పించడం మొదలుపెట్టింది. హంబోల్టు ప్రవాహంలో అత్యంత వేగం కలచోటికి వచ్చామని గుర్తించాము. ఇక్కడ ప్రవాహవేగంవల్లనే సముద్రం కల్లోలిత మవుతున్నది గాని, గాలివల్ల గాదు. నీరు పసుపుపచ్చగానూ, చల్లగానూ ఉంది. పెరూ దేశపు పర్వతపంక్తి తీరాన క్రమ్మినమబ్బుల్లో లీనమై పోయింది. సముద్రంఅంతా అంధకారమయం అయింది. మేము మా పరికరాల్తో దంద్వయుద్ధం ప్రారంభించాము. సముద్రం ఎప్పుడు ఏ అపాయం తెచ్చిపెట్టుతుందో, అని భయపడ్డాము. తెరచాపకొయ్యమీద ఎక్కి ఉన్న మమ్మల్ని అంత ఎత్తునా సాగివచ్చే నురుగు ముంచుతూ, పోతూఉంది. అనుక్షణం భయ వివశులం ఔతున్నాము. 'గండం గడిచింది,' అనుకొంటున్నాం. విచిత్రంగా కోన్-టికీ అలలతోపాటు మిన్నంటిపోతూ ప్రయాణిస్తున్నది. అల గడవగానే క్రిందికి వస్తున్నది. పెద్ద పెద్ద కెర


టాలు ఒకదానిని ఒకటి వెంటాడుతున్నవి. ఏమాత్రమైనా వ్యవధానం కనబడితే, చిన్న చిన్న కెరటాలు వచ్చిపడుతున్నవి. ఒక పెద్ద అలతో నావ పైకి లేస్తుంటే, దాని వెంట వచ్చిన మరో పెద్ద అల నావ అంచుకు తగిలిపోతున్నది. చుక్కాని పట్టే వాళ్ళు రొమ్ముచుట్టూ త్రాడుకట్టుకొని ఉండడం, ఆ త్రాటి కొనలు నావకు గట్టిగా బిగించడం తప్పనిసరిగా కనిపించింది. అంతకంటె వేరే రక్షణోపాయం కనిపించలేదు. తెరచాప గాలికీ, అలలకూ భగ్నం కాకుండా, చూడవలసిన బాధ్యత పైనబడింది. నేను ఒక ప్రాచీనపు కంపాసు తయారుచేసి పెట్టుకొన్నాను. ఎరిక్కు దాని సహాయంతో మా ప్రయాణ వేగమూ, మా ఉనికీ నిర్ణయం చేయవలసి ఉన్నది. కాలం గడచినకొద్దీ, ఆకాశం అంతా మేఘాచ్ఛాదితం కావడంవల్ల, మేము ఎక్కడఉన్నదీ, మాకు తెలియడంలేదు. ఇద్దరు మనుష్యులు చుక్కాని దగ్గర కుస్తీపట్టుతూఉంటే, తక్కినవాళ్ళు వేణుమందిరంలో కాస్త నడుం వాలుస్తున్నారు. మరీ పెద్ద కెరటం వచ్చినప్పుడు చుక్కానిదగ్గర ఉన్నవాళ్ళు అవి వదలి పెట్టి, వేణుమందిరంతో చేరిఉన్న గడమీదికి ఎక్కి, తమ్ము తాము రక్షించుకొంటూఉంటే, ఆ కెరటం నావనావా తుడిచి పెట్టినట్టు చేసిపోతున్నది. మళ్ళీవాళ్ళు క్రిందికి దిగివచ్చి, యథాస్థానాల్లో చేరుకొంటున్నారు. నావకనక అభిముఖ్యం మార్చుకోకపోతే, ఆ నీరు వేణుమందిరంకూడా ప్రవేశించేట్లు ఉన్నది. వెదురుగడల్తో నావ పార్శ్వం కట్టివేసి ఉండడంవల్ల, నావ మీదికి వచ్చిన నీరు మళ్ళీ క్రిందికి పోతున్నది. లేకపోతే వేణు మందిరం ప్రవేశించేదే. దీంట్లోఉన్న సౌకర్యం ఇదే.

నడిరాత్రికి ఉత్తరాన ఒక ఓడదీపం కనిపించింది. మూడు గంటలవేళ మరొకటి కనిపించింది. నేము మాదీపాన్ని ఉన్నతంగా ఉంచి, టార్చిలైటు ప్రసరింపజేస్తూ, ఆ ఓడలవాళ్ళని పిలిచాము; కాని మా పిలుపు వాళ్ళకి వినబడలేదు. క్రమంగా ఆ దీపాలు మాకు దూరమైపోతూనచ్చాయి. తమకు సమీపంలో ఇంకా ఒక నావ ఉన్నదనేవిషయం ఆనౌకలవాళ్లు గుర్తించనేలేదు. మాదే చిట్టచివరినావ అనీ, రెండోఒడ్డు చేరేవఱకూ, మనుష్యుల పొడ అనేదే కనబడదనీ నేము ఊహించాము.


నేము ఈగల్లాగా, ఇద్దఱితర్వాత ఇద్దఱం చుక్కాని మీదికి వాలుతున్నాము. నానావస్థలూ పడుతున్నాము. చుక్కానివట్టడంతో, నీళ్ళతో నానడంతో మా చేతులు కొయ్యబాఱిపోయాయి. కొన్ని రాత్రులూ, పగళ్ళూ ఇల్లా అవస్థలు పడడంతో, నౌకానిర్వహణంలో మాకు మంచి ప్రావీణ్యం కలిగింది. వంతులప్రకారం ఒక్కొక్కరం రెండుగంటలు పని చేస్తూ, మూడుగంటలు విశ్రాంతి తీసుకొంటున్నాము. చుక్కాని దగ్గఱమాత్రం గంటగంటకీ మనిషిని మారుస్తున్నాము. అక్కడ ఉన్నవాళ్ళకి నరనరం తోడుకుపోయేటంతగాపని! ఒకవైపు తెడ్లు వేసివేసి, అలసటవస్తే రెండోవైపుపోతూ, ఆ కొంచెం విశ్రాంతికే సంతృప్తిపడుతున్నాము. ఒక్కొక్కప్పుడు తెడ్డు చేతబట్టడానికే ఓపిక లేక, గ్రుడ్లప్పగిస్తున్నాము. విశ్రాంతిసమయం వచ్చేసరికి, ఉప్పునీళ్ళతో తడిసినబట్టలతోనే, వేణుమందిరంలో మామా శయ్యలమీద వాలిపోతున్నాము. నావతో అనుబంధం తప్పకుండా ఉండడానికి, త్రాళ్ళతో కాళ్లుకూడా



అంతకంతకు ముందుకు చొచ్చుకు వస్తున్న తిమింగిలం.




సొరతిమింగిలం వీపు ఱెక్క — ఎంత పెద్దదో చూచారా!




ప్రపంచంలో చేపలన్నింటికన్న పెద్ద చేప — సొర తిమింగిలం.



మొట్టమొదట దర్శనమిచ్చిన పాము చేప (జింపిలస్)
ను పరిశీలిస్తున్న రాబీ.



రయోరియా పగడపు దీవి మీద చిక్కుకుపోయిన కోన్-టికీని క్షణ క్షణం సముద్ర తరంగాలు ముంచెత్తి వేసేవి.



నౌకాస్తంభం విఱిగిపోయి, వేణుమందిరం కూలిన కోన్-టికీ శిథిలావస్థలో.

కట్టివేసుకుంటున్నాము. అంతలో అల ఒకటి ఆ(త్రాళ్ళదాకా వచ్చిపోతోంది. ఇంతలో మూడుగంటలూ గడవడం, మళ్ళీ ఒకడు బయటికి వెళ్ళి, చుక్కానిదగ్గఱ ఉన్నవాళ్ళల్లో ఒకర్ని కార్యభారంనుంచి విముక్తుణ్ణి చెయ్యడం జరుగుతున్నది.

మఱునటిరాత్రి పరిస్థితి ఇంకా విషమించింది. సముద్ర తరంగాలు తగ్గడానికి బదులు హెచ్చిపోయాయి. చుక్కాని తెడ్డుతో రెండుగంటలు అవస్థపడడం అశక్యమనిపించింది. ఎవళ్ళ మైనా మొదటిగంటలో ఉన్నంత చుఱుగ్గా రెండోగంటలో ఉండలేకపోతున్నాము. కెఱటాలు మా బలహీనతను గమనించి మఱీ చెలరేగడం మొదలుపెట్టాయి. అన్నివైపులా దాడిచేస్తూ నావని నీళ్ళతో ముంచివెయ్యడానికి పూనుకొన్నాయి. అప్పుడు చుక్కానిదగ్గఱ గంటకంటె ఉండవద్దనీ, అక్కడగంటసేపు పనిచేసినవాళ్ళు గంటన్నర విశ్రాంతి తీసుకుందామనీ అనుకున్నాము. అలాఅరవైగంటలు అలలతోఎడతెఱపి లేని పోరాటం సాగింది. ఉచ్చతరంగాలూ, నీచతరంగాలూ, సూచీవీచికలూ, వర్తుల వీచికలూ, ఏటవాలు కెరటాలూ, కెరటాలమీది కెఱటాలూ ఇల్లా రకరకాల అలలు వస్తున్నాయి. మా అందఱిలోనూ నట్ చాలా శ్రమపడ్డాడు. అతన్ని చుక్కానిదగ్గఱ పనిచేసేభారంనుంచి తప్పించాము. అయితే దీనికి బదులుగా అతనికి మఱోకపని అప్పగించాము. అతను మా అందఱిపక్షానా వరుణప్రార్థన చెయ్యాలన్నాము. వేణు మందిరంలో ఒకమూల కూచ్చుని అతనితిప్పలతను పడుతున్నాడు. పంజరంలో చిలక చిఱచిఱలాడుతున్నది. పంజరపు చువ్వలు కఱచిపట్టి ఊగుతున్నది. అలల తాకిడికి నావ కీచు

మన్నప్పుడల్లా, కెరటాలు వేణుమందిరాన్ని తాకిపోయినప్పుడల్లా, చెక్కలు టప టపలాడిస్తూ గందరగోళం చేస్తున్నది. కోన్-టికి కూడా అంత ప్రశస్తంగా సాగడంలేదు. అయితే ఆ మాత్రపు వడసలన్నింటికంటెనూ అది నిబ్బరంగా కెరటాల్ని ఎదుర్కొంటూనే ఉన్నది. కాని ఏ సమయానికి నావ ఎటు ఒరుగుతుందో ఊహించడానికి వీల్లేదు. నావను సుకరంగా నడపడం మాకు చేతకానేకాదు. ముందుకు సాగినప్పుడల్లా అది కీచుకీచుమంటున్నది.

మూడో రాత్రి గాలివిసురు ఏమీ తగ్గకపోయినా కెరటాలు మాత్రం కొంచెం మందగించాయి. అయితే సుమారు నాలుగు గంటలవేళకు కటికిచీకట్లో నురుగులు గ్రక్కుతూ ఒక కెరటం వచ్చిపడ్డది. చుక్కానిదగ్గర ఉన్నవాళ్లు అసలు ఏమి జరుగుతున్నదీ తెలుసుకోగలిగేముందే, అది నావని కుడివైపున తాకి గిఱ్ఱున త్రిప్పివేసింది. తెఱచాప వేణుమందిరంమీద పడిపోయింది. ఆ దెబ్బతో రెండూ ముక్కలైపోవలసిందే. అందఱమూ తత్క్షణం అక్కడికి వెళ్ళి, తెఱచాప యథాప్రకారంగా నిలబెట్టి, గాలివాటానికి అనువుగాచేసి నావను సక్రమంగా నడపించడానికి విశ్వప్రయత్నం చేశాము. నావ ఎంతమాత్రమూ చక్కబడలేదు. మొఱటుగా సాగిపోతోంది. ఫలితం ఏమిటీ అంటే, తెఱచాపను సరిచెయ్యబోయినవాళ్ళిద్దరు అందులో చిక్కుకొని అసలు కనబడకపోయారు. ఇంతలో సముద్రం కొంచెం శాంతించింది స్వాధీనం తప్పి, పుండ్లుపడి, పొట్టురేగిన చేతులతో, మూతలుపడుతున్న కండ్లతో మేము ఎందుకూ పనికిరానివాళ్ళంగా ఉన్నాము. అప్పటికైనా వాతావరణం

కొంచెం అనుకూలమైతే, మేము కొంచెం కోలుకోవచ్చును. కాని ముందు జరుగబోయేది ఎవరు చెప్పగలరు? కనుక మేము తెఱచాపను వేణుమందిరానికి చేర్చి బిగించాము. కోన్-టికీ అలలఅంచుమీద తేలిపోతూఉన్నది. నావపార్శ్వాన ఉన్నవన్నీ సర్ది వేశాము. ఆఱుగురమూ వేణుమందిరం లోపల దూరాము. పిల్లి పిల్లల్లాగా నిశ్శబ్దంగా పండుకొన్నాము. ఈ సముద్రయానంలో శ్రమఅంతా ఇంతటితో తీఱిందని మేము అనుకోలేదు. ఇంకాఎంతోదూరంపోతేనేగాని "ఇంకా"ల నౌకా నిర్వహణ చాతుర్యం మాకు పట్టుపడదు.

తెల్లవాఱి ఎంతోప్రొద్దు ఎక్కేవఱకూ మేము నిద్ర లేవలేదు. మేము మేలుకొనేసరికి పంజరంలో చిలక రణగుణ ధ్వనిచేస్తూ గంతులువేస్తున్నది. బయట సముద్ర తరంగాలు ఉవ్వెత్తుగా వస్తూనేఉన్నాయిగాని, గతదినానఉన్నంత భయంకరంగా గజిబిజిగాలేవు. మాకు మొట్టమొదట కనిపించిన దృశ్యం: వేణుమందిరాన్ని సువర్ణమయంగా చేస్తున్న సూర్యకిరణాలు. ఆ మనోహరకాంతుల్లో బాహ్యప్రపంచం యావత్తూ మాకు ఆ ప్తమిత్రంలాగా కనిపించింది. నావలోమాకు ప్రశాంతంగా గడచిపోతూఉంటే, సముద్రం ఎంత ఉప్పొంగితే మాత్రం మాకేమి? మా నాసికల్ని అందుకొనేటంత ఎత్తుగా మాముందు నృత్యంచేసే తరంగాలు మఱుక్షణంలో నావ అడుగున పడిపోయి, చదునైపోతా యని అనుభవం వల్ల తెలుస్తూఉండగా, భయంకరాలైన జలపర్వతాలు ఎంత ఎత్తుకు మమ్మల్ని ఎత్తివేసినా, అంతలోనే మాకు అడుగున పడి అణగిపోతూఉండగానూ భయమేమిటి? ప్రాచీనులైన

పెరూదేశీయులు నీళ్ళతాకిడినుంచి తట్టుకొనేవిధంగా నావను బోలుగా తయారుచేస్తూవచ్చారు. ఎంత నీరు పైబడ్డా వెదురు గడల సందులనుంచి అది జారిపోతూనే ఉంటుందనీ, నావ మునిగిపోవడం జరుగదనీ వారికి తెలుసు. ఈ నావకూడా బల్సా కొయ్యలతో ఆ విధంగానే నిర్మించుకొన్నాము.

ఆ మధ్యాహ్నం సముద్రంమీద మేము ఎంతదూరం వచ్చిందీ, ఎరిక్కు గుర్తించాడు. సముద్రతీరంవెంట ఉత్తరంగా చాలా దూరం వచ్చినా, మేము ఇంకా హంబోల్టు ప్రవాహం లోనే ఉన్నామనీ, బయల్దేరినచోటునుంచి వందమైళ్ళు మాత్రమే వచ్చామనీ చెప్పాడు. 'గాలపగా'ల భయంకర వీచికల్లో చిక్కుపడే ప్రమాదంకూడా సంభవమే. అదేగనక సంభవమైతే, మధ్యఅమెరికాతీరంవైపు సాగే సముద్రప్రవాహాలవల్ల మేము చెల్లాచెదరై పోవచ్చు. కాని మాఅంచనాల ప్రకారం ప్రయాణం సాగితే గాలపగాల కెఱటాలు మా నావని చుట్టుముట్టకుండానే పశ్చిమదిశగా మేము సముద్రాన్ని అతిక్రమించి పోవచ్చును. గాలి యింకా, ఆగ్నేయదిశనుంచి వీస్తూనే ఉన్నది. మేము తెఱచాప చక్కజేసి, నావను సముద్రాభిముఖం చేసి, చుక్కానిమీద మా శక్తుల్ని కేంద్రీకరించాము.

ఇప్పటికి సట్ కొంచెం స్వస్థపడ్డాడు. అతడూ, టార్ స్టెయినూ, తెఱచాపకొయ్యకు ఎగబ్రాకి, నిస్తంత్రులైన ఏరియల్సును బెలూన్లు గాలిపటాలద్వారా శబ్దగ్రహణం చేయించడానికి ప్రయత్నించారు. హఠాత్తుగా లైమా నౌకా విశ్రాంతి స్థలంనుంచి మమ్మల్ని ఉద్దేశించిన ఒక హెచ్చరిక వినబడ్డదని వారిద్దర్లో ఒకరు కేకవేశారు. అమెరికన్ రాయ

భారి విమానం ఒకటి మాకు కడసారి వీడ్కోలు ఇవ్వడానికీ, సముద్రంలో మా పరిస్థితి ఎల్లా ఉన్నదీ చూడటానికీ, వస్తున్నదని చెప్పారు. తర్వాత కొద్దిసేపట్లోనే విమానంలోని ఆపరేటరుతో సంభాషించడమూ, దైవికంగా ఆ విమానంలోనే ఉన్న నౌకాయాత్రా కార్యదర్శి జెర్డ్ వోల్డ్‌తో ముచ్చటించడమూ జరిగింది. మా అప్పటి ఉనికి వారికి బోధపడేట్టుగా, చెప్పగలిగినంతా చెప్పాము. అయితే, ఆ 119 వ పటాలపు విమానం మాకోసం ఇటూ అటూ అన్వేషించడం సాగించేసరికి, వాయుగతి భేదంవల్ల మా ఆకాశవాణిలో శబ్దాలు అస్పష్టమైనాయి. విమానం నినాదం మాకు వినబడలేదు. విమానాన్ని మేము చూడలేదు. సముద్రకెరటాలమధ్య ఉన్న నావని కనిపెట్టడం తేలికైనపని కాదు. విమానంజాడకోసమే కన్నులప్పగించడానికీ మాకు సాధ్యంకాదు. చివరికి, ఆ విమానం అన్వేషణ విరమించి తీరానికి వెళ్ళిపోయింది. మాకోసం జరిగిన అన్వేషణల్లో అదే చిట్టచివరిది.

ఆ తర్వాతరోజుల్లోనూ కెరటాలు ఉద్ధృతంగానే ఉన్నాయి. కాని ఆగ్నేయదిశనుంచే వస్తూ, మధ్యమధ్య చాలా అంతరం ఉంటూఉన్నవి కావడంవల్ల, అవి మా ప్రయాణాన్ని ఆటంకపరచలేదు. అలలు కానీ, గాలికానీ రేవునుంచి ఆగ్నేయాభిముఖంగా సాగుతున్నందువల్ల, చుక్కాని పట్టేవారికి అంతగా శ్రమలేకపోయింది. నావ వెనకటికంటె నిబ్బరంగా ప్రయాణించింది. ఎక్కడా తొట్రుపాటు పడలేదు. ఆగ్నేయ వ్యాపారపవనమూ, హంబోల్టుప్రవాహమూ 'గాలపగా'ద్వీపాల చుట్టూ ఉన్నప్రవాహాలవైపు మా నావని నెట్టుతూ ఉండడం

మేము గమనించాము. రోజుకు సుమారు 55-60 మైళ్ళవరకూ ప్రయాణంచేస్తూ వాయువ్యముఖంగా సాగిపోతున్నాము - ఆ సముద్రప్రయాణంలో రోజుకు 71 మైలు కూడా వెళ్ళడం జరిగింది.

ఒకరోజున "గాలపగా ద్వీపాలు నివాసయోగ్యంగా ఉంటాయా?" అని నట్ అడిగాడు. అల్లా అడుగుతూనే, మా ఛార్టులో మా ఉనికిని తెలియజేసే ముత్యాల గుర్తులవంక చూస్తూ, గాలపగా ద్వీపాలవైపు వ్రేలు నిర్దేశించాడు—

"అది చాలా కష్టం;" అన్నాను నేను. "కొలంబస్‌కి పూర్వం, భూమధ్యరేఖనుంచి గాలపగా ద్వీపాలకు 'ఇంకాతూపక్ యుపాంక్వీ' అనే నావ వెళ్ళింది. అయితే కొలంబస్‌గానీ, మఱి మనవాళ్ళెవరుగానీ అక్కడ స్థిరపడలేదు. ఎందుచేతనంటే అక్కడ మంచినీళ్ళు దొఱకవు" అని కూడా అన్నాను.

"మంచిది. అల్లాఅయితే మనం అక్కడికి వెళ్ళనేవద్దు. ఏమైనా సరే! అక్కడికి మనం చేరుకోమనే అనుకొంటున్నాను నేను;" అన్నాడు నట్.

ఇప్పుడు సముద్రం మాచుట్టూ ఎంత గల్లంతుచేసినా లక్ష్యపెట్టని స్థితిలోకి వచ్చాము. ఎన్ని వేలతరంగాలు వచ్చిపడి ఊగించినా, వాటికి అతీతంగా మా నావలో మేము ఉండగలిగి నప్పుడు భయమెందుకు? అయితే, యిక్కడ మఱో ప్రశ్న బయలుదేరింది. ఈవిధంగా మేము ఎంతకాలం తరంగశిఖరాల మీద తేలిపోవాలి? బల్సాదుంగలు నీటిని పీల్చివెయ్యడం సుస్పష్టమే. అన్నింటికంటెను నడిదూలం అధ్వాన్నంగాఉంది.

అది పీల్చిననీటిని బ్రక్కించటానికి మా బాహుబలం యావత్తూ వినియోగించవలసివచ్చింది.

నేను ఎవరికీ ఏమీ చెప్పకుండా, ఆవిధంగా నానిపోయిన దూలంలో కొంతముక్క విఱిచి విసిరివేశాను. అది నీటిమట్టం నుంచి క్రమక్రమంగా మునిగిపోయి అదృశ్యమైంది. నాలాగే యిద్దఱుముగ్గుఱు కొన్ని ముక్కలువిఱిచి, యెవరూ చూడటం లేదనుకొన్నప్పుడు సముద్రంలోకి విసరివెయ్యటంగమనించాను. ఆ ముక్కలు నీళ్ళల్లో మునిగిపోవటం వారు పరికిస్తూఉన్నారు. ప్రయాణప్రారంభంలో జలరేఖ నావచుట్టూ ఎంతవఱకూ వచ్చిందీ, మేము గుర్తుపెట్టుకొన్నాము. కాని యిటీవల ఒక్కొక్కసారి నీళ్ళల్లో పూర్తిగా మునుగుతూ, తేలుతూ ఉన్నందువల్ల, నావ నీళ్ళల్లో ఎంతవఱకు క్రుంగిందీ గుర్తించటానికి వీలులేకపోయింది. కాని ఒక చాకు తీసుకొని నావ పార్శ్వపుదుంగ ఒకటి చెక్కిచూడగా, నీటిమట్టానికి ఒక అంగుళంపైన దూలం నానకుండానే ఉన్నది. దీన్నిబట్టి ఆలోచిస్తే, మా అంచనాలప్రకారం రెండోవైపుభాగం చేరేవఱకూ నావదుంగలు అలా తేలుతూనే ఉంటాయి. అయితే ఆ దుంగలలో ఉన్న చేవభాగం అంత తేలిగ్గా నీటిని చొఱనివ్వదని కూడా గ్రహించాము.

కాని మా ప్రయాణపు మొదటివారాల్లో మఱొకచింత మమ్మల్ని పీడిస్తూవచ్చింది. అది త్రాళ్ళవిషయం. పగలు పని ఒత్తిడిలో వాటిసంగతి ఆలోచించటానికి మాకు అవకాశమే ఉండేదికాదు. రాత్రిళ్లు శయనించినప్పుడల్లా ఇందుకు కావలసినంత తీఱుబడి; ఈ విషయమే ప్రసంగించుకొనేవాళ్ళం. గడ్డి

వరువులమీద పండుకొన్నప్పుడు దుంగలతోబాటు ఆ వరువులుకూడా ఉబ్బుతూ ఉండటం మేము గమనించేవాళ్లం. నావ చలనానికితోడు తొమ్మిదిదుంగలున్నూ ఊగిపోయేవి. ఒకదూలం పైకి లేస్తుంటే, మరొకటి క్రుంగిపోయేది. అవి మరీఎక్కువగా చలించకపోయినా, వాటిమీద వరున్నవాళ్లకి ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో కంపిస్తున్న ఒక జంతువుమీద వరున్నట్టుమాత్రం తోచక తప్పేదికాదు. అందువల్ల మేము ఒక దూలంమీదనే నిట్టనిలువుగా వరుండగోరేవాళ్లం. మొదటి రెండురాత్రిళ్లూ చాలా అవస్థ అయిపోయింది. ఆ తర్వాత బాగా అలసిఉన్న మాకు ఆవిషయం స్ఫురించేదికాదు. తర్వాత త్రాళ్లు కొంచెం నీళ్లల్లో తడిసి, బిగిసిఉండడంచేత, దూలాలను కదలకుండా చేశాయి. ఏమైనప్పటికీ, మాశయ్యా సమంగామాత్రం ఉండేది కాదు. నావ ఇటూఅటూ ఊగినప్పుడు దాని సర్వభాగాలూ చలించిపోయేవి. వేణుమందిరమూ, తెరచాపకొయ్యలజంటా, మందిరం నాలుగుగోడలూ, పైకప్పూ, ఆకులూ త్రాళ్లతో ఎప్పటికప్పుడు బిగిస్తున్నా, తిరిగిపోయి కదిలిపోయేవి. దీనికేమిలేదు అనుకోటానికి వీల్లేదు. ప్రత్యక్షానుభవాన్ని గుర్తించకుండా ఉండటం ఎల్లాగు? నావ ఒకమూల పైకిలేస్తే, రెండోమూల క్రుంగిపోయేది. పైకప్పులోసగం ముందుకు ఒరిగితే మిగతాసగం వెనక్కుపోయేది. అయితే, బయటికి చూచినప్పుడు ఎంతోవికాసమూ, చైతన్యమూ గోచరించేవి. సముద్రం పొంగేటప్పుడు ఆకాశం వలయాకారంలో తిరిగినట్టుండేది.

ఇప్పుడు ఒత్తిడిఅంతా త్రాళ్ళమీదపడ్డది. రాత్రిఅంతా అవి కిఱ్ఱుకిఱ్ఱుమనీ, కీచుకీచుమనీ రొదచెయ్యడం మాకు వినక

తప్పలేదు. ఆ అంధకారంలో మాచుట్టూ ఒక బృందగానం జరుగుతూఉన్నట్టు ఉండేది. ఒక్కొక్క త్రాడు దాని బిగువును బట్టీ, దళసరితనాన్ని బట్టీ ఒక్కొక్కవిధంగా ఆలపించేది. ప్రతి ఉదయమూ మేము త్రాళ్లను బాగా పరిశీలించేవాళ్లం. ఇద్దరు మనుష్యులు మా మడమల్ని దృఢంగా పట్టుకోగా, ఇద్దరు నావఅడుగున నీళ్లల్లో మునిగి, అక్కడి త్రాళ్లు సరిగా ఉన్నాయో లేదో పరీక్షించేవాళ్లం.

అయితే, త్రాళ్ళు ఊడలేదు. ఒక పదిహేనురోజుల్లో వాటిబిగువు తగ్గిపోతుందనుకొన్నాము. కాని, మేము అనుకొన్నదానికి విరుద్ధంగా జరిగింది. ఒక్క త్రాడుకూడా ఊడలేదు. బల్సాకొయ్యలు చాలా మెత్తనివి కావడంవల్ల, త్రాళ్లు ముళ్లువేసినచోట్ల ఒరపిడిపెట్టి, దుంగల్లోపలికి చొచ్చుకొని పోయాయి. ఇప్పుడు దుంగలు త్రాళ్ళని అంటిపెట్టుకో నవసరం లేకపోయింది. త్రాళ్ళే వాటిని నొక్కిపెట్టాయి. ఒక్కవారం దాదాపు గడిచేసరికి సముద్రం ఇంకా శాంతించినట్టు కనిపించింది. నీరుకూడా పసుపుపచ్చరంగు పోయి, నీలంగా కనిపించింది. మా నావ తిన్నగా వాయవ్యానికి పోవడానికి బదులు, వాయవ్య పశ్చిమాలమధ్యగా ప్రయాణిస్తున్నది. తీరంనుంచి సాగే సముద్రప్రవాహంలో చిక్కుకొనే ప్రమాదం తప్పిపోయిందనీ, తిన్నగా సముద్రంమీద పోగలమనీ ధైర్యం తెచ్చుకొన్నాము. మేము సముద్రం చూచిన తొలిరోజున నావ చుట్టూ చేపలు తిరుగుతూ ఉండటం గమనించాము. కాని తర్వాత చుక్కాని తెడ్డుతో అవస్థలపాలవుతూ ఉండటంవల్ల, చేపలు పట్టాలనే ఆలోచనే రాలేదు. మఱుసటిరోజున చేపలు

ముమ్మరంగా కనిపించాయి. ఎనిమిది అడుగులు పొడుగైన ఒక నీలపుచేప నావ దూలానికి తన తెల్లని పొట్టని రాచుకోవటం చుక్కాని పట్టుతున్న బెంగ్టు హెర్మన్లు గమనించారు. మేము దాన్ని పట్టుకోటానికి బయలుదేరివచ్చేసరికి, అది ఇటూ అటూ ఎగిరిపడుతూ అదృశ్యం అయింది.

ఆ తర్వాతరోజున టన్నీలూ, బోనిటోలూ, డాల్ఫిన్లూ మొదలయిన రకరకాల చేపలు కనిపించాయి. వాటిల్లో ఒక ఎగిరేచేపను పట్టుకున్నాము. దానిని ఎఱగా చేసి 20 మొదలు 35 పౌనులదాకా తూగే రెండు బేడిసచేపల్ని పట్టుకొన్నాము. ఇవి మాకు చాలారోజులదాకా సరిపోయాయి. చుక్కాని సంభంపై కూర్చుంటే, మేము ఎన్నడూ చూచి యెఱుగని రకకాలచేపలు కనిపించేవి. ఒకరోజున అంతులేని చేపలదండు ప్రత్యక్షమైంది. నావ నలువైపులా వాటి నీలపృష్ఠాలు అటూ ఇటూ చలిస్తూంటే, అవి ఒక్కొక్కప్పుడు నావ పైకికూడా ఎగిరిపడుతుండేవి. సముద్రతీరంనుంచి చాలాదూరం దాదాపు భూమధ్యరేఖదాకావచ్చేసరికి, చేపలు నావచుట్టూ ఎగిరిపడడం మఱీ మామూలైపోయింది. సముద్రతరంగాలు ఉదాత్తంగా సాగివచ్చే నీలజలాలు ప్రవేశించేటప్పటికి, ఎండలో తళతళ లాడుతూ నానాజాతి మత్స్యాలూ మా నావచుట్టూ బలం కొద్దీ ఎగిరి, నృత్యాంచేస్తూ అదృశ్యం కావడం పరిపాటిఅయింది.

రాత్రిపూట చిన్నదీపంవెలిగిస్తే, ఆకాంతి చూచి, అనేక మీనాలు చిన్నవీ, పెద్దవీ ఎంతో ఆసక్తితో పడవమీదకు దూకేవి: అవి వేణుమందిరానికి కానీ, తెఱచాపకొయ్యకు గానీ కొట్టుకొని, నావమీద వెల్లకిల బడిపోవడంకూడా జరుగు

తుండేది. పాపం అవి నీళ్ళల్లో ఈదినట్టు చురుగ్గా పోలేక, పడ్డ చోటనే మిట్టిపడేవి. అల్లా పడిపోయి తప్పించుకుపోలేని చేపను చూడగానే, నావపార్శ్వానఉన్న మనిషి ఉత్సాహంతో మాకు ఆ సంగతి చెప్పేవాడు. అవి చాలా వేగంగా వచ్చిపడటంవల్ల, పట్టుకోగానే బహువిధాల మమ్మల్ని గాయపరిచేవి. కాని, ఆ గాయాలు మాకు బాధకలిగించేవి కావు. కడుపునిండా ఆహారం లభిస్తూఉంటే, ఆ కొంచెపుగాయాలకు బాధపడేవాళ్ళెవరు? వాటిని ప్రాతఃకాలభోజనానికి వేయించుకొని తింటుంటే, అవి చేపలైనప్పటికీ, ఒకప్పుడు మేము ఆరగించిన వేపుడుపదార్థాలు వంటమనిషి నేర్పుమూలానగానీ, మా స్మృతిబలంవల్లగానీ జ్ఞాపకానికి వచ్చేవి.

ప్రొద్దున లేవగానే రాత్రిపూట పడవఅంచుల్ని పడి ఉన్న రెక్కలచేపల్ని ప్రోగుచెయ్యటం వంటమనిషి మొట్ట మొదటిపని. సాధారణంగా అరడజను చేపలకి తక్కువ ఉండేవి కావు. ఒకనాడు ఇఱువైఆఱుచేపలుకూడా దొరికాయి. ఒక రోజున నట్ బలేదెబ్బ తిన్నాడు. అతను వేపుడు పెనందగ్గిర నిల్చుండగా ఒక రెక్కలచేప వంటగిన్నెలో పడటానికి బదులు అతనిచేతిమీద ఎగిరిపడి గాయపరచింది.

సముద్రుడికీ మాకూ ఏర్పడ్డ దృఢానుబంధం టార్ స్టీన్ ఇంకా గుర్తించలేదు. ఒకరోజున అతను నిద్రలేచేసరికి ఒక సార్డిన్ చేప అతని దిండుమీద పడిఉన్నది. వేణుమందిరం చాలా ఇఱుకుగా ఉండడంవల్ల, అతను గుమ్మంమీద తలపెట్టు కొని పడుండేవాడు. ఎవరైనా అకస్మాత్తుగా బయటికి వెళ్ళవలసి వస్తే, అతని ముఖంమీదుగానే దాటిపోవలసివచ్చేది. ఒక్క

కప్పుడు ఆ వెళ్ళే వ్యక్తికాలు ముఖానికి తగులగానే టార్‌స్టీను ఆ కాలు కఱిచేవాడు. అటువంటివాడు ఆ చేపను చూడగానే తోక పట్టుకొని పైకెత్తి, సార్డీన్ చేపలను అన్నింటినీ తాను ఎంతో ప్రేమిస్తున్నట్లుగా లాలించాడు. ఆ మఱునటి రాత్రి టార్‌స్టీను కొంచెం విశ్రాంతిగా పరుండటానికి మేము కాళ్లు ముడుచుకొన్నాము కానీ, అతను వంటగది అటకమీద తనప్రక్క ఏర్పఱుచుకొన్నాడు.

తర్వాత కొన్ని రాత్రులు గడిచాయి. ఒక రాత్రి చాలా చీకటిగా ఉన్నది. టార్‌స్టీను తన ప్రక్కకి అడుగు నుంచి బయటికి వెళ్ళేవాళ్ళకి మార్గదర్శకంగా దీపం తనకు సమీపంలో ఉంచుకొన్నాడు. సుమారు నాలుగు గంటలవేళ దీపం క్రిందపడి, తనప్రక్క ఏదో చల్లని పదార్థం రెపరెపకొట్టుకొంటూ ఉండడంచేత అతనికి మెలకువ వచ్చింది. ఇదేదో ఱెక్కలచేప అనుకొంటూ, దానిని పట్టుకొని విసరివెయ్యటానికి, ఆ చీకట్లోనే అతను చెయ్యిచాచాడు. పొడుగ్గానూ, చల్లగానూ ఉన్న పాములాంటిది తగిలి కరవడంతో, చప్పున అతను దాన్ని విడిచిపెట్టాడు. ఆ అదృష్ట పదార్థం మెలికలు తిరిగి, హెర్మన్‌దాకా వెళ్ళింది. ఇంతలో టార్‌స్టీను దీపం వెలిగిస్తున్నాడు - హెర్మన్‌కూడా మేలుకొన్నాడు. ఈ సందడికి నేనూ మేలుకొన్నాను. 'రాత్రిపూట ఇల్లాంటి నీట్లో వెలికి వచ్చే అక్టోపస్ మత్స్యం అయి ఉంటుందిది' అనుకొన్నాను. మేము దీపం వెలిగించేసరికి, హెర్మన్ ఒక సన్నని దీర్ఘ మీనాన్ని గొంతుదగ్గఱ పట్టుకొని ఉన్నాడు. అది గిలగిల కొట్టుకొంటున్నది. అది మూడడుగులపైగా పొడుగున్నది.

పాములాగా సన్నగా పట్టుకొంటే జారిపోయేట్టు ఉన్నది. నల్లటి మొద్దుగుడ్లు—పొడుగైన మూతి, నోట్లో సన్నని నవాడి కోఱలూ అదీను. కోఱలు కత్తుల్లాగా ఉన్నాయి. దేన్నైనా మ్రింగవలసివస్తే, అవి వెనక్కి ముడుచుకుపోయేట్టుకూడా కని పించాయి. దాని పొట్టలోనుంచి ఆరంగుళాల చేప ఒకటి బైట పడి, హెర్మన్ చేతిదగ్గఱ పడ్డది. దానివెనకనే అల్లాంటిదే మఱొకచేప వచ్చింది. అవి రెండున్నూ చాలా లోతునీళ్ళల్లో ఉండేచేపలు. ఈ పాముచేపనోట్లో పడి పాపం నలిగిపోయాయి. ఆ పాముచేప వలుచని చర్మం పైభాగాన నీలంకలిసిన వైలెట్ రంగులో ఉన్నది. అడుగున ఉక్కులాగా నల్లగా ఉన్నది. మేము లాగగానే అది పొరలు పొరలుగా ఊడివచ్చింది.

చిట్టచివఱికి ఈ హడావుడివల్ల బెంగ్టుకూడా నిద్ర లేచాడు. మేము దీపం పైకెత్తి, చేవని అతని ముక్కుసమీపాన ఉంచాము. అతను మగతగానే లేచి కూర్చుని "ఇల్లాంటి చేప ఉండనే ఉండదు;" అని మూలిగి, మళ్ళీ ప్రక్కమీద వాలి గుఱ్ఱుపెట్టాడు.

బెంగ్టు అన్నది అంతా పొరపాటుకాదు. దీపం కొంచెం పెద్దది చేసి, మేము ఆఱుగురమూ దానిచుట్టూకూర్చుని, పరీక్ష చేసినతర్వాత ప్రపంచంలో ఇటువంటి చేపను బ్రతికివుండగా చూచిన మొట్టమొదటి మనుష్యులం మేమే; అని నిశ్చయం చేసుకొన్నాము. దక్షిణ అమెరికా తీరానా, గాలపగాద్వీపాల దగ్గఱా ఇటువంటి చేప అస్థిపంజరం మాత్రమే కనపడ్డది. జలజంతుశాస్త్రజ్ఞులు దీన్ని 'జింపిలస్' అన్నారు. ఇది బాగా లోతు నీళ్ళల్లో ఉంటుంది అని మాత్రం చెప్పారు. కాని ఇంత

వఱకూ ఎవరున్నూ, సజీవమైన ఈ మత్స్యాన్ని చూచి ఉండ లేదు. ఇది సూర్యకాంతి చూడలేనిది కావడంవల్ల, లోతు నీళ్ళల్లో ఉంటే, ఆ ఉండటం పగటివేళ మాత్రనే అయివుంటుంది. కారణ మేమిటంటే, చీకటి రాత్రుల్లో ఉన్నత తరంగాలతో బాటు ఇది లేచి రావడం మేము గమనించాము.

ఒక వారం గడిచిన తర్వాత, మఱొక జింపిలస్ టార్పిన్ ప్రక్కలో పడింది. మాకు రెండోసారి దాని సంద ర్శన భాగ్యం కలిగింది. అప్పుడు కూడా తెల్లవాఱుజామున నాలుగు గంటలవేళే. అప్పటికి శుక్లచంద్రుడు అస్తమించాడు. అంధకారం అలముకొన్నది. నక్షత్రాలు మాత్రం మిలమిల మెఱుస్తున్నవి. నావ అతి సుకరంగా సాగిపోతున్నది. నా వంతు కావలా పూర్తి కాగానే, నావచుట్టూ ఒక్కసారి చూచి వద్దామని దుంగలమీద జాగ్రత్తగా నడుస్తూ బయలుదేరాను. నా రొమ్ముచుట్టూ త్రాడు బిగించుకొని ఉన్నాను. చేతిలో దీపం ఉన్నది. అకస్మాత్తుగా నా శరీరానికి చుట్టుకొని ఉన్న త్రాడు ఎవరో గుంజినట్లైంది. దుంగలు నీళ్ళల్లో తడిసి జారడం చేత కాళ్ళు పట్టుతప్పి పడేటట్లైనాను. భయాశ్చర్యాలతో వెనక్కి తిరిగిచూచాను. ఎవ్వరూ కనిపించలేదు. ఒక క్రొత్త కెఱటం వచ్చి పడ్డది. అది వెనక్కు పోగానే, నావమీద తెల్లగా మెఱుస్తున్న పదార్థం ఒకటి కనిపించింది. అది జింపిలస్. దాని కోఱలు త్రాడును కఱచి పట్టి ఉన్నాయి. నేను త్రాడు సడలించే సరికి, దాని కోఱలు చాలా విఱిగిపోయాయి. దీపం వెలుగు నా వెనక ఉన్న తెల్లని త్రాటిమీద పడి ఉంటుంది. అదేదో అద్భుత రుచిగల ఆహారవస్తు వనే భ్రాంతితో జింపి

లస్ దానిమీదికి దూకిఉంటుంది. పాపం ఈ భ్రాంతితో అది వచ్చి మా చేతుల్లో పడ్డది. దాని జీవితం అప్పటినుంచి గాజు కూజాలోనే గడిచిపోయింది.


సముద్రుడు భాగ్యశాలి గదా! అతనికి ఎంతో అద్భుత సామగ్రి ఉన్నది. అందుచేత గంభీరంగానూ, నిదానంగానూ, ప్రవర్తిస్తూఉంటాడు. వనమధ్యంనుంచి ప్రయాణంచేసి వచ్చిన వేటగాడు వనంలో ఏ క్రూరమృగమూ లేదని చెప్పవచ్చును. అక్కడే కూర్చుని ప్రతీక్షిస్తే ఎన్ని గర్జనలు! ఎంత గందరగోళం! అనేకం అనుభవంలోకి వస్తాయి. సాగరయాత్రకూడా అటువంటిదే. నావచుట్టూ నురుగురాశితో చిందిపడే కెరటాల్ని చూస్తూ, యంత్రాల రొదలతో విశేష పరిశీలన చెయ్యకుండానే ప్రయాణం ముగించవచ్చును. అప్పుడు మనం వెనక్కి తిరిగివచ్చిన తర్వాత, సముద్రయాత్రలో కనిపించే వింతలూ విశేషాలూ ఏమీ ఉండవని చెప్పవచ్చును.

మేము నీళ్ళమీద తేలిపోతూ ప్రయాణం చేస్తున్నప్పుడు ఉత్సుకులైన అతిథులు మెలికలు తిరిగి ఎగురుతూ, మమ్మల్ని పరామర్శించని దినంలేదు. బేడిసచేపలూ, చుక్కాని చేపలూ రాత్రింబగళ్లు మా నావని పరివేష్టించి వస్తూఉండేవి.

చీకటి పడి నీలాకాశంలో తారలు తళుక్కున మెరిసే సమయంలో నక్షత్రాలకు ప్రతిస్పర్థిగా హరిద్రాజలకణసమూహం తళతళలాడుతూ మా చుట్టూ చిందిపడేవి. నల్లగా కదలిపోయే నావదుంగలు సజీవాలైన బొగ్గుల్లాగా కనిపిస్తూఉంటే, నావ ప్రక్కప్రక్కల వచ్చిపడే కెరటాల్లోంచి పాదరక్షలు లేని కాళ్ళతోనే మేము ఇటూ అటూ తిరుగుతూఉండేవాళ్ళం.


మాకు నలువైపులా ఉజ్జ్వలగోళాలు నర్తిస్తూ పాద్యం అర్పించేవి. అవి చేతబట్టినూ స్తే రొయ్యపొలసులు! అటువంటి నిశాసమయాలలో సముద్రంనుంచి పైకి వచ్చి, నావపార్శ్వాన్నుంచి మావైపు అత్యద్భుతంగా విలోకించే తేజోవంతమైన నేత్రద్వయం కన్పించేది. ఆ వచ్చింది సముద్రుడేనేమో! ఆ కన్నులు నీటిమట్టంమీద తేలిఆడుతూ, భాస్వరంలాగా మెఱుస్తూ మాకు విపరీతభయాన్ని కల్పించేవి. ఒక్కొక్కప్పుడు దీపకాంతి ఆకర్షించగా విస్మయంతో చూడవచ్చిన అగాధజలసంచారి మీనబృందం నేత్రాలుగా కన్పించేవి. సముద్రం ప్రశాంతంగా ఉన్న అనేకసమయాల్లో నావ యావత్తూ మూడుఅడుగులవ్యాసం కల శిరోవలయాలతో పరివేష్టితమయేది. ఆ శిరోవలయాలు అత్యద్భుతరస నిమగ్నాలై, మావంక నిశ్చలంగా చూస్తూ మమ్మల్ని అనుగమించేవి. మఱికొన్నిరాత్రుల్లో మూడడుగుల పైగా వ్యాసంకల కాంతిగోళాలు నీళ్ళలోపలనుంచి తళతళలు విరజిమ్ముతూ, యథేచ్ఛగా విహరిస్తూ, ఆరుతూ వెలుగుతూఉన్న విద్యుద్దీపాలను తలపించేవి.

క్రమంగా మాకు ఈ విచిత్ర జలజంతువులతో సాంగత్యం వృద్ధిపొందుతూవచ్చినా, వాటినిచూచినప్పుడల్లా మాకు భయాశ్చర్యాలు కలుగుతూనేఉండేవి. ఒకరాత్రి సుమారు రెండు గంటలవుతుంది. ఆకాశం అంతా మేఘాచ్ఛాదితమై ఉన్నది. చుక్కానిమీద ఉన్న మనిషికి సముద్రమేదో, ఆకాశమేదో తెలుసుకోవటానికి వీల్లేకుండా ఉన్నది. అటువంటి సమయంలో నీళ్ళల్లో అస్పష్టమైన ఒక వెలుగు అతనికి గోచరించింది. అతను దానివంక చూస్తూ ఉండగానే, అది ఒక జంతురూపంలో



సముద్రమధ్యాన పయనిస్తున్న కోన్-టికీ. హంబోల్టు సముద్ర ప్రవాహం ఉన్నచోట ఓడను నడపటం మాటలు కాదు. ఎందుకంటే ప్రతివారికి పడవ ఇలాటి క్లిష్ట పరిస్థితులలో ప్రయాణం చెయ్యటం అలవాటు లేదు. కావాలన్నా నేర్పేవాళ్లూ లేరు.

మేము
గట్టునుంచి
తాజాగా
తెచ్చుకున్న
పళ్లు అన్నీ
అయిపోయే
వేళకు,
ఇబ్బంది
పడనక్కర
లేకుండా
చేపలు
పుష్కలంగా
దొరికేవి.





"ఒక పెట్టెలో
పొందికగా
అమర్చిన
పొయ్యి
మీద వంట
చేసుకుని
ఆరుబయట
భోజనాలు
చేసేవాళ్లం."

ప్రత్యక్షమైంది. దాని శరీరంమీద మెరిసేది ప్లాంక్టనేమో! లేక పోతే, ఉష్ణతమాత్రం లేకుండా ప్రకాశించేస్వభావం ఆ దేహానికి ఉన్నదో! ఇదమిత్థమని చెప్పటం కష్టం. వినీలజలం లోపలి నుంచి మిణుకుమిణుకుమనే దాని శరీరకాంతివల్ల ఆ భీకరజంతు రూపం రేఖామాత్రంగా గోచరిస్తూ అస్పష్టంగానే ఉన్నది. ఒకసారి వృత్తాకారంలోనూ, ఒకమారు అండాకారంలోనూ, ఇంకొకప్పుడు త్రిభుజాకారంతోనూ కనబడుతూ, అకస్మాత్తుగా రెండుభాగాలుగా విడిపోయి, ఏ భాగానికాభాగం స్వతంత్రంగా, పడవక్రిందనుంచి ఈదుకుపోతున్నట్టు కనిపిస్తూవచ్చింది. మొత్తంమీద, ఇటువంటి భూతాలు మూడు మా చుట్టూ నిదానంగా ప్రదక్షిణాలు చేస్తూ వచ్చాయి. అవి నిజంగా భూతాలే. మాకు దృగ్గోచరాలైన వాటిశరీరభాగాలు దాదాపు అయిదునిలువుల పొడుగ్గా ఉన్నాయి మేము అందఱమూ నావపార్శ్వాన చేరుకొని, ఆ భూతనృత్యం చూస్తూ ఉండే వాళ్ళము. ఈ విధంగా గంటలకు గంటలు గడిచిపోయేవి. విచిత్రంగా ఉన్నా, అతి ప్రశాంతంగా ఉండి, నీటి అడుగున కదులుతూ ఉన్నప్పుడు, మాకు మార్గదర్శకాలుగా ఉండే ఈ జ్యోతిస్సహచరత్రయం సాధారణంగా. నావ కుడిభాగాన, దీపం కల వైపున పయనించేవి. ఒకొ్కక్కప్పుడు మాత్రం నావకు అడుగున కుడివైపునగానీ, మా మార్గానికి ముందుగానీ ప్రయాణించేవి. వాటి శరీరకాంతిరేఖలను బట్టిచూస్తే, అవి ఏనుగులకంటె పెద్దవిగా కనబడ్డాయి. అయితే అవి తిమింగిలాలు మాత్రం కావు. తిమింగిలాలే అయితే, గాలికోసం ఒక్కమాటైనా నీటిలోపలనుంచి బయటికి వచ్చేవే కదా!

అవి పెద్ద టేకిచేపలేమో! అటూఇటూ తిరిగినప్పుడల్లా వాటి ఆకారాలు మారిపోతున్నవి కదా! వాటిని మావైపు ఆకర్షించి, ఆ రూపాలు ఎల్లా ఉంటాయో, పరీక్షించి చూడాలనే కుతూహలంతో మేము దీపం నీటిమట్టానికి చేరువగా ఉంచి, ప్రయత్నంచేసి చూచాము. కాని, అవి ఆ దీపాన్ని గమనించినట్టే కనబడలేదు. అన్ని నిశాచరజాతుల్లాగా అవికూడా, తెల్లవారుతోందంటే, నీళ్ళలోపలికి చొచ్చుకుపోయి, మరి కనిపించేవికావు.

రాత్రిపూట వచ్చే ఈ ఉజ్జ్వల రాక్షసత్రయం యొక్క ఉద్దేశం ఏమిటో, ఎంత ఆలోచించినా, మాకు బోధపడలేదు. అయితే, ఒక హఠాత్సంఘటనతో మా సందేహం నివృత్తి అయింది. ఒకరోజున, అవి యథాప్రకారానికి విరుద్ధంగా, మిట్టమధ్యాహ్న సమయాన వేంచేశాయి అది మే నెల 14 వ తేదీ. 95° పశ్చిమం, 7° దక్షిణం కల దిక్కున మేము నిదానంగా ప్రయాణం చేస్తున్నాము ఆ ఉదయాన్నే మేముపట్టి కొన్న బేడిసచేపల ప్రేగులు నావపార్శ్వాన పడవేశాము. నేను అలల్లో పడిపోకుండా, బొమ్మచుట్టూ నావ మోకు బిగించుకొని, పడవముఖభాగంలో కాలక్షేపంకోసం పరుండి, నీళ్ళల్లో మునుకలు వేస్తున్నాను. అంతలో, స్ఫటికనిర్మలమైన జలంలో నావైపు సాశ్చర్యంగా సాగివచ్చే లావుపాటిచేప ఒకటి కనిపించింది. అది గోధుమవర్ణంగా ఉండి, ఆఱడుగుల పొడుగున్నది. నేను తత్క్షణం నావలోకి దుమికి, ఎండలో కూర్చుని, నిశ్శబ్దంగా నావైపు వస్తున్న ఆ మీనాన్ని చూస్తున్నాను. అంతలో వేణుమందిరం వెనుక ఒకప్రక్కగా కూర్చున్న నట్

పెద్దపెట్టున కేక వేశాడు. "సొరచేప!" అంటూ గొంతుపగిలి పోయేట్టు అఱచాడు. రోజూ మా నావపార్శ్వాన సొరచేపలు కనబడడం పరిపాటే. నట్ ఇల్లా కంగారుపడ్డాడంటే సొర చేపల్లో ఇది ఒక విచిత్రశాఖ అయి ఉంటుందనుకొన్నాము.

అప్పటివఱకూ నట్ అక్కడ కూర్చుని, అలల్లో పంట్లాములు ఉతుక్కుంటున్నాడు. అటువంటివాడు తల ఎత్తి చూస్తూ, విస్మయంతో మునిగిపోయాడు. మేమూ అటువైపు చూచాము. అబ్బ! అంత దయ్యపుముఖం మా జీవితాల్లో ఎన్నడూ చూచిఉండలేదు అది నిజంగా ఒక రాక్షసముఖమే. కేవలం వృద్ధ సముద్రుడే సాక్షాత్కరించా డనుకొన్నా, "అతని ముఖం మాత్రం ఇంత ఘోరంగా ఎందుకుంటుంది?" అనుకొ న్నాము. ఆ తల వెడల్పుగానూ, చదునుగానూ ఉండి, అచ్చంగా కప్ప తలలాగా ఉన్నది. దానికి రెండుప్రక్కలా రెండు చిన్నకళ్లు ఉన్నాయి. ఆ దౌడలు సుమారు నాలుగై దడుగుల వెడల్పున్నాయి. దాని పెదవులు పూర్తిగా క్రిందికి దిగజాఱి వ్రేలాడుతూ, రోత పుట్టిస్తున్నాయి. తలకు వెనుక బ్రహ్మాండమైన శరీరం! చిట్టచివఱ నిక్కిఉన్న సన్నని తోక! ఈ సముద్రరక్షస్సు తిమింగిలజాతిలో ఏశాఖకూ చెందనిదని, మేము భావించాము. నీళ్లల్లో మునిగిఉన్న శరీరం గోధుమ వర్ణంగా కనబడుతున్నది. కాని, తలమీదనూ, శరీరంమీదనూ తెల్లని మచ్చలున్నాయి. అవి చాలా చిన్నవైనా, మఱీ దగ్గ ఱగా సందులేనట్టు ఉన్నాయి. ఆ రక్కసి నిశ్శబ్దంగా నిర్ల క్ష్యంగా, మా ప్రక్కగా ఈదుకువస్తున్నది. అది ఒక భయం కర మహాశ్వానంలాగా, పండ్లు బయటపెట్టి తోక నెమ్మదిగా

ఆడించింది. లావుగా, గుండ్రంగాఉన్న దాని తోక కదలి
నప్పుడు, నీరు ఉవ్వెత్తున చింది పడుతున్నది. దానిమీదనుంచి
కెరటం వచ్చినప్పుడు, సముద్రమగ్నమైన మహాపర్వతం మీద
నుంచి జలధారలు ప్రవహించినట్లు, దాని వీపుమీదనుంచి నీళ్లు
జాఱిపడుతున్నాయి. దాని విశాలవదనానికి ముందు కంచర
గాడిదలాగా చాఱలుండి, విసనకఱ్ఱలలాగా ఉండే చుక్కానుల
మోస్తరుగా, అనేక మీనాలు పయనిస్తున్నాయి. ఇక దానితో
పాటు అటూ ఇటూ ప్రయాణిస్తున్న మత్స్యజాతులకు అంతే
లేదు. అవి దాని శరీరాన్ని అంటిపెట్టుకొన్నట్లే ఉన్నాయి.
మొత్తంమీద ఆ దృశ్యం ఒక పెద్ద జంతుప్రదర్శనంలాగా ఉండి,
నీటిలో మునిగి ఈదుతున్న ఒక మహాపర్వతాన్ని స్ఫురింప
జేసింది. అంతకుపూర్వం ఎప్పుడో మేముపట్టుకొన్న ఒక బేడిస
చేప సుమారు 25 పౌనుల తూకం ఉంటుంది. దాన్ని మా పెద్ద
గాలాలు ఆఱింటితో బంధించి, నావ వెనకాల సొరచేపలకు
ఎఱగా వ్రేలాడగట్టాము. ఆ జలభూతానికి పురోగామిదళంగా
ఉన్న మత్స్యబృందం ఈ బేడిసచేపను సమీపించి, దూరా
న్నుంచే వాసన చూచాయి. అంతలోనే వెనుకకు తిరిగి తమ
ప్రభువైన సముద్రరాజుకు విన్నవించుకోటంకోసం అన్నట్టుగా,
వెళ్లిపోయాయి. యంత్రప్రాయంగాఉన్న ఆ రక్కసుని తననోటికి
ఎదురుగా ఉన్న బేడిసచేపవైపు తన పరివారాన్ని మళ్లించి,
సవిలాసంగా దయచేస్తున్నది. మేము సొరచేపను నావలోపలికి
చేరవెయ్యటానికి ప్రయత్నించాము. ఆ జలభూతం నిదానంగా
మా నావ పార్శ్వానికి చేరుకొన్నది. అది నోరు తెఱవకుండానే
సొరచేపను ముట్టెతో చటుక్కున కొట్టింది. ఆ అల్పపదార్థం

కోసం నోరు తెఱవటం తన ఉదాత్తతకు భంగకరం అనుకొన్న ట్లుంది. అది నావను సమీపించగానే, తనవీపును అప్పుడే నీటి నుంచి పైకెత్తిన చుక్కాని తెడ్డుకు రాచుకొన్నది. అప్పుడు మాకు దాన్ని పరీక్షించి చూడటానికి కావలసినంత వ్యవధి కన బడ్డది. ఆ సమయంలో మాకు అందఱికీ పిచ్చి ఎత్తిందనే అను కొన్నాను. ఎందుచేతనంటే మాకు ప్రత్యక్షమైన ఆ అద్భుత జంతువును చూడగానే, అవివేకంగా పెద్దపెట్టున నవ్వుతూ, ఉద్రిక్తులమై, మమ్మలి మేము మఱచిపోయాము. మా నావ ప్రక్కన కనిపించిన ఇటువంటి జలభూతంకంటె భయంకర రాక్షసిని వాల్ట్‌డిస్నేవంటి ప్రతిభాశాలికూడా, తన అద్భుత రచనల్లో సృష్టించలేకపోయాడు.

ఈరక్షస్సు తిమింగిలలక్షణాలూ, సొరచేప లక్షణాలూ సమ్మేళనం పొందిన ఒక విచిత్రమత్స్యం. ఇంతకంటె పెద్దచేప ఏదిన్నీ లోకంలో ఎవరికిన్నీ ఇంతవఱకు కనిపించలేదు. ఈ విచిత్ర మత్స్యం ఎక్కడో ఎప్పుడో కాని కనిపించదు. ఉష్ణమండలాల్లో ఉన్న సముద్రాల్లో ఇటువంటి పోలికలున్న మీనాలు చెదురుగా కనిపిస్తాయి. ఈ తిమింగిలపు సొరచేప సాధారణంగా 50 అడు గుల పొడుగు ఉంటుంది. జంతుశాస్త్రజ్ఞుల అంచనాల్నిబట్టి, దీని తూకం సుమారు 15 టన్నులు. వీటిల్లో మఱీపెద్దవి 65 అడు గుల పొడుగుకూడా ఉంటాయి. ఈ జాతిలో శిశువుగుండె సుమారు 600 పౌనులబరువు ఉంటుంది. ఒకొక్కక్క దవడకు మూడువేల కోరలు ఉంటాయి.

ఆ రక్కసి వక్రగమనంతో మాచుట్టూ, నావ అడు గునా కూడా, ఈదుతూఉంటే, ఒకవైపు శిరస్సూ, రెండో

వైపు సుదీర్ఘ పుచ్ఛమూ కనిపించాయంటే, అది ఎంతపెద్దదో; ఊహించుకోవచ్చు. అదిగనుక ఎదురుకొన్నట్లయితే, ఒక్కసారి పుచ్ఛంతో తాడించి, మా నావయావత్తూ ముక్కలు చెయ్య గలదని, మాకు తెలుసు. అయినా, దానిముఖం కనిపించేసరికి, విఱగబడి నవ్వటంకంటె, మఱొకపని మాకు తోచటంలేదు. అలా మేము ఎంత అవహాస్యం చేస్తున్నా, గమనించే తెలివి తేటలు కానీ, రోషం కానీ ఉన్న ప్రాణిలాగా అది కనిపించలేదు. అనేకపర్యాయాలు అది నావక్రింద గిరగిర తిరిగింది. గ్రుడ్లప్ప గించి, జరుగబోయే దేమిటో అని, నిరీక్షించటంకంటె, మాకు గత్యంతరం కనబడలేదు. అలా తిరుగుతూ, ఆ విచిత్రజంతువు చుక్కాని కొయ్యను అకస్మాత్తుగా ఎగురగొట్టింది. మఱు క్షణంలో ఆకొయ్య దానివీపుమీద దడాలున పడ్డది. మేమునావ చుట్టూ చేతి ఈటెలతో నిలబడి, రాబోయే ప్రమాదాన్ని ఎదుర్కొనటానికి వేచిఉన్నాము. అయితే, మా ఈటెలు ఆ మహామృగానికి పలుకుట్టుపుల్లలపాటికూడా కావనితోచింది. ఆ సొర తిమింగిలం మమ్మల్ని వదలిపోయే జాడలేమీ కనిపించ లేదు అది మాకు ప్రదక్షిణాలుచేస్తూ, పెంపుడు కుక్కలాగా మాతో వస్తున్నది. ఇటువంటిసంఘటన కలుగుతుందని, మేము కలలోకూడా అనుకోలేదు. ఆవిధంగా అనుకోటానికి, పూర్వాను భవం ఉంటేకదా; ఆ మహాజంతువు ఆవిధంగా వెన్నాడుతూ ఉంటే, అదేదో స్వప్నానుభవం అనుకొంటున్నామేకానీ, వాస్తవం అనేభావం మాకు కలుగనేలేదు. వేదాంతులు చెప్పే మిథ్యానుభూతి అనేది ఇటువంటిదేనేమో!

యథార్థానికి, ఆ సొరతిమింగిలం ఎంత తరిమికట్టినా,

ఒకగంటకంటె ఎక్కువసేపు మమ్మల్ని వెంటాడలేదు. కాని, ఆ గంట మాకు ఒకరోజు అనిపించింది. చివరినిమిషంలో ఎరిక్కు ఓర్పు పట్టలేకపోయాడు. అతను ఎనిమిదిఅడుగుల ఈటెతో నావకు ఒకమూల నిలబడిఉన్నాడు. నలుగురూ నాలుగువిధాల పరిహాసంచేస్తూఉంటే, ఈటె బాగా పైకిఎత్తి పట్టుకొన్నాడు. తనవైపువచ్చిన సొరతిమింగిలాన్ని చూడగానే ముందంజవేసి, బలంకొద్దీ దానితలలో గ్రుచ్చివేశాడు. ఒకటిరెండుక్షణాలు ఆ జలభూతం అల్లాగే నిశ్చలంగాఉన్నది. ఆతర్వాతగాని, జరిగిందేమిటో, దానికి బోధపడిఉండదు. ఉత్తరక్షణంలో ఆప్రశాంత పరిహాసం తటిల్లతలాగా అదృశ్యంఅయింది.

ఆ మహాభూతం తలఎత్తి చూచి, నీటిలో మునిగిన వెంటనే, ఈటె రయ్‌మంటూ వచ్చి నావకు కొట్టుకొన్నది. ఒక సెలయేఱు మీద బడ్డ విధంగా, జలప్రవాహం వచ్చిపడ్డది. నావ అంచున నిలబడ్డ ముగ్గురూ బోరగిలబడిపోయారు. వారిలో ఇద్దఱు ఈటె తాకి, గాయపడ్డారు కూడాను. దట్టంగా వచ్చిన జలధారపడవను ముంచివేసేదేకానీ, అదృష్టవశాత్తూ, నావ చేరేసరికి పల్చబడిపోయింది. అంతలో, విరిగిన ఈటెముక్క నీళ్ళమీద తేలింది. ఈ హడావిడికి బెదరిన మీనబృందం తమ వృద్ధప్రభువును అనుసరించి, పలాయితమైంది ఆ సముద్ర రాక్షసి రోషావేశంతో మళ్ళీవచ్చి, ఏమైనా చెయ్యవచ్చునని, చాలాసేపు భయకంపితులమైనాము. కాని, అది మాకు కనిపించనేలేదు.

ఇప్పటికి మేము భూమధ్యరేఖకు దక్షిణాన ఉండే సముద్రప్రవాహం లోపలికి వచ్చాము. పశ్చిమాభిముఖంగా

పోతున్నాము. ఇప్పటి మా ఉనికి గాలపగాద్వీపాలకు దక్షిణాన నాలుగువందలమైళ్ళదూరాన ఉన్నది. ఇక గాలపగా ప్రవాహాల్లో చిక్కుపడతామనే భయం పీసమైనా లేదు. ఆ ద్వీపాలతో మాకు అనుబంధం ఒకే ఒకటి. అది అక్కడనుంచి త్రోవతప్పి, సముద్రంలో చాలాదూరం వచ్చిన కూర్మబృందం తెలిపే శుభాకాంక్షలు మాత్రమే. ఒకరోజున ఒక మహా కూర్మం తల ఇటువైపులకూ విసురుతూ, ఒకవైపు నీళ్ళపైకి తేలి, ఎందుకో ఆదేపనిగా పెనగులాడుతున్నది. దాని పొట్ట క్రింద పసుపుపచ్చని వెలుగులూ, నీల హరితకాంతులూ కని పించాయి. ఇంతలో ఒక కెరటం రావటంవల్ల, ఆ కూర్మం బేడిసచేపలతో పోరాడుతూ జీవనమరణ సమస్యలో చిక్కుకొన్నదని స్పష్టమైంది. ఆ పోరాటం యావత్తూ ఒకపక్షానిదే అయింది. ఆ పక్షం వన్నెవన్నెల బేడిసచేపలే. అవి తాబేలు మెడ పట్టుకోటానికీ, దానిని చీల్చి వెయ్యటానికీ ప్రయత్నిస్తున్నాయి. కాని ఆ కచ్ఛపం తలనూ, ఇతరావయవాలనూ బొరుసులోపలికి ముడుచుకోవటంవల్ల, చేపలయత్నం నెగ్గటం లేదు.

మా నావను చూడగానే, తాబేలు సరాసరి మావైపు బయలుదేరింది. చేపలు దానిని తరుముకొని వస్తున్నాయి. నావమీద నిలబడిఉన్న మమ్మల్ని చూచిన తాబేలు మా పార్శ్వానికి చేరుకొని దుంగలమీద ఎక్కటానికి ప్రయత్నించింది. మాకు ఏ కొంచెమైనా పూర్వానుభవం ఉన్నట్లైతే, దానిని సులభంగా పట్టుకోగలిగేవాళ్ళమే. మేము ఆశ్చర్యంతో దానిని చూస్తూ, కొంత కాలయాపన చెయ్యటంచేత, తీరా

దానిని పట్టుకోవటానికి సంసిద్ధులమయేసరికి, అది నావ ముఖ భాగం దాటి వెళ్ళిపోయింది. అయితే మా రబ్బరు డింగీమీద బెంగ్టు, హెర్మన్, టార్స్టీనులు కచ్ఛపాన్వేషణకి బయలు దేరారు. బెంగ్టు మనోనేత్రం ముందు తాబేటికూరతో నిండిన అనేకపాత్రలు కనిపించాయి. అయితే, వారు ముగ్గురూ ఎంత తొందరగా వెళ్ళినా, ఆ వృద్ధకచ్ఛపం అంతకంటె తొందరగా పోయి నీళ్ళలో అదృశ్యమైంది. కాని మావాళ్లు వట్టిచేతులతో తిరిగిరాలేదు రబ్బరు డింగీ నీటిమీద న ర్తిస్తూవస్తుంటే, బేడిస చేపలు ఇదేదో క్రొత్తతాబేలనుకొని, దీని వెంటపడ్డాయి. నీళ్ళల్లో ఆడుతూఉన్న తెడ్లనుచూచి, ఒక ధీరమీనం వచ్చి దానిని పట్టుకొన్నది. ఈ లోపల ఆ వృద్ధకచ్ఛపం బ్రతుకు జీవుడా అనుకొని, ప్రాణాలు దక్కించుకొనిపోయింది. మాకు బేడిసచేపలు దక్కాయి.

## మార్గమధ్యంలో

వారాలు గడిచాయి. ప్రపంచంలో ఇంకా ప్రజలున్నా రనటానికి సూచనగా, మరొక నౌకకానీ, నీళ్లల్లో ఏవైనా మానవోపయుక్తాలయిన వస్తువులు కొట్టుకొని రావటంకానీ గోచరించలేదు. పారావారమంతా మాసొత్తు. దిఙ్మండల ద్వారాలన్నీ తెఱచినట్లె, యథార్థశాంతి, స్వేచ్ఛా ఆకాశం నుంచి క్రిందికి కొట్టుకొనివచ్చినట్లు తోచింది.

ఏదో నవీన లవణం వాయుపథంలో పరిమళించి నట్లైంది. మా చుట్టూ కల పరిశుద్ధ నీలజలం మా శరీరాల్నీ, హృద

యాల్నీ కూడా కడిగివేసి, నైర్మల్యం, ప్రసాదించినట్లు తోచింది. ఆ సమయంలో నావమీద నిలిచిన మాకు నాగరకుల క్లిష్ట సమస్యలన్నీ బూటకాలుగానూ, భ్రాంతులుగానూ తోచాయి. అవన్నీ మానవుల మనశ్చాంచల్యంవల్ల పుట్టినవి మాత్రనే; అనికూడా అనుకొన్నాము. పంచభూతాల కలయికవల్లనే సృష్టి జరుగుతున్నది. కనుక ప్రాముఖ్యమంతా వాటిదే. అవి ఈ చిన్నినావను ఉపేక్షించాయి. లేదా, దీనివల్ల సముద్ర ప్రశాంతతకు భంగం ఏమీ కలగలేదులే; ఇది కూడా తన స్వేచ్ఛాగతిమీద ఆధారపడి చరించే పక్షివంటిదో, మత్స్యం వంటిదో అయిన ఒక ప్రకృతి సిద్ధపదార్థమే; అని ఆదరించి ఉంటాయి. ఒక దారుణవిరోధివలె కాన్పించటానికి బదులు, సముద్రం మాకు ఆప్తమిత్రమై, మా ప్రయాణాన్ని నిర్నిరోధంగా సాగిస్తున్నది. వాయువూ, సముద్రవీచికలూ నెట్టుకొని పోతుంటే, నౌకకు అడుగున ఉన్న సముద్రప్రవాహం ఈడ్చివేస్తుంటే, ముక్కుకు సూటిగా గమ్యస్థానంవైపు పయనిస్తున్నాము.

ఆ సమయంలో ఏదైనా ఒకరోజున మహానౌక నౌకకనుక తటస్థపడితే, చిన్నచిన్నగుగు తెట్టెల్లో దొలిపడేమహాతరంగం మీద ఉయ్యాలలూగుతూ, పాలనేషియావైపు మొగం పెట్టిన మా నారింజరంగు తెరచాపనూ, మమ్మల్నీ వీక్షించటం జరిగేది.

మా నావ వెనుకభాగంలో బూడిదరంగు గడ్డంతో, అనాచ్ఛాదితమైన శరీరంతో, చుక్కానితో కుస్తీపట్టుతున్న మనిషి కనిపించేవాడు. వాతావరణం ప్రశాంతంగా ఉంటే

మాత్రం అతను నిర్లక్ష్యంగా చుక్కానిమీద చెయ్యివేసి. ఒక పెట్టెమీదకూర్చుని, ఎండలో చలికాగుతూ ఉండటం వారికి కనిపించేది.

అయితే ఈ చుక్కానిదగ్గఱ ఉన్నమనిషి బెంగ్టుకాని పక్షంలో, వేణుమందిర ద్వారందగ్గఱ బోరగిలపరుండి, తన డెబ్భైమూడు సాంఘికశాస్త్ర గ్రంథాలగుట్టతో కాలక్షేపం చేస్తున్న ఒకవ్యక్తి వారికి కనబడేవాడు. అతనే బెంగ్టు. మేము అతన్ని మామహానసానికి అధ్యక్షుడుగా ఏర్పఱుచుకొన్నాము. మేము రోజూ తీసుకోవలసిన ఆహారం పరిమితీ, జరుగవలసిన పాకప్రక్రియా అతనే నిర్ణయించాలి. పగలంతా హెర్మన్ నావ మీద ఎక్కడోఅక్కడ తిరుగుతూనే ఉండేవాడు. ముఖ్యంగా తెఱచావ స్తంభంచివఱ ఉన్నఆకాశవాణియంత్రాన్ని పరికించుతూనో, జాఱిపోయే సులోచనాలతో నావ మధ్యభాగం వంక చూస్తూనో, రబ్బరుడింగీలో షికారుచేస్తూ, గాలిబుడగల్నీ ఇతర పరికరాల్నీ పరీక్షిస్తూనో ఉండేవాడు. అతనే మాకు సాంకేతిక నిపుణుడు. ఖగోళ పరిణామాల్నీ, సముద్రవాతావరణాన్నీ పరిశీలించి, తగినసలహాలు ఇయ్యవలసిన భారం అతనిదే.

నట్ టార్ స్టీసులకు విద్యుద్ఘట పరిశీలనతోనే కాలం గడిచిపోయేది. వారి యుద్ధరంగపు అనుభవం యావత్తూ వినియోగించి, నిస్తంత్రీ యంత్రాన్ని నీటిమట్టానికి ఒక అడుగు ఎత్తున నిలిపిఉంచి, దానిద్వారా మా పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు సమీప గగనవాణీకేంద్రాలకు తెలియజేసేవారు. అక్కడనుంచి ఆ వార్తలు వాషింగ్టన్ మొదలయిన యితర స్థలాలకు చేరేవి. ఎరిక్కు సాధారణంగా తెరచాపగుడ్డకి అతు

కులు నెయ్యటమో, త్రాళ్ళు పేనటమో చేసేవాడు. లేకపోతే దూలాలమీద పెద్దగడ్డాలుగల మనుష్యులబొమ్మలో, విచిత్ర మత్స్యరూపాలో చెక్కేవాడు; మధ్యాహ్న వేళ సెక్స్టెంటుచేత బట్టుకొని, ఒకపెట్టిమీద నిలబడి, ఉదయంనుంచీ మేము ఎంతదూరం వచ్చిందీ తెలుసుకోనటానికి, సూర్యమండలంవైపు దృష్టి నిగిడ్చి లెక్కలుకట్టేవాడు. నాకు నావిక నిత్యపరిశీలన పుస్తకం పూర్తిచెయ్యటమూ, వార్తలు పంపటమూ, అందు కోటమూ, ప్లాంక్టన్ను సంగ్రహించటమూ, చేపలుపట్టటమూ, ఛాయాచిత్రాలు తియ్యటమూ మొదలైన బోలెడుపనులుండేవి. ఇలా ఒక్కొక్కరికి ఒక్కొక్క పెద్దబాధ్యత ఉండేది. ఒకరు మఱొకరి అధికారంకోసం పెనగులాడేవారుకారు. చుక్కాని పట్టటం, వంటచెయ్యటంవంటి మోటుపనులుకూడా అందఱూ వంతులప్రకారం చేసేవారు. ఎవడైనాసరే పగలు రెండు గంటలూ, రాత్రి రెండుగంటలూ చుక్కానిపట్టటం తప్పదు. హాజరుపట్టీలోని సంఖ్యాక్రమాన్నిబట్టి, రోజుకొకరు వంట చేసేవారు. అయితే మఱీ కత్తిమీదిసాములాగా, 'ఆఁ!' అంటే మఱనేకూ, 'ఊఁ!' అంటే మఱమేకులాగా, పెద్దకట్టుదిట్టా లేమీలేవు. "రాత్రిపూట నావ కాపలాదారు రొమ్ముచుట్టూ త్రాడుబిగించుకోవాలి; నీటబడ్డవారికోసం విసిరే మోకును చోటుమార్చగూడదు; వేణుమందిరానికి వెలుపలనే భోజనాలు చెయ్యాలి; అదిన్నీ నావ వెనుక చిట్టచివఱిభాగాన." అని కొన్ని నిబంధనలు మాత్రం ఏర్పాటు చేసికొన్నాము. అంద ఱమూ కలసి, అత్యవసరంగా ఏదైనా ఆలోచించవలసివస్తే,

ఒక సంకేత శబ్దాన్ని ఉచ్చరించి, అందఱూ చేరగానే, ఆ విషయమై చర్చించి, ఏదో నిర్ణయం చేసేవాళ్ళము.

ఒకనాటి ఉదయం. కోన్-టికీ పార్శ్వాన, గతరాత్రి చిట్టచివఱ కాపలావంతు పడ్డనాటి వంటమనిషిలో నూతన చైతన్యం ప్రవేశించింది. అతను మూతలుపడుతున్న కళ్ళతోనే, ప్రాకుతూ వెళ్ళి, హీమసిక్తమైన నౌకా పార్శ్వాన కొన్ని మత్స్యాలను సేకరించాడు. పచ్చి చేపల్ని తినటానికి బదులు, పాలినేషియా, పెరూ సంప్రదాయాలను బట్టి, మేము స్టౌమీద చేపల్ని వేయించుకొని మఱీ తినేవాళ్ళము. వేణుమందిర ద్వారానికి చేరువనున్న కొయ్యపెట్టెలో చిన్న ప్రైమస్ స్టౌ ఉండేది. ఈ కొయ్యపెట్టె మా పాకశాల. ఇక్కడ తఱచూ వీచే ఆగ్నేయ వ్యాపార పవనాన్ని ఆపుకోటానికి ఒక చిన్న వసారాలాంటిది ఏర్పఱచుకొన్నాము. ఆ వ్యాపారపవనమూ, సముద్రపు గాలీ జతపడినప్పుడు దారుపేటికలో స్టౌ మఱీ మండేది. వంటచేసే మనిషి ఆ సమయంలో కొంచెం కునుకుతున్నాడా; దారుపేటిక మండటమూ, ఆ మంట వేణుమందిరానికి కూడా సోకటమూ సంభవించేది. అయితే నీళ్ళకోసం దూరం పోనక్కఱలేదు కనుక, అతి శీఘ్రంగానే మంటలు ఆర్పివేసికొనేవాళ్ళం.

చేపలు వేగుతున్న వాసన రాగానే, ఎంత గాఢనిద్రలో ఉన్నవారైనా తత్క్షణం లేచేవారు. ఎవరైనా తొందఱగా లేవకపోయినా, ఆ చేపలకు ముండ్లచెంచా గుచ్చేసరికైనా మేలుకొనేవారు. అప్పటికీ మెలకువరాని అన్నయ్యలకోసం వంటచేసే మనిషి "చద్దిబోనం సిద్ధమైనదీ" అని ఒక వింత

బాణీలో పాట మొదలుపెట్టేవాడు! ఆ పాట ప్రారంభంకాగానే ఎంత గుఱ్ఱుపెట్టుతున్నవాళ్ళకైనా, నిద్రాభంగం కాకమానదు. ఏ నాడైనా సొరచేపలు నావమీదకు వచ్చి పడకపోతే, పసిఫిక్‌ని గాలించి, మా అభిమతపదార్థాన్ని సంపాదించుకొని మరీ భోజనం చేస్తుండేవాళ్ళం.

అప్పటి మా భోజనవసతికూడ బాగానే ఉన్నది. పాక ప్రక్రియకు పురాతనాధునాతన పద్ధతులు రెండూ ఉపయోగిస్తూ వచ్చాము. ఒకటి 15 వ శతాబ్దపు పద్ధతి. ఆ నాడు నావికులు ఏయే ఆహారపదార్థాల్ని ఉపయోగించారో వాటినీ తయారు చేసికొన్నాము. ఈ ఇరవయ్యో శతాబ్దంలోని వంటకాల్నీ వండించాము. టార్‌స్టీనూ, బెంగ్టూ అధునాతన భోజన పద్ధతినే వరించారు. మా ప్రయాణ ప్రారంభ సమయంలో మేము సేకరించి, తెచ్చి జాగ్రత్తగా గడలమధ్య దాచిఉంచిన పొట్లాలు విప్పి, వాటితో వారికి నచ్చినవిధంగా వంటచేయించుకొనే వారు. చేపలతో ఇతర నావికాహారపు దినుసులతో వారి ఆకలి తీఱేదికాదు. కొన్నివారాలు గడవగానే వేణుమందిరానికి వ్రేలాడుతున్న త్రాళ్ళన్నిటినీ ఒక్క చోటికి చేర్చి, క్రొత్త వాటినికూడా కలిపి పేనేవాళ్ళం. వాటితో వేణుమందిరాన్ని మఱింత గట్టిపఱుచుకొనేవాళ్ళం. ఇంతేకాక మందిరం నలువైపులా కట్టిన అట్టగోడలు చెక్కుచెదఱకపోయినా, గాలి చొఱడానికి వీలులేని డబ్బాలలోని పదార్థాలు ఎల్లా తడిసేవో; మాకు బోధపడలేదు. ఆ పదార్థాలన్నీ చెడిపోయాయి.


కోన్-టికీ నావల్లో ప్రయాణంచేసిన పూర్వీకులు అట్టపెట్టెలుకానీ, గాలిచొఱనిమూతలుకల డబ్బాలుకానీ ఎఱుగక

పోయినా, వారికి తిండికొరత అన్నది తటస్థించనేలేదు. ఆ రోజుల్లోకూడా, వారు ప్రయాణస్థలాన్నుంచి కొన్ని ఆహార పదార్థాలు తెచ్చుకొనేవారు - సముద్రంలో చేపలు వగైరాలు పట్టి అరగించేవారు. టిటికాకా సరస్సులో దెబ్బతిన్నతర్వాత, పెరూతీరం వెంట ప్రయాణించే కోన్-టికీ నావికులు ఆహారం విషయంలో ఈ రెండువిధాలా జాగ్రత్తపడడం మొదలుపెట్టారని మనం ఊహించవచ్చును కేవలం సూర్యుణ్ణే ఆరాధించే జాతికి చెందిన నావికులు నూతనమూ, అధికప్రశాంతమూ అయిన భూభాగాన్ని చేరగలమనే నమ్మకతో, సూర్యుణ్ణే లక్ష్యంగా పెట్టుకొని ప్రయాణించేవారు. లేదా, దక్షిణ అమెరికా తీరం వెంట పైకి సాగిపోతూ, తమ శత్రువులు చేరరాని ఒక ప్రత్యేక భూభాగాన్ని చేరాలనే ఉద్దేశంతో పయనించేవారు. పర్వతమయమైన తీరాన్నిగూర్చిన భయంతో కానీ, అక్కడక్కడ ఎదురయ్యే శత్రుజాతులకు వెఱచికానీ, దూరంగాపోయి, మాలాగే ఆగ్నేయపవనానికి గురిఅయేవారు; హంబోల్టు ప్రవాహంలో చిక్కుకొనేవారు. చిట్టచివరికి తిన్నగా పశ్చిమార్థ చక్రంలో చిక్కుకొని కొట్టుకొనిపోయేవారు.


ఆ సూర్యభక్తుల ఉద్దేశాలు ఏమైనప్పటికీ, సముద్రయానం ప్రారంభించటానికి ముందు కొన్ని ఆహారపదార్థాలను మాత్రం సేకరించుకొనే బయలుదేరేవారు. ఎండబెట్టిన మాంసమూ, చేపలూ, చిలగడదుంపలూ ఆ నావికుల ముఖ్యాహారం. వారు పెరూదేశపు నిర్మనుష్యతీరం వెంట ప్రయాణించేటప్పుడు వారికి కావలసినంత నీరుకూడా కొనిపోయేవారు. అయితే ఆ నీళ్ళు భద్రపరుచుకొనడానికి మట్టిపాత్రల్ని కాక,

తోలుసంచుల్నే ఉపయోగించేవారు. తోలుసంచులైతే ఎటు పడ్డా పగిలిపోవుగదా! తోలుసంచులకంటె కూడా నావలో జలపాత్రలుగా ఉపయోగించదగ్గవి వెదురుగొట్టాలు. ఆ సూర్య భక్తులు అతి స్థూలాలైన వెదురుగొట్టాలు తెచ్చి, వాటి లోపలి కనుపులకు రంధ్రాలుచేసి, నీటితోనింపి, మూతిని బిరడాతోనో, ఆకుతోనూ, గుగ్గిలంతోనో మూసివేసేవారు. ఇటువంటి సజలవంశనాళాలు ముప్పైగానీ, నలభైగానీ నావ అడుగున పడిఉండి, సముద్రజలంలో మునుగుతూ, తేలుతూ భూమధ్యరేఖదగ్గరి ప్రవాహంలో 79 డిగ్రీల ఉష్ణతలో అంటే చాలా చల్లగా ఉండేవి. ఈ విధంగానే నీటిని నిలువ చేసికొన్నట్లయితే, మా ప్రయాణం మొత్తంమీద మేము ఉపయోగించే నీటికి రెట్టింపు భద్రపరుచుకొనటానికి వీలుండేది. ఇంకా అంతకన్నకూడా ఎక్కువే ఉంటుందేమో. పైగా ఈ వెదురు గొట్టాలు నావకు ఒక పెద్దబరువూ కావు. వాటివల్ల నావ ఇఱుకుగానూ ఉండదు. అవి నావ అడుగున ఉండేవి కదా!

రెండునెలలు గడిచేసరికి, మేము తెచ్చుకొన్న మంచి నీరు రుచిచెడి, దుర్వాసన కొట్టటం మొదలుపెట్టింది. కాని సముద్రంలో మొట్టమొదట కొంతమేర వర్షశూన్యమై, తర్వాత అంతటా విశేషవర్షపాతం ఉంటూఉంటుంది కనుక, మంచినీరు పట్టుకొనటానికి అవకాశం ఉంది. మేము మనిషికి రోజుకు 28 పౌనుల మంచినీటి చొప్పున వాడుకొనేవాళ్ళం. ఆ వాడుకను ఇంకా పరిమితం చేసుకోవలసిన అవసరంకానీ, ఎప్పుడూకూడా మంచినీటికోసం మాటీ మొగంవాచిపోవలసిన అవసరంకానీ తటస్థించలేదు.



"కోన్-టికీ కనుసన్నలలో" తెరచాప మీద కనబడుతున్న బవిరి గడ్డపు బొమ్మ కోన్-టికీ ప్రాచీన శిల్పానికి ప్రతికృతి.



సొరచేపను
పడవమీదికి
చేర్చుతున్న
దృశ్యం.



శక్తి ఉడిగే వఱకూ
పడవప్రక్క
అడ్డంగా పడిఉన్న
సొరచేప.

మాకు పూర్వపు నావికులుకూడా, చాలీచాలని పానీయంతో బయలుదేరినా, మత్స్యభూయిష్ఠమైన ప్రవాహాల మీాద ప్రయాణిస్తూఉంటే, నీటికొఱతవల్ల ఎక్కువబాధపడే వారు కారు. మత్స్యాలు మా నావచుట్టూ ఈదుతూ, మేము ప్రయత్నిస్తే, అనాయాసంగా లభించనిరోజు ఒక్కటీ లేదు. ఒక్కొక్క లచేపలు వాటిఅంతట అవివచ్చి, నావమీాద పడిపోని రోజూ లేదు. ఒక్కొక్కప్పుడు, బనెటోచేపలు పెద్ద అలలతో కొట్టుకొనివచ్చి, నావమీాద పడి, మిట్టిపడుతుండేవి. వాటితో వచ్చిననీరుమాత్రం జల్లెడనుంచి జారినట్టుగా, నావదుంగల సందులనుంచి జారిపోయేది. ఆహారం దొఱక్కపోవటం మాత్రం తటస్థించేది కాదు.

యుద్ధసమయాల్లో సముద్రాలపై ప్రయాణిస్తూ ఉన్న సైనికులు పచ్చిచేపలను నమిలితే వచ్చే తృష్ణా నివారక రసంతో దాహం తీర్చుకొనేవారు. ఈ దాహ నివారణోపాయం పూర్వులకు తెలుసు. మత్స్యఖండాలని ఒకవస్త్రంలో వేసి, గట్టిగా నొక్కి ఆ తృష్ణానివారకరసం పిండుకొనవచ్చును. చేప పెద్దదైతే, దాని శరీరంమీాద అక్కడక్కడ కత్తితోపొడిచితే, ఆ రసం క్రిందికి స్రవిస్తుంది. అది పానీయంకంటె రుచిగా ఉండదుగానీ, దానిలో ఉప్పు విశేషంగా ఉండదు కనుక, దాహం తీర్చుకోటానికి మాత్రం పనికివస్తుంది.

అసలు చక్కగా స్నానంచేసి, నీడపట్టున కూర్చుంటే, పిపాస అంతగా ఉండేదికాదు. స్నానానికిన్నీ పెద్ద ప్రయాస పడనక్కఱలేదు. నావతోచేర్చి కట్టుకొన్న త్రాడు ముడివిడకుండా జాగ్రత్తపడుతూ, దూలాలమీాద హాయిగా పరుండిఉంటే,

నావ ప్రక్కన విహరించే సొరచేపల దయవల్ల కావలసినంత నిర్మలోదకం వర్షిస్తూ ఉంటుంది.

బాగా ఎండలో తిరిగితే, దాహమౌతుంది. అలా దాహం కలిగిన సమయాల్లో నిర్ణీత ప్రమాణమైన నీరు మాత్రమే త్రాగాలంటే, ఆ దాహపీడితుడు ఒప్పుకోడు. ఇందువల్ల శత్రుత్వాలు కూడా ఏర్పడుతాయి. ఎండలో ప్రయాణం చేస్తూ ఉన్నప్పుడు కొంచెం వెచ్చని నీళ్లు రుచి చూడకుండా, ఎన్ని గొంతులో పోసికొన్నా, ఇంకా దాహంగానే ఉంటుంది. అప్పుడు శరీరానికి కావలసింది ఉప్పేకాని, ఏ ద్రవపదార్థమూ కాదు. బాగా ఎండ ఉన్న సమయాల్లో మేము ఉప్పుబిళ్ళలు కూడా చప్పరించేవాళ్ళము. ఎందువల్లనంటే, స్వేదం బయటికి వస్తూ ఉన్నకొద్దీ, శరీరంలో ఉండే లవణం హరించుకొని పోతుంది. రేషను ప్రకారం మంచినీళ్లు త్రాగితే, ఉదరాలు నిండినట్లున్నా, కంఠం మాత్రం "ఇంకా కావాలి! ఇంకా కావాలి!" అనేది. ఎండ కాచిన రోజుల్లో మంచినీటిలో నూటికి ఇరవై నుంచి నలభైవంతులదాకా సముద్రజలంకూడా చేర్చితే దాహశాంతి కలిగేది. తర్వాతకూడా, చాలాకాలం మేము సముద్రోదకం త్రాగుతూవచ్చాము. అందువల్ల మా ఆరోగ్యం ఏ మాత్రమూ చెడలేదు. పైపెచ్చు మంచినీటి వాటా కొంచెం పెంచుకోటానికి అవకాశం కలిగింది.

ఒక ఉదయం మేము భోజనం చేస్తూ ఉన్న సమయంలో ఒక కెరటం రావటం, ఆ ఉప్పునీరు మా వదన కుహరాల్లో చొరబడటమూ సంభవించింది. అప్పుడు మేము తినే ఓట్ల

రుచికీ, ఈ సముద్రజలం రుచికీ ఎంతో వ్యత్యాసం లేదనే సత్యం మాకు బోధపడ్డది.

పూర్వకాలపు పాలినేషియన్లు పాటించిన కొన్ని పురాతనాచారాలు నిజంగా తెలుసుకోవలసినవే. సముద్రయానం చేసే సమయాల్లో వారు ఒకవిధమైన మొక్కకూడా వెంట తీసుకుపోయేవారు. దాని ఆకులు నమిలితే, దాహం శాంతిస్తుంది. అంతేకాక, అప్పుడు సముద్రజలం వెగటు అనిపించదు. అటువంటి మొక్కలు దక్షిణ ద్వీపాలలో లేవు. అవి పాలినేషియన్ల పూర్వులు నివసించిన ప్రదేశాల్లో ఉత్పత్తి అయిఉంటాయి. పాలినేషియన్ చరిత్రకారులు ఈ విషయమై పరిశోధనలుచేసి, పెరూలోమాత్రమే పెరిగే 'కోకా' అనే మొక్కలో ఈ లక్షణాలు ఉన్నట్లు శాస్త్రజ్ఞులు నిర్ణయం చేసినట్లు ఉదాహరిస్తున్నారు దీనిలో "కొకెయిన్" ఉన్నది. చరిత్రకు అందని ప్రాచీన కాలంలో పెరూవాసులైన 'ఇంకాలూ', వారిపూర్వులూ ఈ మొక్కను ఒక ఉపయోగకర వస్తువుగా చూచుకొన్నట్లు కనబడుతుంది. ఆ ప్రాచీన శిథిలాల్లో సమాధుల మీద ఈ మొక్కను నాటటం ఆనాటి సంప్రదాయంగా తెలుస్తున్నది. పర్వత ప్రదేశాల్లోనూ, సముద్రాలమీదనూ పయనించే సమయాల్లో ఈ ఆకులు నమిలి, దాహమూ, అలసటా తీర్చుకొనేవారు. కోకా ఆకులు నమలిన మనిషి వెగటులేకుండా, సముద్రోదకం త్రాగగలడనే రహస్యం ఇటీవలనే అనుభవ గోచరమైంది.

అయితే, కోన్-టికీ యాత్రలో మేము కోకా ఆకులలో ఉండే గుణం పరీక్షించలేదు. కాని, దక్షిణద్వీపాలలో ఎక్కు-

వగా వాడుకలో ఉండే రకరకాల మొక్కలనుమాత్రం పెద్ద పెద్ద గంపల్లో పెట్టి తెచ్చుకొన్నాము. ఆ గంపల్ని వేణుమందిర కుడ్యాలకు వ్రేలాడగట్టాము. కాలక్రమాన పసుపుపచ్చని చిగుళ్లూ, ఆకులూ పుట్టి, గంపలనుంచి బయటికి పొడుచుకొని రానటం మొదలుపెట్టాయి. అప్పుడు నానమీంది దృశ్యం, ఒక ఉద్యానవనం నడక నేర్చుకొంటున్నట్టున్నది. ఐరోపావాసులు మొట్టమొదట పసిఫిక్ ద్వీపాలకు వచ్చినప్పుడు, ఈస్టర్ హవాజీ న్యూజిలాండులలో చిలగడదుంప విశేషంగా పైరవటం గమనించారు. ఇదే ఇతర ద్వీపాల్లోనూ ఉత్పత్తి అయేది. అయితే పాలినేషియన్లు ఉన్న ప్రాంతాల్లోమాత్రమే ఈ పైరు కనిపించేది. ఈ దూరభూముల్లో అతిముఖ్యమైన పంటలలో ఇది ఒకటి. వ్యవసాయం చెయ్యనివారికి చేపల్ని పట్టటం ప్రధాన వృత్తిగా ఉండేది. పాలినేషియన్ల పురాణకథల్లో ఈ మొక్కకు సంబంధించిన కథలు ఎన్నో ఉన్నాయి. వీరు చెప్పుకొనే కథలను బట్టి, 'టికీ' అనే అతను, తన భార్యఅయిన 'పాణి'తో, క్రొత్తగా ఇక్కడికి వచ్చేటప్పుడు, మాతృభూమినుంచి ఈ మొక్కను తీసుకువచ్చాడని తెలుస్తున్నది. చిలగడదుంప అతని మాతృభూమిలో ప్రధానాహార వస్తువుగా ఉండేదట! న్యూజిలాండు ఇతిహాసాల్లో ఈ మొక్క పడవమీంద గాక, తెప్పమీంద వచ్చినట్లున్నది.

అయితే, ఐరోపావాసులు ప్రవేశించటానికి చాలా పూర్వకాలంనుంచీ చిలగడదుంప ఫలించేది ప్రపంచం మొత్తం మీంద అమెరికాలో మాత్రమే. టికీ తీసుకువచ్చిన ఈ సస్యజాతి పెరూ దేశంలో చిరకాలంనుంచీ ఇండియన్లు పండించిన

సస్యమే ప్రాచీన పెరూవాసులకూ పాలినేషియన్ నావికులకూ ఎండబెట్టిన బంగాళదుంపలు దారిబత్తెంగా ఉండేవి. దక్షిణసముద్రద్వీపాల్లో రైతు అతి జాగ్రత్త తీసుకొంటేనే ఈ సస్యం ఫలిస్తుంది. పెరూతీరంనుంచి నాలుగువేల మైళ్ళకు పైగా కొట్టుకొనివచ్చి, ఇది చెల్లాచెదురుగా ఉన్న ఈ ద్వీపాల్లో పరివ్యాప్తం కావటం జగద్విదితమైంది. భాషాతత్త్వ శాస్త్రజ్ఞులు ఈ నానాద్వీపసముదాయంలో పెరిగే ఈ చిలగడదుంప పేరు "కుమార" అనీ, పెరూ దేశంలో వసించిన ప్రాచీనులైన ఇండియనులు "చిలగడదుంప" అనేదీ ఈ "కుమార" అనేదీ ఒక్కటేననీ సూచించే ఉన్నారు. సముద్రం దాటివచ్చినప్పుడు ఈ మొక్కకీ పేరు వచ్చింది.

మా నావలో సొరమొక్క కూడా ఉన్నది. ఇదికూడా పాలినేషియన్లు ముఖ్యంగా పెంచేవాటిలో ఒకటి. దీనిని 'లేగనేరియా వల్గరిస్' అనికూడా అంటారు. ఈకాయ ఎంత ముఖ్యమో దీనిపై చర్మంకూడా అంతముఖ్యమే. పాలినేషియన్లు దీనిని మంటపైన కాచి, ఎండబెట్టి, జలపాత్రగా ఉపయోగించేవారు. పెరూ ప్రాచీనవాసులతోకూడిఉన్న పాలినేషియన్లు ఈ మొక్కనుకూడా పెంచారు. అయితే, ఇది కూడా సముద్రంలో కొట్టుకొనివచ్చినట్లు ప్రచారంలేదు. జలవాహికలుగా ఉపయోగపడే ఈ సొరకాయలు పెరూతీరాన నిర్జనంగాఉన్న ప్రాంతాల్లోని పురాతన శ్మశానాల్లో కనిపించాయి. పసిఫిక్ దీవులలో మనుష్యులు ప్రవేశించటానికి పూర్వం బహుశతాబ్దాలక్రిందట పెరూతీరవాసులైన పల్లెజాతులవారు వీటిని ఉపయోగించేవారు. సొరకాయకు పాలినేషియన్లు

పెట్టినపేరు "కిమి". పెరూసంస్కృతి వేళ్ళుపాతుకొన్న మధ్య అమెరికాలో నివసించే ఇండియన్ల నివాసస్థలాల్లో ఇదికన్పిస్తుంది. మేము తెచ్చుకొన్న దక్షిణ దేశపు ఫలాల్లో చాలాభాగం అవి చెడకముందే కొన్నివారాల్లో ఆరగించాము. చిలగడదుంపతో పాటు మఱోరకం కాయకూడా మేము తెచ్చుకొన్నాము. పసిఫిక్ చరిత్రలో ఆ కాయకు విశేషప్రాముఖ్యం ఉన్నది. మా దగ్గఱ రెండువందల కొబ్బరికాయలున్నాయి. అయితే కొబ్బరి మా దంతాలకు బలేపని కల్పించింది. ఆ నీరుమాత్రం దాహోప శమనం కలిగించింది. చాలాకాయల్లోంచి మొక్కలు మొలి చాయి. పదివారాలు గడిచేసరికి, ఆఱుమొక్కలు ఒక అడుగు ఎత్తుపెరిగి ఆకుపచ్చని ఆకులతో విస్తరించటం మొదలుపెట్టాయి. కొలంబస్ కాలానికి పూర్వమే పెనామా భూసంధిలోనూ, దక్షిణ అమెరికాలోనూకూడా కొబ్బరిచెట్లు ఉన్నాయి. స్పెయినువారి రాకకుపూర్వమే పసిఫిక్ తీరాన ఉన్న పెరూ ప్రాంతంలో అసంఖ్యాక నారికేళవృక్షాలు ఉన్నవని చరిత్ర కారుడు 'ఒవియెడో' వ్రాస్తున్నాడు. ఆ కాలంలో పసిఫిక్ దీవు లన్నింటిలోనూ నారికేళవృక్షాలు చిరప్రవర్ధమానాలుగా ఉండేవి. అయితే, అవి ఎటునుంచి ఇటువచ్చిందీ, వృక్షశాస్త్ర జ్ఞులు ఇప్పటికీ నిర్ణయించలేదు. కాని, వారు ఒకవిషయం మాత్రం కనిపెట్టారు : "మనుష్యులెవరూ తీసుకురాకపోతే, పైన పెంకు ఉన్నంతమాత్రాన కొబ్బరికాయ సముద్ర పర్య టన చెయ్యలేదు." నావపార్శ్వాన గంపల్లో ఇంకా కావలసి నన్ని కొబ్బరికాయలున్నాయి. అవి ఏ మాత్రం చెడిపోలేదు. పాలినేషియా చేరేవఱకూ, తింటూ ఉండవచ్చు కానీ, వీటిలో

సగం నావకు అడుగున మూటల్లో పెట్టి ఉంచాము. అవి సముద్రజలంలో నిర్విరామంగా స్నానంచేస్తూనే ఉన్నాయి. అందువల్ల వాటిలో చెడనికాయ లేనేలేదు. వాయుబలంతో ప్రయాణించే బల్సా నావకంటె తొందరగా కొబ్బరికాయ సముద్రం మీద ప్రయాణం చెయ్యలేదు. ఆ కాయ కన్నులదగ్గఱ కొంచెం మృదువుగా ఉండటంవల్ల, నీళ్ళల్లో నాని చివికిపోగానే, నీరు చొఱబడి, కాయను పాడుచేసి ఉంటుంది.

ప్రశాంతదినాల్లో ఒక్కొక్కప్పుడు నీళ్ళమీద తేలుతున్న ఒక తెల్లనిపక్షిఱెక్క మా వెనుకనే ప్రయాణం చెయ్యటం జరుగుతూవచ్చింది. సముద్రంపైన నిద్రించగల జలపక్షులు కొన్ని సమీప భూభాగంనుంచి ఎగిరివచ్చి, వేలకొలది సముద్రపు మైళ్ళదూరం మాతో కలసిఉన్నాయి. మేము ఆ పక్షిఱెక్క దగ్గరకు పోగానే పరీక్షించి చూస్తే, దానిమీద సముద్రయానానికి బయలుదేరిన విచిత్రయాత్రికులు ఇద్దఱో, ముగ్గురో కన్పించేవారు. కోన్-టికీని చూడగానే తమ నావకంటె ఎన్నోరెట్లు విశాలమైనదీ, ఎంతో వేగంగా వెళ్ళేదీ కనిపించినప్పుడు, ఇంకా ఈ స్వల్పసాధనం దేనికనుకున్నారేమో ఆ విచిత్రయాత్రికులు, వారు తమ ప్రయాణసాధనాన్ని విసర్జించి, అలల కడ్డంపడి, ఎల్లాగైతేనేమి కోన్-టికీలో ప్రవేశించారు. అచిరకాలంలో, మా నావ ఇటువంటి యాత్రికులతో ఇసుకవేస్తే రాలనట్టు నిండిపోయింది. ఆ యాత్రికులు కుళీర కుల పవిత్రులు. బహు సూక్ష్మగాత్రులు. గోరంతగానీ, అంతకంటె రవంతగానీ శరీరపరిమాణం కల ఈ ఎండ్రకాయలు బలే రుచిగా ఉంటాయి. కుళీరదళాలు సము

ద్రవు మట్టంమీద గస్తీతిరిగే రక్షకభటదళాలు—అంటే, అతిశయోక్తి కాదు. ఈ రక్షకభటులకి ఏదైనా నోటపడుతుందని పిస్తే, తత్‌క్షణం వారు అక్కడికి చేరుకొంటారు. వంటమనిషి ఒకరాత్రిపూట నావమీద మీనమేదైనా చేరినజాడ గమనించక, మఱునటి ఉదయం దాన్ని చూచేసరికి, ఈ రక్షకభటులు పదిపన్నెండుమంది దానిని ఆవరించి, తమ నిశిత నఖాలతో గ్రుచ్చి, ఆరగించటానికి యత్నిస్తూ ఉండేవారు. అయితే, మేము కంటబడగానే, ఆ కుళీరోత్తములు పాపం బెదరిపోయి, చెల్లాచెదరై, మళ్ళీ మాకు కనిపించేవారు కారు. కాని, ఒక కుళీరవీరుడు మాత్రం, ఏ దూరాలాలసందునో నక్కి, మా చేష్టలు పరిశీలిస్తూ, మేము కనుమఱుగైతే, యథాప్రకారంగా నావమీద విహరించటం మొదలుపెట్టేవాడు. మేము అతనికి 'జోహాన్స్' అని పేరుపెట్టి, నెమ్మదిగా చనువుచేసికొన్నాము. చిలుకలాగానే 'జోహాన్స్'కూడా మాకు ఆప్తమిత్రుడైనాడు. చుక్కానిపట్టే మనిషికి 'జోహాన్స్' దగ్గఱ లేకపోతే, ఏమీ తోచేదికాదు. ఇతర కుళీర బృందాలు బొద్దింకల్లాగా, దొంగతనంగా, ఏదో ఒక ఆహారపదార్థాన్ని ఆరగించటానికి ప్రయత్నిస్తూ ఉన్నప్పటికీ, జోహాన్స్ మాత్రం అటువంటి అకార్యాలకు మనసొప్పక, తరువాత వచ్చే కాపలామనిషికోసం కళ్లు పెద్దవిచేసి, ఎదురుచూస్తూ ఉండేవాడు. మాలో ఎవరము బయటికివచ్చినా, జోహాన్సుకోసం ఏబిస్కట్టో తెచ్చేవాళ్ళము. అతను నివసించే కన్నానికి దగ్గఱగా వెళ్ళి, మెల్లగా సంజ్ఞ చేస్తే చాలు; తత్‌క్షణం అతను బయటకి ప్రాకివచ్చేవాడు. మా ప్రేళ్ళ చివఱ ఉన్న బిస్కట్టు ముక్కను డెక్కలతో

అందుకొని, తన మందిరంలో దూరి, బడికి వెళ్ళే తొందరలో ఉన్న విద్యార్థిలాగా, ఆ ఆహారాన్ని ఆదరాబాదరా ఆరగించే వాడు.

ఈగల్లాగానే, సీతలుకూడా, నీళ్లల్లో నాని కుళ్ళిన కొబ్బరికాయలో చొఱబడి, దానిని బ్రద్దలు చేసేవి. లేకపోతే, అలలతో మునిగితేలిన ప్లాంక్టన్ని ఆశ్రయించేవి. ఈ సూక్ష్మాంగ జీవులు మాకు చాలా ప్రియమైన ఆహారం అయినాయి. ఒక్కమాఱుగా ఒకగుంపును పట్టుకోగలిగితే, కొంతసేపటివఱకూ నమలి మ్రింగుతూ ఉండవచ్చును.

మహాసముద్రాల్లో అసంఖ్యాకంగా ప్రవాహాలవెంట కొట్టుకొనివచ్చే ప్లాంక్టన్‌లలో మంచి పుష్టికరమైన ఆహారం ఉన్నది. ఈ ప్లాంక్టన్లని స్వయంగా భుజించని చేపలూ, సముద్ర విహంగాలూ, ఇతర మత్స్యాలనుగానీ, జంతువులనుగానీ ఎంత పెద్దవాటినైనా సరే తింటూ ఉంటాయి. సముద్రోపరిభాగాన కొట్టుకొనిపోయే వేలకొలది సూక్ష్మాంగజాతులను ప్లాంక్టన్ అని పేర్కొంటారు. వీటిలోకొన్ని కంటికి కనిపించనంత చిన్నవి కూడా ఉంటాయి. ఈ ప్లాంక్టన్లలో కొన్ని చిన్నమొక్కలు; కొన్ని చేపగ్రుడ్లు; కొన్ని రకరకాల సూక్ష్మప్రాణులు. జంతు జాతి ప్లాంక్టన్లకు వృక్షజాతి ప్లాంక్టన్లు ఆహారం. వృక్షజాతి ప్లాంక్టన్లకు మరణించిన జంతుజాతి ప్లాంక్టన్ల శరీరాలనుంచి వెలువడే నవాసారమూ, సురేకారమూ, కొండికారమూ మొదలయినవి ఆహారం. ఈ విధంగా ఇవి ఒకదాన్ని మఱొకటి తిని బ్రతుకుతూఉంటే, ఇవి అన్నీకలసి సముద్రం పైనగానీ, లోపల గానీ సంచరించే ప్రతి ప్రాణికీ ఆహారం అవుతూ ఉంటాయి.

అవి పెద్దవికాకపోయినా, అసంఖ్యాకంగా ఉంటాయి కాబట్టి, కొంతవరకు ఆకలి చల్లార్చుకోటానికి పనికివస్తాయి. ఒక్క గ్లాసెడు ప్లాంక్టన్ నీటిలో వేలకొలది ప్లాంక్టన్లు ఉంటాయి. ఇనుపముండ్లతో గ్రుచ్చికానీ, వలవేసికానీ, గాలాలతో లాగి కానీ బయటికి తీయడానికి వీలుగాని మరీ చిన్న చేపలు మాత్రమే కనబడే ప్రాంతాల్లో సముద్రయానం చేసినవారు, ఆకటిచిచ్చుతో మాడి మరణించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అటువంటి సంఘటనలలో, సాధారణంగా, వారి ప్రయాణం శిశుమత్స్యాలమీదా, అతి స్వల్పరూపాల్లో ఉన్న జలంమీదనే జరిగిఉంటుంది. అటువంటినీటిని చేపలువేసికాచిన చారు అనవచ్చును. ఎందుచేతనూ అంటే, చారులో చేపల సారమే ఉంటుందికానీ, చేపలు కనబడీకనబడకుండా ఉంటాయి. ఈ నీళ్ళల్లోకూడా అసంఖ్యాకమీనాలు ఉన్నా, పట్టుకొందా మంటే దొరకనంత చిన్నవిగాఉంటాయి. కొన్ని అసలు కంటికే కనిపించవు. కాని, నీరంతా చేపలతో నిండే ఉంటుంది. గాలాలూ, వలలూ మాత్రమేకాకుండా, ఈ నీళ్ళను వడియ గట్టే సాధనాలుకూడా, వారు తెచ్చుకొనిఉంటే, నీళ్ళనుంచి కావలసినంత ప్లాంక్టన్ వారికి లభించేది. అది చాలా పుష్టికర మైన ఆహారం కావటంవల్ల, వారు క్షుద్బాధకు తట్టుకోలేని పరి స్థితులు ఏర్పడేవేకావు. ఇంకా కొంతకాలం గడిస్తే, భూమి మీద పైరులు పండించినట్లే, సముద్రంమీద ప్లాంక్టన్లను పెంచ టానికి కృషి జరుగవచ్చును. ఒక్క ధాన్యపుగింజతో ఆకలి లవలేశమూ శాంతించనప్పటికీ, సమృద్ధిగా ధాన్యంలభిస్తే మంచి ఆహారం అవుతుందికదా!

సముద్రజీవశాస్త్రజ్ఞుడు డాక్టర్ ఎ. డి. బజ్‌కోవ్ ప్లాంక్టన్నుగురించి మాకు బాగా తెలియజెప్పి, వాటిని పట్టుకోటానికి తగినటువంటి వలకూడా తెప్పించి యిచ్చాడు. అది సిల్కువల అందులో ఒక చదరపు అంగుళంమేరలో దాదాపు మూడు వేల రంధ్రాలుంటాయి. అది గొట్టం ఆకారంలో ఉంది. ముందుభాగంలో ఒక ఇనుపఉంగరం లాంటిది ఉన్నది. దాని వ్యాసం 18 అంగుళాలు. ఈ వలని మా నావకు వెనుక భాగంలో కట్టి ఉంచాము. ఏచేపల్ని పట్టటానికైనా, దేశకాల పాత్రాలు విచారించవలసినట్లే, ఈ ప్లాంక్టన్ని పట్టుకోటానికిన్నీ దేశకాలపాత్రాలు విచారించాలి. పశ్చిమానికి పోయిన కొద్దీనీ, ఎండగాఉంటే, ప్లాంక్టన్లు దొరికేవి కావు. రాత్రిపూట ఎంతకష్టపడితే అంత విశేషఫలం లభించేది. ఒకొక్కప్పుడు శ్రమకంటె ఎన్నోరెట్లున్నా ఫలితం దక్కేది. ఎందుచేతనంటే, అతిసూక్ష్మశరీరాలుగల ఈ ప్లాంక్టన్లు ఎండవేళ సాగరగర్భంలోకిపోతూ, రాత్రులు మాత్రమే ఉపరిభాగాన విహరిస్తూ ఉంటాయి.

చెయ్యటానికి పనియేమీలేకపోతే, ఈ ప్లాంక్టన్ వలలో తలదూర్చి, అటూ ఇటూ చూస్తూ కొంతకాలక్షేపం చేసేవాళ్ళము. వలలోనుంచి సువాసనవస్తూ ఉంటుందా అంటే, సువాసనరాదు సరిగదా, దుర్వాసన తప్పకుండా వస్తుంది. పోనీ చూడముచ్చటగా ఉంటుందా అంటే, భోజనాలు చేసిన తర్వాత ఎక్కడివస్తువులక్కడే ఉంచివేసిన అసంస్కృత భోజనశాలలాగా కనబడుతుంది. అయితే అందులో తల దూర్చటం దేనికి? అని ప్రశ్నించవచ్చును. ఆదృశ్యం కనువిందుకాదు కానీ,

చాలా అస్పృతంగా మాత్రం ఉంటుంది. ఆ ప్లాంక్టన్ని పరిశీలించి చూస్తూఉంటే, చాలా వింతగా ఉంటుంది. వాటిరూప లక్షణాలుగానీ, రంగులుగానీ ఇన్నిరకాలని చెప్పటానికి వీలు లేదు. దేనికదే విచిత్రంగా కనబడుతుంది. ఆ వైచిత్ర్యమే మమ్మల్ని ఆకర్షించింది.

ప్లాంక్టన్లో చాలా భాగం కాయల్లాగా ఉండే చిన్న రొయ్యల్లో, గుడ్లలో, అప్పుడే గుడ్లలోనుంచి బయటికివచ్చిన సూక్ష్మకీటక రూపాలో మాత్రమే. కొన్నిమాత్రం పెంకు చేపలూ, రంగు రంగుల పీతలూ, జిగురుచేపలూ ఉంటాయి. ఇక తక్కినవన్నీ వాల్ట్‌డిస్నీ అపూర్వకల్పనానికి అనుగుణమైన విచిత్రసూక్ష్మజీవులు. కొన్ని కత్తిరించి పోసిన కాగితపుపీలికల్లాగా ఎగిరిపడుతూఉంటే, కొన్ని ఈకలకు బదులు పెంకుగల చిన్నపక్షుల్లాగా, ఎఱ్ఱటిముక్కులతో, విచిత్రంగా కదులుతూ ఉంటాయి. ప్లాంక్టన్‌లోకంలో ప్రకృతి విచిత్రసృష్టి చాతుర్యమంతా కేంద్రీకృతమైనట్లు కనబడుతుంది. ప్రకృతి యథార్థరూపాన్ని సృష్టించటానికే బద్ధకంకణుడైన ఎంతనిపుణుడైన చిత్రకారుడైనా, ఆ సృష్టిని ఎన్నడూ తనకుంచెతో చిత్రించలేదు.

భూమధ్యరేఖకు దక్షిణాన హంబోల్టు ప్రవాహం పశ్చిమాభిముఖం అయింది మొదలుకొని, టన్నులకొద్ది ప్లాంక్టన్ జావ కొన్నిగంటలు గడిచినప్పుడల్లా క్రుమ్మరించేస్తున్నాము— ఆ ప్లాంక్టన్ ఉత్పత్తి దేశానుగుణంగా గోధుమరంగూ, ఎఱుపూ, బూడిదరంగూ,ఆకుపచ్చరంగులతో పొరలుగల పెద్ద రొట్టెముక్కలాగా కనబడుతున్నది. ఉష్ణతారహితప్రకాశం

గోచరించే రాత్రి సమయాల్లో. అది ఒక అదృశ్యభూతం ఈడ్చుకుపోతున్న ఉజ్జ్వల రత్నకోశమేమో అనిపించుతున్నది. కాని మేము పట్టుకోగానే ఆ నిశాసమయంలో అంగారకరాశి వలె మెరుస్తున్న ఆ రత్నకోశం యానత్తూ మినుకు మినుకు మంటున్న లక్షలకొలది చిన్నరొయ్యచేపల్లాగానూ, అండాల్లో నుంచి అప్పుడే బయటబడ్డ సూక్ష్మమత్స్య శిశువుల్లాగానూ మాఱిపోయేది. ఆ పదార్థాన్ని ఒక పాత్రలో పోయగానే, అది మిణుగురుపురుగులతో కాచిన జావయేమో అనిపించేది. దూరాన్నుంచి చూస్తే, అతిసుందరంగా కనిపించిన ఆ పదార్థమే, దగ్గఱ ఉన్నప్పుడు చాలా అసహ్యంగా కనిపించేది అయితే అదిఎంత కంపుకొట్టుతున్నా, ధైర్యంచేసి ఒక చెంచా పరిశుద్ధ భాస్వరం నోట్లో వేసికొన్నతర్వాత గనుక రుచిచూస్తే, బాగానేఉండేది. ఇందులో చాలా మఱుగుజ్జు రొయ్యలున్నట్లయితే, రొయ్య జావలాగానో, ఎండ్రకాయ లాగానో రుచించేది అలాకాక, సాగరగర్భంలోనుంచి బయటపడ్డ చేపగ్రుడ్లు విశేషంగాఉంటే, గుడ్ల చేపలరుచి ఉండేది. అభోజ్యమైన వృక్షజాతి ప్లాంక్టన్లు లోపల బెజ్జాలనుంచి దూఱిపోయేటంత చిన్నవి ఉండేవి. అలా కాని స్థూలపదార్థాల్ని మేమే ఏఱిపాఱవేసేవాళ్ళం. పళ్ళెంలో పడ్డ ప్లాంక్టన్‌గుంపు గాజుగుమ్మటాలవంటి జిగురుచేపలు. ఈ జిగురుచేప పొడుగు సుమారు అఱఅంగుళం మాత్రమే. ఇవి కొఱుకుడు పడకపోవటంవల్ల పాఱవెయ్యవలసివచ్చేది; లేకపోతే, పచ్చివే తినవచ్చు. చారులోనో జావలోనో వేసుకోవచ్చు. అయితే ఒక్కొక్కరికి ఒక్కొక్క రుచి ఉంటుంది. మా ఆఱుగురిలోనూ, ఇద్దఱికి అవి చాలా ఇంపైనాయి. ఇద్దఱికి

బాగానే ఉన్నాయనిపించాయి. మిగతా ఇద్దరికీ వాటిని చూస్తేనే కడుపునిండేది. జీర్ణం కావటం ముఖ్యమనుకొంటే ఎదిగిన జెల్లీచేపలు ఎంతలో జీర్ణమౌతాయో, ఇవీ అంతలోనే జీర్ణమౌతాయి. సంబారాలన్నీ చేర్చి సరిగా వండితే, నావికాహారం రుచించినవారికి అది చాలా మంచిభోజ్యమే అవుతుంది.

ఈ సూక్ష్మాంగజీవుల్లో పుష్టికరమైన కృత్తులు ఉన్నాయనటానికి, ఇవే తిని బ్రతికే నీల తిమింగిలం ప్రత్యక్షసాక్ష్యం. ప్రపంచంలోని జంతువులన్నింటిలోనూ ఇంతకంటె పెద్దది లేదు. మేము నావమీద కూర్చుని, సముద్రం పరికిస్తూఉండగా, అప్పుడే వస్తూఉన్న ఒక తిమింగిలం సెల్యులాయిడ్‌తో నిర్మితమైనట్టున్న గడ్డంతో ప్లాంక్టన్ని వడియగట్టుకొని పోతూ, నీరు ఎగజిమ్మింది. ఆనీరు ఒక జలపర్వతంలాగా కనిపించింది. కడుపు మండిన చేపలుకొన్ని అప్పుడప్పుడు కొరికి వేస్తూఉండటం వల్ల మావల జీర్ణమైంది. ఇక ప్లాంక్టన్ని సాధించే ఉపాయం లేదు గదా అని మేము దిగులుపడ్డాము. ఒకరోజున ఆ శిథిలిత సాధనంకూడా సముద్రంపాలైంది.

పడవమీద ఉండి దూరాన పోతూఉన్న తిమింగిలాల్ని చూచాను; చిత్రవస్తు ప్రదర్శనశాలల్లో ఉన్న తిమింగిలాల్ని చూచానుకానీ, గుఱ్ఱమూ, ఏనుగూవంటి ఉష్ణరక్త ప్రసారం కల జంతువులను చూచినప్పుడు కలిగే ఆనందం భీకర తిమింగిల కళేబరాన్ని చూచినప్పుడు కలిగేదికాదు. జంతుశాస్త్ర సిద్ధాంతానుసారం ఇదికూడా సంతానానికి పాలిచ్చి పెంచేజంతువుల్లో చేరిందనే ఒప్పుకుంటాను. కానీ, ఆహార విహారాది లక్షణాలను బట్టీ, రూపాన్నిబట్టీ ఇది ఒక పెద్దచేపమాత్రమే. పెద్ద తిమింగి

లాలు మహావేగంతో మా నావ పార్శ్వానపోతూ ఉన్నప్పుడు "ఏమిజరుగుతుందో" అనే సందేహానికి, తలకొకవిధంగా సమాధానం చెప్పుకొనేవాళ్ళం. ఒకరోజున మేము అప్పుడే భోజనాలుచేసి లేచాము. నావ అంచునకూర్చుండి, గిన్నెలు సముద్రజలంతో కడుగుతున్నాము. మా వెనుక ఒక నీటిగుఱ్ఱం ఈదుకొని వస్తున్నట్లు తోచి, అటు చూచాము. ఒక పెద్దతిమింగిలం వచ్చి మమ్మల్నే పరికిస్తున్నది. అది చాలాదగ్గఱగా ఉండటంచేత, దానిని బాగా పరీక్షించి చూడటానికి అవకాశం కలిగింది. దాని నాసికారంధ్రాల లోపలిభాగం అడుగున మొలుగు పెట్టిన చెప్పులాగా ఉన్నది. సముద్రయానం చేసేటప్పుడు యథార్థ శ్వాసక్రియాధ్వనిని వినటానికి అవకాశంలేదు. ఎందుచేతనూ అంటే, సాధారణ జలచరాలన్నీ ఊపిరితిత్తులు లేనివే. అవి వాటి శ్వాసేంద్రియాలను అల్లల్లాడిస్తూ, నీళ్ళల్లో కలిగిన ప్రాణవాయువునే పీలుస్తాయి. సముద్రంలో సుదీర్ఘ ప్రయాణంచేస్తూ, మానవలెనే శ్వాసక్రియ జరిపే ఆ తిమింగిలాన్ని చూస్తే, ఏదో స్వజాతివ్యక్తినీ, స్వకుటుంబంలోని ఆప్త బంధువునూ చూచినట్లే తోచింది. గోదుమకప్పుతల కల ఆ తిమింగిలపు సారచేప నీటిలోనుంచి నాసిక బయటపెట్టి, ఉచ్ఛ్వాసనిశ్వాసాలు జరుపనే జరుపదు. ఈ తిమింగిలం ఉచ్ఛ్వాస నిశ్వాసాలు గమనించగానే, జంతుప్రదర్శనశాలావనంలో ఇదివఱకు మేము చూచిన సోల్లాసమైన నీటిగుఱ్ఱం జ్ఞాపకానికి వచ్చింది. ఇంతలోనే తిమింగిలం నీళ్ళల్లో మునిగి అదృశ్యమైంది.

మేము తిమింగిలాన్ని అనేకపర్యాయాలు చూచాము.

సాధారణంగా చిన్న రకపు తిమింగిలాలు గుంపులు గుంపులుగా ప్రత్యక్షమవుతూ ఉండేవి. అప్పుడప్పుడు భయంకరాలైన మహా తిమింగిలాలున్నూ కనిపించేవి. అయితే అవి ఇలా గుంపులు గట్టి తిరిగేవి కావు. ఒంటరిగానే సంచరిస్తూ ఉంటాయి. అప్పుడప్పుడు మాత్రం స్వల్పసంఖ్యలో కలిసిపోతూఉండేవి. ఒక్కొక్కప్పుడు ఉన్నోత్తుగా నీటిని ఎగజిమ్ముతూ, దిఙ్మండలంమీద ప్రయాణించే ఓడలలాగా పరుగెత్తుతూ ఉండేవి. ఒకప్పుడు అవి తిన్నగా మా వైపే వచ్చేవి. ఒకసారి మహాతిమింగిలం ఒకటి తన గమనాన్ని మార్చుకొని మావైపు తిరిగి గబగబా వస్తోంది. దీనికేదో దుర్బుద్ధి పుట్టనేపుట్టిం దనుకొని, మేము రాబోయే ప్రమాదాన్ని ఎదుర్కొటానికి సంసిద్ధులమైనాము. అది సమీపిస్తూ ఉన్నకొద్దీ దాని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు హెచ్చుస్థాయిలో వినబడుతూ వచ్చాయి. మాటి మాటికీ, అది నీళ్ళలోనుంచి తలపైకెత్తి, గిరగిర త్రిప్పుతున్నది. దాని శరీరం చాలా పెద్దది. చర్మం చాలా దళసరి. నీళ్ళలో ఈదుకొంటూ వచ్చిన భూచరజంతువులాగానే ఉన్నది. అయితే ఇది పట్టుకొనటానికి గానీ, మచ్చిక చేసికొనటానికిగానీ సాధ్యం కానిది. గాలిలో ఎగురగల్గినా గబ్బిలంపక్షి కానట్లే, నీళ్ళల్లోనే సంచరిస్తూ ఉన్నప్పటికీ, ఇది చేపకాదు; అనుకొన్నాము. అది తిన్నగా నౌకాముఖద్వారం సమీపించింది. అంతలోనే నావ పార్శ్వాన ఉన్నవాళ్ళం అక్కడికి చేరుకొన్నాము. ఈ లోపల తెఱచాప కొయ్యమీద కూర్చున్నమనిషి 'ఏడో ఎనిమిదో తిమింగిలాలు నౌకాభిముఖమై వస్తున్నా'యని కేకలు వేశాడు.

నీలంగా నిగనిగ లాడుతున్న మొదటి తిమింగిలం భయంకర ముఖం మాకు రెండు గజాల దూరంలో ఉన్నది. అంతలో అది నీళ్ళల్లో మునిగింది. మా పాదాలకు కొంచెం దిగువగా నావ అడుగునుండి జారిపోతూ ఆ తిమింగిలం సుదీర్ఘ నీలకాయం క్రమంగా అదృశ్యమైంది. అయితే అది నావ విడిచిపోలేదు. నావ అడుగుననే కొంతసేపు నిశ్చలంగా పరుండి ఉన్నది. నావకంటె ఎంతో పొడుగై, మా కాళ్ళ క్రిందనే శయనించి ఉన్న ఆ భీకర జంతువును చూస్తూ ఉండగా మాకు ఏమీ తోచలేదు. ఊపిరి బిగబట్టి కానున్న దానికి ఎదురు చూస్తున్నాము. కొంతసేపటికి అది మమ్మల్ని విడిచిపెట్టి, యెటో వెళ్ళిపోయింది. ఇంతలో ఆ యేడెనిమిది తిమింగిలాలూ వచ్చాయి. అయితే అవి మమ్మల్ని గమనించనేలేదు. తిమింగిలాలు పుచ్ఛ తాడనాలతో పడవలను తలక్రిందులుచేసి ముంచివేస్తాయని ప్రతీతి. పొద్దుటిపూటయావత్తూ, అనేకపర్యాయాలు ఆకస్మికంగా ఆ భయంకర జంతువులు మా నావ చుట్టూ ఈదుతూ, బుసలు కొడుతూ, ప్రదక్షిణాలు చేశాయికానీ, మామీద తమబలాన్ని ఏమాత్రమూ ప్రయోగించలేదు. అసలు నావను తాకనేలేదు. వీచికా పరంపరలతో బీభత్స క్రీడలాడుతూ వినోదించాయి. మధ్యాహ్న సమయానికి మాఅదృష్టంవల్ల ఆ గుంపంతా ఏదో సంకేతం గుర్తించినట్లుగా, జలమగ్నమై అదృశ్యమైంది. నావ అడుగున గోచరించేవి తిమింగిలాలు మాత్రమే కాదు. మా గడ్డి పరుపులను తొలగించి, నావ అడుగు చెక్కల సందునుంచి చూస్తే సముద్రజలం అతిస్వచ్ఛంగా కనిపించేది. అదే విధంగా పరుండి చూస్తూఉంటే, కొంతసేపటికి ఏదైనా చేపకాక్కాని,

తోకకానీ కనిపించి, క్రమక్రమంగా చేప యావత్తూ కనిపించేది. ఆ సందులే మఱికొన్ని అంగుళాలు వెడల్పుగా ఉండి ఉంటే, అక్కడనే మేము చేపలు పట్టగలిగేవాళ్ళము.

నావను నిరంతరంగా అంటిపెట్టుకొని ఉండేవి బేడిస చేపలూ, చుక్కాని చేపలూను. కెల్లా తర్వాత ప్రవాహంలో మాకు బేడిసచేప కనబడ్డప్పటినుంచీ, పెద్దపెద్ద బేడిస చేపలు నావచుట్టూ మిట్టిపడుతూ రానిరోజు లేనేలేదు. ఏ ఆకర్షణ వల్ల అవి నౌకదగ్గరకు వచ్చాయో, మాకు తెలియదు. నౌక అడుగున ఈదుతూ పోవటం వాటికి వినోదం కావచ్చు. లేక పోతే నావ అడుగున కనబడే పచ్చని మొక్కలు-అంటే నాచు మొక్కలుగానీ, దూలాలకు అంటుకొనిఉన్న నత్తగుల్లలుగానీ, వాటికి ప్రియమైన ఆహారం అయిఉండవచ్చు. ఈ సముద్రపు పాచితో నావ అడుగున పచ్చనిరంగు పూసినట్లుండి, క్రమ క్రమంగా ఆ మొక్కలు బాగా ఎదిగినాయి. అలలపై అటూ ఇటూ ఒరిగే కోన్-టికీ సశ్మశ్రువైన ఒక విచిత్ర సముద్రదేవ తగా కనిపిస్తున్నది. ఆ నాచుమొక్కల లోపల మమ్మల్ని ఆశ్రయించుకొన్న పీతలు ఉన్నాయి.

ఒకప్పుడు మా నావమీద చీమలదే. పైచేయి అయిన సమయంకూడా ఉన్నది. కొన్ని దుంగలలో నల్లని గండు చీమలు ఉన్నాయి. మేము సముద్రంమీద బయలుదేరిన తర్వాత దుంగలమీద విశ్రాంతి తీసుకొనే సమయంలో అవి బయటికి వచ్చాయి. మాప్రక్కలమీదకూడా అధిష్ఠించాయి. కాని కొన్నాళ్లు అవి మమ్మల్ని వేధించినా త్వరలోనే అదృశ్యాలైనాయి. కొన్నిమాత్రం నమూనాలకోసం ఉన్న

టుగా నావలో మిగిలి ఉన్నాయి. అవి మేము సముద్రం రెండోవైపు చేరేవఱకూ కూడా మమ్మల్ని విడిచిపెట్టలేదు. అంగుళంనుంచి అంగుళమున్నర పొడుగుండే నత్తగుల్లలు కూడా, పీతలతోబాటు నావలో స్థావరం ఏర్పరచుకొన్నవి. అవి వందలకొలదిగా పెరుగుతూ వచ్చాయి. ముఖ్యంగా నావలో గాలి చొఱనిభాగంలో విశేషంగా ఉండేవి. ప్రాతవి తీసి నావలో వాడుకొంటూఉంటే, అంతలోనే క్రొత్తవి వృద్ధిపొతూ ఉండేవి. నత్తగుల్లలు ఎప్పటికప్పుడు క్రొత్తకుచు లూరేవి. నాచుమొక్కలను పచ్చడిచేసేవాళ్ళము. అది అంత రుచిగా లేకపోయినా, డోకువచ్చేదిమాత్రంకాదు. బేడిస చేపలు మా నాచుమొక్కలను తినటం మేము ఎన్నడూ కళ్ళారా చూడలేదు కాని అవి నావఅడుగున వెల్లకిలపడి తిరుగుతూ ఉండటం గమనించాము బేడిసచేప అనగానే ఉష్ణమండలాల్లో జీవించే ఉజ్జ్వలవర్ణంకల బేడిసచేపా, దంతాలుమాత్రం చిన్నవైతిమింగిలజాతికి చెందిన్నీ, బేడిసఅని ప్రసిద్ధమైనచేపా ఒకటే అని అనుకోగూడదు. బేడిస సాధారణంగా మూడడుగుల మూడంగుళాలనుంచి నాలుగడుగుల ఆరంగుళాలదాకా పొడుగుంటుంది. దాని పార్శ్వాలు చదునుగా ఉంటాయి. తలా, మెడా బాగా ఎత్తుగాఉంటాయి. ఒకసారి మాకు నాలుగడుగుల ఎనిమిదంగుళాలు పొడుగూ, పదమూడున్నర అంగుళాల ఎత్తైన తలా, కల ఒక బేడిస దొరికింది. బేడిసరంగు చాలా అద్భుతమైనది. నీళ్ళల్లో ఉన్నప్పుడు అది నీలంగానూ, ఆకుపచ్చగానూ కనిపించే నీలపుసీసాలాగా కనిపిస్తుంది దాని రెక్కలకు బంగారపువన్నె ఉంటుంది. ఆ చేపను నావమీదకు

లాగితే ఒక విచిత్రదృశ్యం కనిపించేది. అది చచ్చిపోగానే, దానిరంగు మారి, మాసిన వెండివన్నె వచ్చేది. దానిమీద నల్లనిమచ్చలు కనిపించేవి. చిట్టచివరికి అది పూర్తిగా వెండి లాగా తళతళ లాడేది. ఈ మార్పులన్నీ నాలుగైదు నిమిషాల్లో జరిగేవి. తర్వాత యథాపూర్వమైన రంగులు కనిపించేవి. నీళ్ళల్లో ఉన్నప్పుడుకూడా, బేడిసచేప ఊసరవెల్లిలాగా, సందర్భానుసారంగా రంగులు మార్చేది. అప్పుడప్పుడు ఒక రాగివన్నె చేప కనిపించేది. జాగ్రత్తగా పరిశీలించేసరికి అది మామూలు రకమైనది కానేకాదు. మాకు సుపరిచితమైన బేడిసే! ఒకప్రక్కనుంచి చూచినప్పుడు బేడిస తల పెద్దకుక్క తలలాగా కనిపించేది ఎగిరేచేపల గుంపులు పారిపోతూ ఉన్నప్పుడల్లా అది ముఖభాగాన్ని పైకెత్తుకొని పోయేది. ఉత్సాహంగా ఉన్న సమయాలలో, తల పైకెత్తి మహావేగానపోతూ, గాలిలోకి ఎగిరిపోయి, చదునైన పెనంలాగా, నీళ్ళల్లో పడుతూఉండేది. అది నీళ్ళలో పడ్డవెంటనే నీరు చిమ్మిన పైకిలేచేది. ఇంతలో బేడిస మళ్ళీ పైకి ఎగురుతూ, అలలమీద ఎగిరిపడేది. కాని, మేము దాన్ని నావమీదకు ఈడ్చినప్పుడు, దానికి కలిగేకోపం ఇంతా అంతాకాదు. కోపంవస్తే, మమ్మల్ని కఱచివేసేది.

ఒకసారి టార్‌స్టీను నీళ్ళల్లో కాలు ఉంచేసరికి, ఒక బేడిస అతని బొటనవ్రేలు గట్టిగా పట్టికొని కఱచివేసింది. మేము ప్రయాణం ముగించుకొని ఇండ్లకు చేరుకొన్నతరువాత స్నానంచేస్తున్న మనుష్యులమీద బేడిసలు దండయాత్రలు చేసి, చంపితినటం మొదలుపెట్టాయని విన్నాము. మేము ప్రతిదినమూ వాటిమధ్యనే స్నానంచేసేవాళ్ళముగానీ, అవి మా జోలి

రాలేదంటే, అది మా గొప్పతనం అనము. నిజానికి బేడిసలు కంటబడ్డ ఏ ప్రాణినైనా మ్రింగాలనే క్రూరతత్వంగలవే. వాటి ఉదరాల్లో ఎగిరేచేపలు మొదలయినవి చిక్కుకొని ఉండటం మేము చూచాము.

బేడిస చేపలకు ఎగిరేచేపలు ప్రియమైన ఆహారం. నీటి మీద ఏది ఎగురుతున్నట్లు కనిపించినా, అది రెక్కల చేప అనే భ్రాంతితో, అమాంతము ఇవి అక్కడకు దుముకుతాయి. నిద్రమత్తు తీరీ తీరకుండానే నెమ్మదిగా నావ అంచుకు ప్రాకుతూవచ్చి, పలుదోము కుంచె నీళ్ళల్లో ముంచి, ఇంకా కునికిపాట్లు పడుతున్న మాకు, నావ క్రిందనుంచి మెఱుపులాగా వచ్చి, కుంచెను కబళించబోయిన బేడిస గలభాతో పూర్తి మెలకువ వచ్చేది. అంతలోనే, పాపం! నిస్పృహతో బేడిస వెనుకకు వెళ్ళిపోయేది. ఒకొక్కమాఱు నావ అంచున ఉదయాన్నే మేము భోజనాలకు కూరోచ్చగానే, ఎక్కడ మాటేదో; బేడిస రివ్వున వచ్చేది. ఆ వేగానికి చిందిననీళ్ళతో, మా భోజనపదార్థాలు తడిసిపోయేవి.

ఒక మధ్యాహ్నంపూట మేము భోజనాలు చేస్తూ ఉండగా, టార్‌స్టీను మత్స్య స్వభావం విదితం కావడానికి ఒక అద్భుత కథ నడిపాడు. అకస్మాత్తుగా తన ముండ్ల చెంచాతీసి, సముద్రంలో ముంచాడు. ఏం జరుగుతున్నదో మాకు తెలిసే లోపల, సముద్రజలం ఉడికిపోతున్నట్లు కనిపించింది. ఉత్తర క్షణంలో ఒక పెద్ద బేడిస దోజలిపడుతూ వచ్చి మామధ్య పడ్డది. టార్‌స్టీను తన చెంచా పైకిఎత్తి దానితోపాటు వ్రేలాడు తున్న బేడిసను పట్టుకొన్నాడు. ఒకసారి ఎరిక్కు చేపలు

పట్టుతూ ఉండగా, అతని గాలం కఱ్ఱను విఱిచివేసినది ఆ బేడిసే.

ఏ రోజూకూడా ఏడెనిమిది బేడిసలు ప్రదక్షిణంచేస్తూ, నావ అడుగున మాతోపాటు వస్తూఉండేవి. ఎప్పుడైనా మా రోజులు మంచివి కాకపోతే, రెండో మూడో మాత్రమే కన బడేవి. మంచిరోజుల్లో ముప్పైనలభైకూడా వచ్చేవి. మా మధ్యాహ్న భోజనానికి సరిక్రొత్త చేపలు కావాలనిపిస్తే, భోజనానికి ఇరవైనిమిషాలు ముందుగా వంటమనిషికి చెప్పితే చాలు. అతను ఒక పొట్టి వెదురు కఱ్ఱకు గాలం బిగించి, గాలం చివఱ ఒక ముక్కలచేపనుకట్టి నీళ్ళలోపలికి విసిరేవాడు. అంత లోనే మెఱపులాగా ఒకబేడిస తన తలతో నీటిని చీల్చు కొంటూ ఆ ముక్కలచేపను వేటాడటానికి వచ్చిపడేది. రాచ పీనుగు తోడులేక చావదన్నట్లు, అది తనతోబాటు మఱి రెండు మూడు బేడిసల్నికూడా వెంటబెట్టుకువచ్చేది. అప్పుడు మాకు కావలసినన్ని చేపలు. బేడిసమాంసం కాడ్ సాల్మన్‌లసమ్మేళనం వలె అద్భుతమైన రుచి. ఆ పదార్థం మాకు రెండురోజులకు సరిపోయేది.

మాకు చుక్కాని చేపతో పరిచయం మఱొక విధంగా కలిగింది. సొరచేప వాటిని తీసుకు వచ్చేది. దానిపని పూర్తి చేసిన తర్వాత వీటిపని పట్టించే వాళ్ళము. మేము సముద్రం మీద ఎంతోదూరం రాకముందే సొరచేప మాకు ప్రత్యక్షమై నది. తర్వాత అచిరకాలంలోనే అనేకంగా ఆ జాతిమత్స్యాలు కనిపిస్తూ వచ్చాయి. ఒక్కొక్కసారి సొరచేప నావను పరీ క్షించటానికన్నట్టు వచ్చి, మాచుట్టూ ఒకటిరెండుసార్లు ప్రద

క్షీణించి, ఆహారాన్వేషణకోసం ఎటో పోయేది. కాని చుక్కాని దగ్గఱనేను మెలకువగా ఉన్న సమయాల్లో, అనేకపర్యాయాలు సొరచేపలు మా వెనుకనే నిశ్శబ్దంగా దాగి ఉండేవి. నావపొడుగునా ఏదో ఒకటి వ్రేంగిలిస్తూ, ఎప్పుడైనా మాత్రం నావకంటె తొందఱగా వెళ్ళాలనే తలంపుతో, తోకఎత్తి, నావను ప్రక్కకు నెట్టివేసేది. నీటిమట్టానికి కొంచెం దిగువగా ఉన్నప్పుడు సొరచేప సామాన్య నీలశరీరం సూర్యకాంతిలో గోధుమవర్ణంగా కనిపించేది. అది అలలతో క్రిందా మీదా పడుతూఉంటే, దాని వెన్నుదగ్గఱి తెక్క భయంకరంగా చలిస్తూ ఉండేది. ఏదైనా పెద్దకెఱటం వచ్చినప్పుడు, ఇది మాకంటె ఎంతో ఎత్తుకు వస్తూ ఉండటం సంభవించేది. అప్పుడు నీళ్ళమధ్య ఇది ఒక గాజుతొట్టెలో ఉన్నట్లుండటంచేత, దీని శరీరం యావత్తూ పరిశీలనగా చూడటానికి మాకు అవకాశం కలిగేది. తరువాత అది ఉదాత్తగమనంతో, చుక్కాని చేపల్ని పురస్కరించుకొని, మావైపు వచ్చేది. కొన్నిసెకన్లలో ఆ సొరచేప సపరివారంగా మానావమీదకే విచ్చేస్తుం దనుకొనే వాళ్ళం. ఇంతలో మానావ ఒక కెఱటంమీదనుంచి క్రిందికి వచ్చి, దానితరువాతనే వచ్చిన మఱో కెఱటంతో పైకి లేచేది.

ఈ మహామీనాలవిషయంలో మాకు మంచితాత్పర్యం ఉన్నది. ఇవి లోక ప్రసిద్ధాలు. వీటి శరీర పరిమాణం చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలిగితీఱుతుంది. వీటి కర్కశ శరీరాల్లో ఎంతో బలం ఉన్నది. చదునుగాఉండే ఆ వెడల్పైన తలలో మహాలోభం గూడు గట్టుకొని ఉన్నట్లు, దాని హరిత నేత్రాలు చెప్తూతూ ఉంటాయి ఆ విశాలవదనంలో నుంచి

ఫుట్‌బాల్‌వంటి పెద్దవస్తువులయినా జాటి కంఠబిలంలో పడ తాయి. సొరచేప నౌకాముఖద్వారంవద్ద ఉన్నదనో, నౌకా పార్శ్వభాగాన ఉన్నదనో చుక్కానిదగ్గఱి మనిషి కేకవేయ గానే, అందఱమూ ఈటెలూ మొదలైన పరికరాలతో వచ్చి, నావఅంచున నిలబడే వాళ్ళం. ఇంతలో, సొరచేప అలమీద నుంచి వెన్నుతెక్క మాకు కనిపించేటట్లు జాఱుతూ, నౌక ప్రక్కనే పడేది. మా ఈటెలయినా విఱిగేవికానీ, దాని శరీరం సాధారణంగా గాయపడేదికాదు. ఈటెలతో దానిని పొడిచి నందువల్ల మాకుకలిగే ప్రయోజనం ఏమిటీ అంటే, నీరంతా సలసల మరిగిపోవటం, దాని శరీరంలోనుంచి బయలుదేరిన ఒక విధమైననూనె నీటిమీద వ్యాపించిఉండటం మాత్రమే.

ఇటువంటి పోరాటాల్లో శిథిలావశేషమైన ఏకైక భల్లా గ్రాన్ని జాగ్రత్త చేసుకోటానికి మేము ఒకపని చేశాము. మా పెద్ద పెద్ద గాలాలన్నింటినీ ప్రోగుచేసి, ఒక బేడిస మృత శరీరంలో దిట్టంగా అమర్చాము. ఈ ఎఱను నావ అంచున ఉంచి, కొన్ని ఉక్కు తీగెలతో మా జీవిత భద్రతకు కట్టిన మోకుతో బిగించి వేశాము. తప్పకుండా సొరచేప వచ్చింది. ముట్టె భాగాఎత్తి, నోరు తెఱచి, ఒక్క ఊపులో మొత్తం బేడి సను నీళ్ళలోపలికి లాగవేసింది. ఇక అక్కడ గాలాలకు చిక్కింది. తర్వాత అది నీటిని ఎగజిమ్మటంతో, మాకు చాలా ప్రయాస కలిగింది. కాని మేము త్రాడు గట్టిగా పట్టి, అది యెంత గుంజుకొంటున్నా, నావపైకి లాగివేశాము. అప్పు డది ముందేమి జరుగుతుందో అని నిరీక్షించుతూ, కోఱలు బయట బెట్టి, మమ్మల్ని బెదరించటానికి వ్యర్థప్రయత్నం చేసింది.

ఇంతలో ఒక తరంగం వచ్చి దానిని బాగా ఇవతలకు నెట్టి వేయటంతో, మాకు శ్రమ తప్పిపోయింది. మేము దాని తోకను త్రాటితో దిట్టంగాకట్టి అవతలకు వెళ్ళిపోయాము. అది గుంజుకొని గుంజుకొని, అలసి, సొమ్మసిల్లింది.

దానిని కోస్తూఉండగా, మా ఈటె కొన బయటికి వచ్చింది. ఈటె గ్రుచ్చుకోవటంచేతనే, ఇది మనతో ఎక్కువ సేపు పెనగులాడలేక పోయిందని, మేము పొరపాటు పడ్డాము. కాని, ఆ తరువాత ఇదేపద్ధతిలో ఒకదాని తర్వాత ఒకటిగా ఎన్నో సొరచేపలను పట్టుకొన్నాము ఎప్పుడూ కూడా ఇదే విధంగా అవలీలగా కృతకృత్యులం అయినాము. సొరచేప ఎంత దూకినా, గుంజుకొన్నా, ఎంత భయంకరంగా కనిపించినా, దానికి ధైర్యం తక్కువ. తేలికగా లోబడేది. మేము త్రాడు గట్టిగాపట్టుకొని, దానిని ఒక్క అంగుళమైనా, వెనుకకు పోనిచ్చే వాళ్ళము కాము. అది తన రాక్షసబలాన్ని సంపూర్తిగా విని యోగించుకొనేదీ కాదు. మాకు దొరికిన సొరచేపలలో సాధా రణంగా ఆరునుంచి పదిఅడుగులదాకా పొడుగుండేవి. వాటిలో కొన్ని నీలంగానూ కొన్ని గోధుమవర్ణంగానూ ఉండేవి. ఈ గోధుమవర్ణపు సొరచేప శరీరంలో కత్తిగ్రుచ్చితే దిగేదికాదు. మా బలంకొద్దీ కత్తిమీద మఱి దేనితోనైనా కొట్టవలసి వచ్చేది. ఒక్కొక్కప్పుడు అప్పటికీకూడా ప్రయోజనం కని పించేదికాదు. దాని పైచర్మం అంత అభేద్యం. అడుగు చర్మం కూడా అంతగట్టిదే. తలప్రక్కనఉండే అయిదు శ్వాసేంద్రియపు చీలికలుమాత్రమే మెత్తనిచోట్లు.

ఒక సొరచేపను మేము ఈడ్చుకొని వచ్చినప్పుడు పట్టు

కొంటే జారిపోయే నల్లని రిమోరా(ఒకజాతిచేప)లు దాని శరీరాన్ని కఱచిపట్టుకొని ఉండేవి. సొరచేప తలనుంచి స్రవించే ఒక ద్రవంలో ఉన్న జిగురువల్ల అవి దానిశరీరానికి అతుకుకొని ఉండి, తోకపట్టుకొనిలాగితే, ఊడివచ్చేవికావు. కాని ఉత్తర క్షణంలోనే, మఱొక ఆశ్రయం అన్వేషించుకోటం కోసం, వాటి అంతట అవే అక్కడనుంచి వెళ్లిపోయేవి. తమకు అంతవఱకు ఆశ్రయమిచ్చిన ఆ సొరచేప తిరిగి సముద్రానికి మఱలక పోయేసరికి, నావ అడుగుభాగపు సందులలోనుంచి సముద్రంలో పడి, ఇంకొక సొరచేపకోసం అన్వేషణ సాగించేవి. సొరచేప ఏదీ దొఱకకపోతే, ఈ రిమోరాచేప అది కనబడే వఱకూ, మఱేచేప శరీరాన్నైనా ఆశ్రయిస్తుంది. రిమోరా సాధారణంగా ఒక వ్రేలంత పొడుగునుండి అడుగు పొడుగు దాకా ఉంటుంది. సజీవమైన రిమోరా కనబడితే, పెరూ ప్రాచీనజాతులు ఏవిధంగా దానిని ఉపయోగించుకొనేవారో, ఆ పద్ధతినే మేమూ అనుసరించాము. దానితోకకు ఒకత్రాడు గట్టి, వారు దానిని సముద్రంలో ఈదనిచ్చేవారు. అప్పుడది తనకు మొట్టమొదట కనిపించిన ఏదోఒకచేప శరీరాన్ని గట్టిగా పట్టుకొనేది. అదృష్టవంతుడైన జాలరికి రిమోరాతోకకు కట్టిన త్రాటిని లాగగానే రిమోరాతో మఱొకచేప లభించేది. మాకా అదృష్టం లేకపోయింది. నెమ్మదినెమ్మదిగా ఈ జాతిచేపలను చాలా పట్టుకొన్నాము. అవి మా నావఅడుగున ఉన్న నత్తగుల్లలని ఆరగిస్తూ, శాంత మహాసముద్రం అవతలవైపు వఱకూ మాతో ప్రయాణం చేశాయి.

అయితే రిమోరాకు తెలివితేటలు శూన్యం. రూపం

అసహ్యాం. తనతోడి చుక్కాని చేప మచ్చిక అయినట్లుగా, ఇది మచ్చికకాదు. చుక్కాని చేప చిన్నసిగరెట్టు ఆకారంలో ఉంటుంది. దీని శరీరంమీద కంచుఅగాడిదకు ఉన్నట్లు చారలు ఉంటాయి. ఇది తనజాతి వాటితో కలసి సొరచేపకు ఎఱకావలసినవాటిదగ్గఱకు వెళ్లుతూ ఉంటుంది. కండ్లు కనబడీ కనబడని నెచ్చెలి సొరచేపకు మార్గదర్శకంగా ఉంటూఉన్నది కనుకనే, దీనికి చుక్కాని చేప అనే పేరు ఏర్పడి ఉండవచ్చును. వాస్తవానికి ఇది సొరచేపతోనే ఉంటుంది. స్వతంత్రంగా బయలు దేరిందంటే, దాని కనుచూపుమేరలో ఏదో ఎఱ ఉన్నదన్నమాటే. ఇది అంతిమక్షణంవరకూ తనయజమానీ, రాజూఅయిన సొరచేపతోనే ఉండేది. అయితే ఇది రిమోరావలె ఆ మహాకాయానికి అతుకుకొని ఉండలేదుకాబట్టి, తన యజమాని స్వర్గంచేరి క్రిందికి దిగి రానిసమయంలో, ఉన్మత్తమైపోయేది. మతిభ్రష్టత కలిగినట్లు యజమానికోసం అన్వేషించుతూ, మొట్టమొదట యజమాని గతించిన నౌకాపార్శ్వాన్ని చేరి, ఇటూ అటూ ఎగిరిపడుతూ ఉండేది. చివఱకు సొరచేపదర్శనం గగనకుసుమ మనిపించితే, మఱొకస్వామిని ఆశ్రయించటం కోసం బయలుదేరేది. కాని కొన్నిటికి తప్ప ఇంకేస్వామికూడా అందుబాటులో కన్పించేదికాదు.

మేము పడవక్రిందకు దిగి, సముద్రంలో తలలు ముంచి, నిర్మల సముద్రజలంలోపల నుంచి చూస్తే, నావ ఒక జలభూతం ఉదరం లాగా కనిపించేది. చుక్కాని తెడ్డే ఆ భూతం పుచ్ఛభాగం. నావ మధ్యభాగానికి అటూ ఇటూ ఉన్న చెక్కలు ఆ రక్కసి మొఱటు ఱెక్కలు. ఆ ఱెక్కలమధ్య ఎన్నో

చుక్కాని చేపలు పయనిస్తూ ఉండేవి. అవి జలమగ్నమైన మానవ శిరస్సును గమనించేవే కావు. ఒకటి రెండు చూచినా, తొందరగా ప్రక్కకు తిరిగి, ముక్కుపైనుంచి, తిన్నగా చూచి, అంతలోనే వెనుకకు తిరిగి తమ బృందంలో కలిసిపోయేవి.

మా చుక్కాని చేపలు రెండు దళాలుగా ఉండేవి. ఒక దళం సరిగా నావమధ్య ఇరువైపులా ఉన్న చెక్కల క్రిందనుంచి ప్రయాణం చేస్తూ ఉంటే, ఇంకొక దళం ఒక చక్కని విసనకఱ్ఱ రూపంలో నౌకాముఖభాగాన పయనించేవి. మేము పార వేసిన వస్తువులు కనబడినప్పుడల్లా, రివ్వున వాటికోసం పరుగెత్తి, అనవసరశ్రమ పడేవి. మా భోజనానంతరం ఒకసారి భోజన పాత్రలన్నీ కడుగుతూ, ఒక చుక్కాని చేపను కూడా, అదీ ఒక పరికరమే అనే భ్రాంతిలో కడగటం జరిగింది. అవి పరీక్ష చేయని పిసరు ఒకటీలేదు. ఆ ముక్క తినేవస్తువు కాదని రూఢి అయిన తర్వాత అవి క్రిందకి వెళ్ళిపోయేవి. ఈ విచిత్ర మత్స్యబృందం పసిపిల్లల్లాగా మా నౌకను ఆశ్రయించి వస్తూ ఉంటే, సొరచేప మాదిరిగా మేమూ వాటిని పుత్రవాత్సల్యంతో చూచే వాళ్ళం. కోన్-టికీకి అవి సాగరోద్భూతమైన ప్రియ జనం. చుక్కానిచేపను సస్నేహంగా స్పృశించటం కోన్-టికీ యాత్రికులకు సహజ ధర్మమైనది.

మా పరివారంలోని చుక్కాని చేపల్లో పసిపిల్లలు ఒక్క అంగుళం మాత్రమైనా పొడుగులేవు. కాని చాలా వఱకు ఆఱంగుళాలు పొడుగైనవే ఉన్నాయి. ఎరిక్కు ఈటె తాకి, సొర తిమింగిలం పాఱిపోయేటప్పుడు, దానిని ఆశ్రయించుకొని ఉండే కొన్ని చుక్కాని చేపలు, ఆ యుద్ధంలో విజేత

అయిన ఎరికుక్కవద్దకే తప్పి వచ్చాయి. అవి రెండడుగుల పొడుగు ఉన్నాయి. ఇలా అనేక సుస్థిర విజయాలవల్ల కోన్-టికీకి నలభై యాభై చుక్కాని చేపలు లభించాయి వాటిలో చాలామటుకు మా పురోగమనాన్ని హర్షించాయి. మేము సముద్రంలోకి విసరివేసే ముక్కలను ఆసించాయి. అందువల్ల మాతోకూడా సముద్రంమీద వేలకొలది మైళ్లు పయనించాయి.

కాని, కొన్నికొన్ని సందర్భాలలో కొన్ని కృతఘ్నతనే ప్రదర్శించాయి. ఒకరోజున నేను చుక్కాని తెడ్డుదగ్గర ఉండగా దక్షిణదిక్కున సముద్రజలం నురుగుతున్నట్లు కనిపించింది. అంతలోనే ఒక బేడిసమూక రజతమత్స్యాల్లాగా తళతళలాడుతూ వచ్చి సహజమైన మందగమనాన్ని విసర్జించి, నీళ్లలోకంటె ఆకాశంలోనే ఎక్కువ ప్రయాణంచేస్తూ, అతివేగంగా వస్తుంటే, ఆ సరభస జలచరానీకం గందరగోళంవల్ల దెబ్బతిన్న నీలతరంగం నురుగులు గక్కి తెల్లబోయింది. వాటి వెనుక నీలపృష్ఠమైన ఒక మహాకాయం సత్వరనౌకవలె వస్తున్నది. భయార్తాలయి దిక్కు మొక్కు కనబడని బేడిసలు కొన్ని జలమగ్నాలౌతూ, కొన్ని పైనతేలుతూ, నావ కుడి ప్రక్కకు వచ్చి ఇక్కడ మునిగిపోయాయి. దాదాపు వంద బేడిసలు ప్రాఙ్ముఖంగా నీళ్ళలో పడిపోతూఉంటే, సముద్రం విచిత్రవర్ణాలతో దర్శనీయమైంది. వాటిని వెంటాడే మహాజలచరం ఒక్కసారి తలఎత్తి, మళ్ళీ నీళ్ళలో మునిగి నావ అడుగున ప్రవేశించి వాటిని అనుసరించింది. అది ఒక నీలిసొరచేప. దానిపొడుగు సుమారు 20 అడుగులు. అది అదృశ్యం అయ్యే సరికి, మా చుక్కాని చేపలుకూడా చాలావరకు అదృశ్య

మైనాయి. దండయాత్రలు సాగించదగ్గ ధైర్యస్థైర్యాలుకల ఒక సముద్రవీరుడు వాటికి కనిపించాడుగదా.

అనుభవ సంపన్నులైన పెద్దలు మఱొక భయంకర జలచరాన్నిగుఱించి వివరంగా చెబుతూ, దాని బాఱిపడకుండా జాగ్రత్తగా మెలగవలసిందని మాకు హెచ్చఱికలు చేశారు. ఆ జలచరంపేరు అక్టోపస్. అది నావమీదకు కూడా ఎక్కతుంది. వాషింగ్టన్‌లోని జాతీయ భూగోళశాస్త్రజ్ఞులు పటంలో, ఛాయాచిత్రాల్లో స్థలనిర్దేశం చేసీ, దానిరూపలక్షణాలు బోధపఱిచీ, మాకు తగినసలహాలు ఇచ్చారు. అతి భయంకరాలయిన అక్టోపస్‌లు హంబోల్టు ప్రవాహంనుంచి రాత్రిపూట సముద్రసంచారం ప్రారంభిస్తాయి. వాటిల్లోఒకటి ఎఱకోసంవచ్చి చిక్కుకొంటే మిగిలినవివచ్చి దానిని తినివేస్తాయట! అంతలోనే అది తన నెచ్చెలికదా అన్నమాటే మఱచిపోతాయన్నమాట! వాటి ముంజేతుల్లో ఒకపెద్ద సొరచేపను దెబ్బకు చంపగలవు. పెద్ద తిమింగిలాల్నికూడా వీపు చీలుకగొట్టగలవు. అక్టోపస్‌కు గద్దముక్కువంటి ఆకారంకల ఒక ప్రచ్ఛన్న నాసికకూడా ఉన్నది. ఆ చేపలు నీళ్ళమీద తేలుతూవుండి, నావలో ప్రవేశించాలని బుద్ధి పుట్టకపోతే, నావలో ఏమూల ఏమిఉన్నదీ స్పృశించి, గ్రహించగల సుదీర్ఘహస్తాలుకూడా కలిగినవనీ, వాటికన్నులు భాస్వరగోళాలులాగా ప్రకాశిస్తూ ఉంటాయనీ ఆ శాస్త్రజ్ఞులు చెప్పారు. గాఢనిద్రలో ఉండగా, మా మెడల చుట్టూ ఏవోనల్లటి చేతులు మెలికలుతిరిగి, ఉచ్చువేసినట్లు బిగించి ఈడ్చుకుపోవటం మాకుమాత్రం ఇష్టమా ? అందువల్ల, మా అందఱిదగ్గఱా నిద్రపోయేముందు ఒక పదునైన కత్తి

ఉంచుకోనేవాళ్ళం. అటువంటి అపాయమే తటస్థిస్తే ఆకత్తితో ఆ క్షణంలో ఆత్మరక్షణం చేసుకోవచ్చునుగదా! పెరూనుంచి మేము బయలుదేరుతూ ఉండగా అక్కడి నిపుణ నావికులు మళ్ళీ ఈ అక్టోపస్ విషయమే చెప్పి, సముద్రంలో ఆ అపాయం సంభవించగలచోటు ఇది అని ఛార్టులో చూపించారు. వారు ఆ మాటలు చెబుతూఉంటే, అక్టోపస్‌లను తలచుకొన్న మాకు కలిగిన అసహ్యం ఇంతా అంతా కాదు. ఆ అపాయభరితస్థలం హంబోల్టు ప్రవాహంలోనే ఉన్నది.

చాలాకాలం వఱకు సముద్రంలోకానీ, నావపార్శ్వాలకానీ "స్క్విడ్" అని ప్రసిద్ధికెక్కిన ఈ జాతి చిన్నచేప మాకు కనబడనేలేదు. కాని ఒకనాటిఉదయం ఈ నీళ్ళల్లో స్క్విడ్లు ఉండిఉంటాయనిపించింది. సూర్యోదయంకాగానే నౌకా పార్శ్వాన మాకు ఒక అక్టోపస్ శిశువు కనిపించింది. దాని ఆకారం చంటిబిడ్డలాగా ఉన్నది. అది పిల్లి అంతపరిమాణంలో ఉన్నది. రాత్రిపూట అది అసహాయంగా నౌకమీదకు చేరింది. వేణుమందిరద్వారం దగ్గఱ ఒక వెదురుగడను చేతులతో చుట్టిగట్టిగా పట్టుకొని ఉన్నదికానీ, మేము చూచేసరికి దాని శరీరంలో ప్రాణాలు లేవు. వెదురుతడకమీద నల్లని సిరావంటి పదార్థం పడిఉన్నది. అక్టోపస్ శిశువు వ్రేలాడుతున్నచోట క్రింద ఆ నల్లని సిరావంటిదానితో ఒక మడుగు ఏర్పడి ఉన్నది. నౌకాపరిస్థితులు వ్రాసికొనే పుస్తకంలో ఒకటో రెండో పుటలు ఆ చేప సిరాతోనే వ్రాశాము. తర్వాత ఆమృత శిశువును బేడిసలకు ఆహారంగా విసరివేశాము.

ఈ చిన్న సంఘటనను గుఱించి ఆలోచిస్తే, రాత్రుల్లో

సంభవించబోయే ఘోరాపాయం మేము పసిగట్టాము. ఈ శిశు మత్స్యం పైకే రాగలితే తన వంశాచారాన్ని అనుసరించి తప్పకుండా మాకు హాని చెయ్యగలిగేదే. మా పూర్వులు వికింగ్ ఓడలమీద సముద్రయానం చేసే కాలంలో, వృద్ధ సముద్రుణ్ణి గురించి, ఆలోచించే వారికి ఇటువంటి అనుభవం కలిగి ఉంటుంది. కాని, తర్వాత కలిగిన సంఘటనతో మాకు మతిపోయింది. ఒకనాటి పొద్దుటిపూట మా మందిరానికి కప్పుగా ఉన్న కొబ్బరి ఆకుల పైభాగాన స్క్విడ్ ఒకటి కన్పించింది. మేము చాలా ఆశ్చర్యపడ్డాము. సిరాగుర్తులు కేవలం కప్పు మధ్యభాగంలోనే వలయాకారంగా ఉండటంవల్ల అది చిట్టచివరివరకూ ఎక్కి ఉండటానికి అవకాశంలేదు. పోనీ ఏ సముద్ర పక్షి అయినా దాని పట్టి తెస్తూ, అక్కడ జారి విడిచిందా అంటే, దాని శరీరం మీద పక్షిముక్కు తాకిన గుర్తులే లేవు. అందువల్ల అది ఏ కెరటంచేతనో ఎగిరివచ్చి అక్కడపడి ఉంటుందని నిశ్చయించుకొన్నాము. అయితే ఆ రాత్రి కావలాలో పెద్ద కెరటం రావటం చూచినవారు ఒక్కరూలేరు! ఒక్కొక్క రాత్రి గడచినకొద్దీ, క్రమంగా ఈశిశుమత్స్యాలువచ్చి పడుతూ ఉండటం ఎక్కువైంది. వాటిలో బాగా చిన్నది మన నడిమి వ్రేలంత పొడుగు ఉన్నది.

త్వరలోనే, రాత్రిపూట సముద్రం ప్రశాంతంగా ఉన్నప్పటికీ, తెల్లవారేసరికి, ఆెక్కలచేపల మధ్య ఒకటో రెండో చిన్న స్క్విడ్లుకూడా పడి ఉండటం మామూలైంది. ఈ స్క్విడ్లు అన్నీ వృత్తాకారమైన సంతానంతోనిండిన ఎనిమిది చిన్నచేతులతో, చివరి కొక్కెంవంటి అవయవం కల రెండు సుదీర్ఘ

హస్తాలతో మహాభయంకరంగా కన్పించే ఆ మత్స్యజాతి లోవే. కాని పెద్ద స్క్విడ్లు నావమీదకు వచ్చే జాడమాత్రం కనిపించలేదు. చీకటిరాత్రుల్లో భాస్వరంలాగా ప్రకాశిస్తూ, నీటిమీద తేలుతున్న కండ్లు కన్పించేవి. ఒకే ఒక్కసారిమాత్రం నీరు సలసలక్రాగి పొంగుతూఉంటే, ఒక పెద్దచక్రం వంటిది పైకి వచ్చి, ఆకాశంలో ఎగిరింది. దానిని చూడగానే మా బేడిసలు కొన్ని భయపడి అక్కడక్కడ నక్కాయి. అయితే, 'పిల్లలు నిర్విరామంగా వచ్చిపడుతుంటే, పెద్దవి రాకపోవటానికి కారణం ఏమిటి?' అనేది మాకు తీరనిసందేహం అయింది. రెండు నెలలవరకూ ఈ సందేహం మాకు తీరనేలేదు. ఇలా ఎంతో అనుభవం సంపాదించుకొని, రెండు నెలలు గడిచేసరికి, మేము అన్టోవన్ ప్రాంతం దాటిపోయాము.

చిన్నస్క్విడ్లు నావపైకి రావటం సాగించాయి. ఒక ప్రొద్దుటిపూట ఎండ బాగా కాస్తున్నది. నీళ్ళలోనుంచి ఎగిరిపోయి, పెద్దవాన చినుకులులాగా, గాలిలో వీస్తూ ఉన్న ఒక జ్యోతిః పుంజం కనిపించింది. అప్పటికే వేట సాగించిన బేడిసల చేత నీరు మరిగిపోతున్నది. మొట్టమొదట అది ఒక రెక్కల చేపల గుంపు అనుకొన్నాము. ఎందుచేతనూ అంటే, ఆవిధంగా కనిపించే మూడురకాల చేపలు మా దగ్గర ఉన్నాయి. ఐతే అవి మమ్మల్ని సమీపించగానే, వాటిలో కొన్ని నావకు నాలుగైదడుగుల యెత్తున ప్రయాణం ప్రారంభించాయి. ఒకటి బెంగ్టు రొమ్ములో దూకి ఒక్కచఱుపుతో క్రిందపడిపోయింది. అది ఒక చిన్నస్క్విడ్. మా విస్మయానికి అంతులేదు. మేము దానిని పట్టుకొని, ఒకచిన్న చేదలో పెట్టాము. అయితే, అది

ఆ చిన్న చేదలో ఈదటానికి ప్రయత్నించింది కానీ, మామూలుగా సముద్రంలో ఈ దేటప్పుడు కల వేగంలో సగం వేగంతో నైనా ఈదలేకపోయింది. స్క్విడ్ ఈత, తారాజువ్వలాగా దూసుకుపోయే విమానం గమనంలాగా ఉంటుందని, అందరికీ తెలుసు. అది తన శరీరపార్శ్వాన కల మూసిన గొట్టంవంటి అవయవంతో, అతివేగంగా నీటిని చిమ్ముతూ, అందువల్ల శరీరం వెనుకభాగాన్ని ముందుకు జరుపుతూ, చాలా తొందరగా ఈదుతుంది. దాని తలప్రక్కలనుంచి వెనుకకు వ్రేలాడుతూఉన్న చేతులవంటి అవయవాలతో, అది ఈదుకొనిపోయేటప్పుడు, చేపలాగా ఒక ప్రవాహరేఖ అవుతుంది. దాని రెండు పార్శ్వాల లోనూ గుండ్రని మాంసపుతిత్తులు ఉంటాయి. ఇవి సులువుగా అనుకొన్న వైపు తిరిగిపోవటానికీ, బాగా ఈదటానికీ ఉపయోగపడతాయి. అయితే, ఈ స్క్విడ్లు తమను చంపితినే ఇతర మత్స్యాలనుంచి తప్పించుకోటానికి ఎక్కువ సామర్థ్యం లేనివి కాబట్టి, శత్రువులు వెంటబడగానే రెక్కలచేపలలాగా రివ్వున ఎగిరిపోతాయి. మానవులు ఆకాశయానంగురించి ఆలోచించటానికి ముందే, ఈ స్క్విడ్లు విమానంలాగా ఆకాశంలో సంచరించటానికి అనువైన పద్ధతి కనిపెట్టాయి. మంచివేగం అలవడే వరకూ అవి నీటిని చిమ్ముతూ పోతాయి. ఆటు తరువాత చర్మంవలె ఉన్నటువంటి రెక్కలను విప్పి, నీటిమట్టానికి ఒక కోణంలో ఉంచి, కోరిన దిక్కుకు మరలిపోతాయి. రెక్కల చేపలలాగానే ఇవికూడా కెరటాలమీదుగా సంపూర్ణ వేగంతో ఎగిరిపోతాయి. ఆటు తరువాత అవి రెండో మూడో కలసి కానీ, ఒంటరిగా కానీ సముద్రంమీద తేలిపోవటం చూచాము.

స్క్వీడ్ చేప నిదానంగా ప్రయాణం చెయ్యగలదనే వాస్తవ విషయం మేము కలుసుకొన్న చాలామంది జంతుశాస్త్రజ్ఞులకు అత్యాశ్చర్యం కలిగించింది.

పసిఫిక్ ద్వీపాలలోని ప్రాచీనజాతుల ఇండ్లలో భోజనం చేసినప్పుడు నేను స్క్వీడ్‌ను రుచిచూచాను. అది ఇండియన్ రబ్బరూ ఎండ్రకాయలూ కలగలుపు చేసినట్టున్నది. కాని, చిట్టచివఱకు కోన్-టికీమీద స్క్వీడ్లు భోజ్యవస్తువులు సంపాదించే సాధనాలైనాయి. అవి నావ పార్శ్వాన కనిపించినప్పుడల్లా, వాటిని ఈ విధంగానే వినియోగిస్తూ వచ్చాము. స్క్వీడ్‌ను ఎఱగా గాలానికి కట్టి, సముద్రంలో విడిస్తే, మళ్ళీ లాగినప్పుడు దానివెనుకనే ఒక పెద్దచేప వచ్చేది. టన్నీ, బనిటో అనే చేపలకుకూడా స్క్వీడ్ ప్రియమైనఆహారం. దానికోసం పరుగెత్తుకు వచ్చిన అవి మాకు ఆహారం అయేవి.

అయితే సముద్రంవంక చూస్తూ మన్ను మల్ని మేము మఱచిపోలేదు. అవసర విషయాలను గుర్తుగా వ్రాసికొనే వాళ్ళం. మా దినచర్య పుస్తకంలో ఇటువంటి స్మృతి సూచక సంఘటనలు చాలా ఉన్నాయి.

11/5. నావఅంచున మేము రాత్రిపూట భోజనం చెయ్యబోతున్నాము. ఆ సమయంలో ఒక భీకరజలజంతువు రెండుసార్లు నీటిమట్టానికి వచ్చింది. అది నీటిని చెల్లాచెదురుచేసి అదృశ్యం అయింది. అది ఏజంతువో మాకు తోచలేదు.

6/6. హెర్మన్‌కి సన్ననితోక, సన్ననిమూతి, వెడల్పైన తెల్లనిశరీరము, నల్లనితల కల ఒకచేప కనిపించింది. అది చాలాసార్లు సముద్రంలోపలినుంచి నావమీదకు దుమికింది.

16/6 ఒకచేప నౌకాముఖభాగంవైపు వింతగా చూస్తున్నది. అది ఆఱడుగులపొడుగూ, గరిష్ఠపువెడల్పు ఒకఅడుగూ, పొడుగ్గానూ, గోధుమవర్ణంగానూ ఉన్న సన్ననిముట్టె, తల సమీపంలో పెద్దదైన వెన్నుపూసఱెక్కా, వీపుమధ్యలో మరొకచిన్న ఱెక్కా, బరువైకొడవలివంపు తిరిగిన తోకకలిగి, సముద్రోపరిభాగాన్నే ఉండి, అప్పుడప్పుడు పాముచేపలాగా మెలికలు తిరుగుతూ ఈదుతున్నది. నేనూ హెర్మన్ ఒక చేయీటె తీసుకొని, రబ్బరుడింగీలో ఎక్కి వెళ్లేసరికి మునిగిపోయింది. తరువాత మళ్లీ వచ్చి, మళ్లీ మునిగిపోయింది.

తరువాతరోజు : మధ్యాహ్నం సరిగా 12 గంటలవేళ తెఱచాప స్తంభంచివఱ కూర్చున్న ఎరిక్కుకు, నిన్నటిరోజున కన్పించినజాతివే ముప్ఫయ్యో, నలభయ్యో సన్నని గోధుమ వర్ణం చేపలు కనిపించాయి. అవి ముఖద్వారంవైపునుంచి అతి వేగంగా వచ్చి, విశాలమైన సమతలంమీద చిత్రితమైన గోధుమవర్ణంలాగా కన్పిస్తూ. అంతకంతకు సముద్రగర్భంలోపలికి పోయాయి.

18/6 నట్టుకి పామువంటి సన్ననిప్రాణి ఒకటి కనిపించింది అది రెండుమూడడుగులు పొడుగున్నది. అది నీటిలో క్రిందామీదా పడుతూనే నిట్టనిలువున లేచింది. పాములాగానే మెలికలు తిరుగుతూ మునిగిపోయింది.

అనేకసమయాల్లో నీటిమట్టానికి దిగువ ఒక నల్లని వస్తు సముదాయంలాంటిది కనిపించింది. అది జలమగ్నమైన పర్వత శిఖరంలాగా నిశ్చలంగా ఉండేది. దాని పరిమాణం ఒకగది వైశాల్యానికి సరిపోయేది. అది ఒక దుష్టభూతంఛాయ అను

కొన్నాము. కాని అది ఎన్నడూ కదలలేదు. దానిరూపం స్పష్టంగా చూడటానికి నేము ఎప్పుడూ దానిదగ్గఱకు పోలేదు.

అటువంటి సాహచర్యంతో సముద్రంలో ఎన్నడూ కాలం నెమ్మదిగా గడవలేదు. నేము నీళ్ళలోమునిగి నౌక అడుగుత్రాళ్ళను పరిశీలించేటప్పుడు పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉండేది. ఒకరోజున నావ నడిపలకల్లో ఒకటి జారి త్రాళ్ళలో చిక్కుపడిపోయింది. దానిని నేము పట్టుకోవటం సాధ్యపడలేదు. హెర్మన్ నట్టులు నీళ్ళలో మునగటంలో మంచి మొనగాళ్లు. హెర్మన్ రెండుసార్లు, మునిగివెళ్లి, బేడిస చుక్కాని చేవలమధ్య ఉండి, చెక్కని లాగి కట్టుతున్నాడు. అతను రెండో సారి వెళ్లి, అప్పుడే తిరిగివచ్చి, నావ అంచుమీద కూర్చున్నాడు. అంతలోనే ఎనిమిదడుగులో, పదిఅడుగులో పొడుగైన సొరచేప ఒకటి, అతని కాలిత్రేళ్ళవైపు కదలిరావటం కనిపించింది. మేము పొఱపాటు పడేఉండవచ్చు. దాని దుస్స్వభావం పరిచితమై ఉండటంవల్ల, దాన్ని అనుమానించి, ఒక ఈటెతో దానితలలో పొడిచాము. దానికి దుఃఖం కలిగింది. కొంతసేపు గందరగోళంగా పోరుసాగింది. చివఱకుఅది అదృశ్యమైంది. నీటిమీద ఒకవిధమైన నూనె తేలింది. నావ నడిపలక చేతికి చిక్కినా కట్టటం కుదరనేలేదు.

అప్పుడు ఎరిక్కు నీటిలో మునగటానికి వీలైన ఒక గంపవంటిది తయారు చెయ్యాలనుకున్నాడు. గంప తయారు చెయ్యుదగ్గ ముడిసరుకు విశేషంగాలేదు. కాని వెదురుకఱ్ఱలూ, త్రాళ్లూ, కొబ్బరికాయలు పెట్టిన ఒక పెళ్ళుబుట్టా ఉన్నాయి. ఈ వెదుళ్ళతో ఆ బుట్టను వెడల్పుచేసి త్రాళ్ళతో బాగా

అల్లి వేశాము. అందులో మేము కూర్చుని నీళ్ళలో నావ అంచునే పోయాము. కాళ్ళు ముడుచుకొని గంపలో పెట్టు కొన్నాము. త్రాళ్ళ అల్లికవల్ల చేపలనుంచి మాకు బాధ కలుగకుండానూ, మమ్మల్ని చూచి చేపలు బెదఱకుండానూ ప్రకృతిశాస్త్ర సిద్ధానుసారంగా జాగ్రత్తపడ్డాము. వలకను నావకు బిగించేటప్పుడు ఏదైనా అపాయం సంభవించేటట్లుంటే, మేము బుట్టలో ఒదిగిఉంటే, నావఅంచున ఉన్నవాళ్ళు ఆ బుట్టకు కట్టినత్రాడు పట్టుకొని సత్వరంగా మమ్మల్ని నావఅంచుకు చేరుస్తారు.

ఈ బుట్టవల్ల నీటిలో మునిగివెళ్ళే సదుపాయం మాత్రమే కాదు. నావఅంచున ఉన్నవాళ్ళకు మంచి వినోద హేతువుకూడా అయింది. మాకు దిగువనీళ్ళల్లో తేలిపోయే వాటిని పరిశీలించటానికి మంచి అవకాశంకూడా కలిగింది. సముద్రం బాగా ప్రశాంతంగా ఉన్నప్పుడు మేము ఒకరి తర్వాత ఒకరు బుట్టలోపలికి చేరుకొని, నీటిలోమునిగి, వాయుస్తంభనం చెయ్యగలిగి నంతవఱకు అందులోనే ఉండి, తర్వాత బయటికివస్తూ ఉండేవాళ్ళము. నీటిలో నీడ ఏ కోశానా లేని ఒక కాంతిప్రవాహం ఉన్నది. చిత్రమేమిటంటే అప్పుడప్పుడు దానిరూపం మాఱిపోయేది. మేము నీళ్ళలో మునిగి కన్నులు తెఱచిచూస్తుంటే, త్వరలోనే జలోపరి ప్రపం చంలో మాదిరిగానే అక్కడి కాంతికీ ఒక ప్రత్యేకపద్ధతి ఉన్నట్లు కనిపించింది. పైనుండి వస్తున్న కాంతి మాదిరిగానే అడుగున నుండి వస్తున్న కాంతికికూడా వక్రీకరణం ఉన్నది. మేము తల ఎత్తి నావ అడుగుభాగంవైపు చూస్తే, అక్కడ చక్కగా

కాంతి ప్రసరిస్తూఉండటంవల్ల, తొమ్మిది పెద్దదూలాలూ, వాటి చుట్టూ కట్టిన త్రాళ్లూ సర్వం ఒక కాంతిప్రవాహంలో స్నానంచేస్తున్నట్లు కనిపించేవి; నావకు అన్నివైపులా పెరిగిఉన్న నాచుమొక్కలూ కనిపించేవి; పెద్దబేడిసలు ఆహారంకోసం గిరగిరతిరుగుతూ ఇటూ అటూ ఉరుకుతూఉంటే, చుక్కాని చేపలు మత్స్యశరీరాల్లో ఒదిగిన కంచరగాడిదలవలె శ్రేణీ బద్ధాలై ఈదుతూఉండేవి. పాచిపట్టిన ఎఱ్ఱని నడిపలకమీద కాంతి పొడుగునా ప్రసరిస్తూఉంటే, దానిమీద వలసలేర్పఱచుకొన్న పసుపుపచ్చని నత్తగుల్లలూ, వాటిలోనుంచి ప్రాణవాయువుకోసమూ, ఆహారంకోసమూ దిక్కులుచూస్తూ ఉన్న నత్తలూ కనిపించేవి. ఇతరు లెవరైనా వస్తున్నారని గమనించగానే అవి గుల్లలలో దూఱి, అపాయం తప్పిందని విశ్వాసం కలిగేనఱకూ బయటికి తొంగిచూచేవి కావు. జలోపరిభాగంలో ప్రసరించే తీక్ష్ణమైన సూర్యకాంతికి అలవాటుపడ్డ మాకు ఇక్కడి యీ కాంతి వింతగానూ, ఉపశమనకరంగానూ గోచరించింది. అగాధమైన సాగరగర్భంవైపు చూచినప్పుడుకూడా, అక్కడ చిమ్మచీకటి కాపురంచేస్తూ ఉన్నప్పటికీ, వెనుకకు మఱలే సూర్యకిరణాలవల్ల ఆ కటికచీకటివన్నె లేతనీలిమగా కనిపించేది. మఱొక చిత్రమేమిటంటే మేము జలోపరిభాగాన్నుంచి చూస్తూ ఉన్నప్పటికీ, అతిదూరాన ఉన్న ఆ మృదునీలిమలో సంచరించే మత్స్యాలు అన్నీ అత్యంత స్పష్టంగా కనబడేవి. అవి బనిటోలు కావచ్చును. అవే కాక అగాధ సముద్రగర్భాన సంచరించే ఇతరజాతి మత్స్యాలూ కావచ్చును. కాని అవి చాలాదూరాన ఉండటంచేత, ఏయే జాతుల

చేపలో మాకు గుర్తు తెలియలేదు. ఒక్కొక్కప్పుడు అవి అనంతబృందాలుగా కనిపించేవి. అప్పుడు మాకు "సముద్ర ప్రవాహం యావత్తూ మత్స్యమయమేమో! లేకపోతే ఆ అగాధసంచారి ప్రాణులుకూడా కొన్నాళ్ళపాటు మనతో కలసి ఉండాలనే ఉద్దేశంతోనే కోన్-టికి వద్ద సమావేశమైనా యేమో!" అనిపించేది.

వీటి అన్నిటికంటెకూడా సువర్ణచ్ఛాయాలైన టన్నీ చేపలు దగ్గఱకు వచ్చేటప్పుడు నీటిలో ఒక మునక వెయ్యటం మాకు చాలా ఉల్లాసకరంగా ఉండేది. ఒక్కొక్కప్పుడు అవి గుంపులు గుంపులై నావను సమీపించేవి. సాధారణంగా నైతే రెండో మూడో మాత్రం వచ్చి మా చుట్టూ తిరగటంలోనే చాలా రోజులు గడిపేవి. ఇక మేమువాటిని వంచించి గాలానికి గ్రుచ్చితే అవేం చేస్తాయి! నావమీదనుంచి చూచినప్పుడు అవి అసాధారణ సౌందర్యం ఏమీలేక, గోదుమవర్ణంతో కొంచెం పెద్దవిగానే కనిపించేవి. నీటిలో మునిగి చూచేసరికి వాటరంగూ రూపముకూడా మాఱిపోయేవి. ఆ మార్పు మమ్మల్ని పూర్తిగా మతిభ్రష్టుల్ని చేసేది. మేము వెంటనే బయటికివచ్చి "ఇంతకు ముందు చూచినచేప అదేనా-కాదా?" అనే మీమాంసలో పడే వాళ్ళం. ఏది ఏమైనప్పటికీ, పెద్దచేపలు మా ఉనికినే గుర్తించేవి కావు. అవి యథాప్రకారంగా ఉదాత్తగమనంతోనే సాగి పోయేవి. కాని యిప్పుడు అవి అపూర్వమైన అద్భుతసౌందర్యం ప్రదర్శించటం మొదలుపెట్టాయి. అ సౌందర్యం మఱి ఏ మత్స్య జాతిలోనూ కనిపించదు. తేలిపోయిన ఊదారంగుకప్పిన లోహ పదార్థంలాగా వాటిశరీరం విచిత్రచ్ఛాయతో కనిపిస్తున్నది.

వెండిలాగానో ఉక్కులాగానో ప్రకాశిస్తూ పరిపూర్ణమైన అవయవ సౌష్ఠవంతో మహాబలిష్ఠాలైన తిమింగిలాలు 150 మొదలు 180 పౌనులవఱకూ బరువున్న ఆ తెక్క కొంచెం కదలించినంతమాత్రంలో అవలీలగా నీటిలో తేలిపోతూ ఉంటాయి.

సాగరంతో మాకు పరిచయం దినదినాభివృద్ధి అవుతూ ఉన్నకొద్దీ, సముద్రానికి ప్రధాన కేంద్రం అనదగినచోటకూడా, మాకు ఏమీ క్రొత్త అనిపించేదికాదు. అక్కడ అలల ఆర్భాటంకూడా అంతరించి పోయింది. ఇక మాకు స్వగృహంలో ఉన్నట్లే తోచింది. శాంతమహాసముద్రంతో గాఢానుబంధం కల పురాతన ప్రజలను గౌరవించటం మేము నేర్చుకొన్నాము. ఒకవిధంగాచూస్తే మా సహజాభిప్రాయాలకు అది పూర్తిగా భిన్నంగానే ఉంది. ఇప్పుడు మనం సముద్రంలో ఎంత ఉప్పు ఉన్నదీ అంచనా వేసి ఉండవచ్చును. టన్నీలకూ, డాల్ఫిన్(బేడిస)లకూ లాటిన్ పేర్లు పెట్టవచ్చును. అంతపని వారు చెయ్యలేదు. కాని, సముద్రాన్నిగూర్చి ప్రాచీనులు ఊహించి అనుభవించి తెలిసికొన్నది మనం తెలిసికొన్నదానికంటె ఎంతో యథార్థం.

ఇక్కడ సముద్రంమీద సుస్థిరమైన గుర్తులేమీ లేవు. కెఱటాలు, చేపలు, సూర్యుడు, నక్షత్రాలు వస్తూపోతూ ఉంటాయి. పెరూనుంచి పసిఫిక్ దీవులను వేఱుచేసే ఎటువంటి భూభాగమైనా, ఈ నాలుగు వేల మూడువందలమైళ్ళ లోపల ఉన్నదని ఊహించినవారు లేరు. మేము నూటుడిగ్రీలు పశ్చిమంగా వచ్చేసరికి, ఛార్టులోచూస్తే, మేము వెళ్లే దారిలో ఎదురుగానే సముద్రమధ్యాన ఒకపర్వతం ఉన్నట్టు గుర్తు కనిపించింది. ఆ

గుర్తు వృత్తాకారంలో ఉన్నది. ఆ ఛార్టు ఆ సంవత్సరమే ప్రచారంలోకి వచ్చింది. అప్పుడు మేము "పరిశీలనకోసం దక్షిణ అమెరికాకు వెళ్ళే నావికులకు మార్గదర్శకం" అనే పుస్తకంలో చూచాము. అందులో ఇలా ఉన్నది : "6°42' దక్షిణ అక్షాంశరేఖ 99°43' పశ్చిమరేఖాంశాలలో గాలపగో ద్వీపాలకు వాయవ్యదిక్కున 600 మైళ్ళదూరంలో సముద్రగతమైన ఒకకొండ ఉన్నదనీ. దాని శిఖరంనుంచి అలలు విరిగిపడుతూ ఉంటాయనీ, 1906 వసంవత్సరంలోనూ 1926 వసంవత్సరంలోనూ వదంతులు పుట్టాయి 1927వసంవత్సరంలో ఈస్థానానికి ఒకమైలు పడమరగా ఒకస్టీమరు ప్రయాణంచేసింది. కాని, అక్కడ ఒకకొండ ఉండటంకానీ, దానిమీద అలలు వచ్చిపడుతూఉండటంకానీ గోచరించలేదు. 1934 వసంవత్సరంలో ఇదేస్థానానికి ఒకమైలు దక్షిణంగా మరొకస్టీమరు ప్రయాణం చేసింది. అప్పుడున్నూ పైవార్తలకు సాక్ష్యం కనబడలేదు. 1935 వసంవత్సరంలో 'కారీ'అనే మోటారుబోటుకి ఇక్కడనే 160 నిలువుల లోతుదాకా పరిశీలించినా భూమి తగలలేదు."

ఛార్టుల్ని బట్టి ఆలోచిస్తే, ఈ నిర్దిష్టప్రాంతాన సముద్రతరణం సందేహాస్పదమే. అదీకాక మా నావలాటిదికాక బరువైన జలయానమేదైనా అటువంటిచోట చిక్కుపడటం తప్పదు. మాకైతే అంతగా ప్రమాదం ఉండదు. తిన్నగా ఆ గుర్తువైపే ప్రయాణంచేస్తే ఏదైనా విశేషం తెలియవచ్చుననుకొన్నాము. ఛార్టులో పెట్టినగుర్తు పొరపాటున అసలుచోటుకు కొంచెం ఉత్తరాన పడటం గమనించాము. కనుక చుక్కానిని నావ కుడిపార్శ్వానికిత్రిప్పి, నౌకాముఖభాగం తిన్నగా ఆ గుర్తుకు అభి

ముఖం అయేటట్లు, మా నలుచదరపు తెఱచాపను సవరించి, ముందుకుసాగాము. నావ కుడివైపునుంచి అలలూ గాలీ సాగాయి. శాంతమహాసముద్రం వెనుకటికంటె కొంచెం తత్వం మార్చుకొన్నదేమో! మా పక్కల్ని తడిపివెయ్యటం మొదలుపెట్టింది అదే సమయంలో వాతావరణం ప్రశాంతం ఔతూవచ్చింది. అయితే ఆ గాలి అలా ఉన్నంతసేపూ, కోన్-టికి ప్రయాణం సుకరంగానే సాగుతుందని గ్రహించటం చేత, మాకు ఉత్సాహంగా ఉన్నది. గాలి ఆ విధంగా లేక పోతే, మొదట్లో నావను అదుపులో పెట్టుకోటానికి పడ్డ శ్రమ అంతా మళ్ళీ అనుభవించవలసి వచ్చేది. రెండుపగళ్ళూ, రెండు రాత్రులూ నావని ఉత్తర వాయువ్యాలమధ్యగా నడుపుతూ వచ్చాము. తూర్పు ఆగ్నేయాలమధ్యలో వ్యాపారపవనం ఊగిసలాడుతూ ఉండటంవల్ల, అలలు గణనాతీతమైపోయాయి. అవి అన్నీ మాకు ఎదురుగావచ్చి పడుతూఉంటే, వాటితో పాటు పొంగటం క్రుంగటం మాకు తప్పనిసరి అయినాయి. తెఱచాపకొయ్యను కనిపెట్టుతూనే ఉన్నాము. మేము అలల మీద పైకి లేస్తూఉంటే, దిఙ్మండలం సువిశాలమైనట్లు ఉన్నది. అలలు వేణుమందిరం పైకప్పుకంటె ఆఱడుగులఎత్తు లేస్తు న్నాయి. అటువంటి అలలు రెండు జతపడ్డాయంటే, ఆకాశం అంతా నీటితో కప్పినట్లు కనబడుతున్నది. ఆ నీరు బహు ముఖాల చిందిపడవచ్చును. రాత్రికాగానే మందిరద్వారాన్ని సుదృఢంగా బంధించివేశాము. అయినప్పటికీ మందిరంయావత్తూ తడిసేఉన్నది. సుఖంగా విశ్రమించటానికి రవంతైనా పొడిచోటు లేదు. వెదురుతడక ఫెళఫెళమన్నది. అంతలోనే తడకసందుల

నుంచి చిమ్మనగొట్టంలోనుంచి చిమ్మినట్లు నీటిజల్లులు పడ్డాయి. నురుగు దేలిన జలప్రవాహం మమ్మల్నీ, మా సర్వసామగ్రినీ స్నానం చేయించింది. ఇక ఆరాత్రి మాకు నిద్ర ఎక్కడిది?

మేము ఆదరాబాదరా లేచి నీళ్లు నావ అడుగునుంచి జారిపోవటంకోసం ప్రతీక్షిస్తుంటే, ఒక నిద్రామత్తుడు మావాడు "సీసపు పనివాణ్ణి పిలవండోయ్" అంటున్నాడు. సీసపు పనివాడైతే రాలేదుగానీ, జలరాశిమాత్రం వచ్చింది. మమ్మల్ని నిలువునా ముంచిపోయింది. హెర్మన్ కావలాలో అనుకోకుండా ఒక పెద్దబేడిస నావ పార్శ్వంమీదకే వచ్చింది.

మఱునటిదినం వ్యాపారపవనం కేవలం తూర్పునుంచి వీచటం మొదలుపెట్టింది. దానితో సముద్ర విజృంభణం కొంత తగ్గింది. తెఱచాప కొయ్యమీద ఒకరితరువాత ఒకరం చేరు కొంటూ, ఎవరికీ విశేషశ్రమ కలుగకుండా చూచుకొంటు న్నాము. ఆ సాయంకాలంలోపలనే మా గమ్యస్థానం చేరుకోవటం జరుగవచ్చు ననుకొంటున్నాము. సముద్రం ఆరోజున మామూలురోజులలోకంటె విశేష ప్రోత్సాహకరంగా కనిపించింది. దీనికి కారణం మా అప్రమత్తతే కావచ్చును.

మధ్యాహ్నసమయాన నావదగ్గఱకు ఒక కొమ్ముచేప వచ్చింది. నీటిపైన నిలువుగా ఉన్న దాని రెండు ఱెక్కలకుమధ్య ఆఱడుగులదూరం ఉన్నది. ఆ రెక్కలు కొనతేలి పదునుగా ఉన్నవి. ఇక ఆకత్తి దాని శరీరమంత పొడుగూ ఉన్నది. అది చుక్కానిదగ్గఱ నున్నమనిషివైపు గిఱుక్కునతిరిగి అంతలోనే నీటిలో మునిగి అదృశ్యం అయింది. ఇక ఆ మధ్యాహ్నం భోజనాలు చేస్తున్నాము. ఏమిభోజనాలు! సమస్తమూ ఉప్పునీటితో

మునిగితేలినవే! ఇంతలో ఒక కెరటంవచ్చింది. ఆ హోరుకు మేము అటువైపు చూచాము. కెరటంపైన ఒక తాబేలు కనిపించింది. అది చాలాపెద్దది. దాని తలా, కాళ్లూ బొరుసు లోపలినుంచి బయటబడి కంపిస్తున్నాయి. ఆ కూర్మం సరిగా మాకు ముక్కుకు సూటిగా, అదే ఎత్తునఉన్న అలమీద వున్నది. ఈలోపల ఆ అలనుంచే, మఱిరెండు పదార్థాలు పైకి రావటంచేత, ఈ తాబేలుకు చోటులేక, క్రిందికి జాఱిపోయింది. ఈసారి ఆ తాబేటికి అడుగున తెలుపు బంగారు వన్నెలతో ప్రకాశిస్తూ దొర్లిపడుతున్న రెండు బేడిసల ఉదరభాగాలు కనిపించాయి. అప్పుడప్పుడు సముద్రపుకాకులు విడివిడిగా వస్తూ ఉండటంకూడా గమనించాము. పెద్ద మాలకాకులుమాత్రం తప్పకుండావచ్చేవి. అవి తిన్నగా నావమీదనే అడుగుపెట్టేవి. ముండ్లవంటి తోకలూ అవీనూ. పెద్ద మాలకాకులు కనిపిస్తే అక్కడకు సమీపంలో భూభాగం ఉన్నదన్నమాటే!

"బహుశః ఈ సమీపంలో సముద్ర గతపర్వతం కానీ, ఇసుకదిబ్బగానీ ఉంటుంది" అని కొందఱు అనుకొన్నారు. ఒక ఆశావాది ఇలా అన్నాడు: "మనకు ఇక్కడ ఒకచిన్న సస్యశ్యామలధాత్రి కనిపించవచ్చును. ఇక్కడ కొంతమంది మనుష్యులు ఉంటున్నారని యింతవఱకు కనిపెట్టినవాడెవడూ ఉండడు! అప్పుడు మనం ఒక క్రొత్తద్వీపాన్ని కనిపెట్టిన వాళ్ళం ఔతాము. ఆ ద్వీపంపేరు కోన్-టికి!"

మధ్యాహ్నంనుంచి ఎరిక్కు మాటిమాటికీ మహానస గృహంమీద ఎక్కి, ముందుత్రోవ పరిశీలించటం మొదలు పెట్టాడు. సాయంకాలం 6 గం. 20 నిమిషాలకి నావ 60°42'

దక్షిణ అక్షాంశమూ 99°42' రేఖాంశమూ కలిసేచోట ఉన్నదని చెప్పాడు. ఛార్టులో గుర్తించినచోటికి తూర్పున సముద్రపు పరిగణనప్రకారం ఒక మైలుదూరానఉన్నాము. వెదురుదడి వంగిపోయింది. తెఱచాప నావపార్శ్వాన్ని ఊడుస్తున్నట్లున్నది. గాలి యింకా తూర్పుదిశనుంచే వీస్తున్నది. మమ్మల్ని నెమ్మదిగా మా లక్ష్యస్థానానికి చేర్చవచ్చును. సూర్యుడు సముద్రగర్భం ప్రవేశించగానే, చంద్రుడు నేత్రపర్వంగా ప్రకాశించటం మొదలుపెట్టాడు. దిఙ్మండల వర్ణానుగుణంగా, నలుపు, తెలుపు రంగుల్లో పొంగిపొరలుతున్న సముద్రోపరిభాగం, ఆ చంద్రికలో క్రొత్తఅందాలు చిందుతున్నది. తెఱచాప కొయ్య మీదనుంచి చూస్తే, సర్వం సుస్పష్టంగాకనబడుతున్నది. సుదీర్ఘ శ్రేణుల్లో పొంగివస్తున్న కెఱటాల్ని పరికించాము. సముద్రగతమైన పర్వతం ఉన్నజాడ ఎక్కడా కనబడలేదు. పోనీ ఎక్కడైనా చిన్నమెట్ట ఉన్నదా అంటే అదీలేదు. అందఱం దానికోసమే చూపులు నిగుడ్చుతున్నాము. ఇంతలో ఇద్దఱు ముగ్గురిలో అపూర్వచలనం కనిపించింది. ఛార్టులో గుర్తించబడిన వలయం మధ్యకు వచ్చింది లగాయితూ అంతులేని సందడి. మా దగ్గఱ ఉన్న సీసపుగోళాలు అన్నీ 54 వ నెంబరు సిల్కు దారం కొనకు మూటగట్టి నీటిలో విడిచిపెట్టాము. దారం 500 నిలువులకు పైగా ఉన్నది. దారపు మొదటికొనదగ్గఱనుంచి కొంతభాగం అటూ ఇటూ చిక్కుపడ్డా, 400 నిలువులలోతు దాకా సీసపుగుళ్ళు పోగలవు. మేము ఉన్నచోటికి తూర్పునగానీ, పడమటగానీ కేవలం మా ఉనికి క్రిందుగాగానీ నేల తగలనేలేదు. ఒకసారి సముద్రోపరిభాగం పరికించాము ఇక్కడి

సముద్రం చక్కగానే పరిశీలించామనీ, నౌకాదుల ప్రయాణాన్ని అడ్డగించే కొండలుగానీ, గుట్టలుగానీ ఇక్కడ లేనే లేవనీ, ప్రపంచానికి తెలియజేయవచ్చునని నిర్ధారణ చేసుకొన్నాము. గాలీ, కెరటాలూ నావ కుడిభాగానికి ఉండేటట్లు తెరచాపనూ చుక్కానినీ చక్కజేసుకొని, నావ సులభంగా ప్రయాణించగలదని నిశ్చయించుకొని, వెనుకకు తిరిగాము. కెరటాలు వచ్చినా నావ క్రిందిభాగాన ఉన్న దుంగల సందులనుంచి క్రిందికి పోతూఉన్నాయి. వ్యాపారపవనం తూర్పునుంచి ఆగ్నేయాభిముఖంగా వీస్తూఉండటంవల్ల, కెరటాలు వస్తూనే ఉన్నప్పటికీ, మమ్మల్ని స్నానం చేయించటంలేదు. మా పదార్థాలను తడిపి వెయ్యటమూలేదు. కాబట్టి మేము హాయిగా నిద్రపోవచ్చు. ఉప్పునీటితో తడిసిన ఆహారం తినవక్కఱలేదు.

ఈ కృత్రిమపర్వతం కనిపెట్టటంకోసం చేసిన చిన్న యాత్రలో, నావఅడుగు భాగాన వెన్నుతట్టుగా ఉపయోగపడే దూలాల ప్రాశస్త్యం మాకు బాగా బోధపడ్డది. అటు తరువాత ఒకప్పుడు హెర్మనూ, నట్టూ నీటిలో మునిగిపోయి, నడిదూలాలలో అయిదవదూలం సరిదిద్దినప్పుడు, ఇంకా ఎక్కువ సంగతులు తెలిసికొన్నాము. ఇండియన్లు ఈ విస్మృతవిద్యను పూర్తిగా విసర్జించినతరువాత, వీటితత్త్వం ఇప్పుడు మాకు బోధపడ్డట్లు మఱి ఎవరికీ బోధపడిఉండదు. ఆ నడిబల్ల కేవలం వెన్నుతట్టుగా ఉండి, నావ సుకరంగా ప్రయాణించటానికి ముఖ్య కారణంగా ఉన్నది. ఇండియన్లు బల్సా నావలకు ఒకవిధమైన నడిపలకను ఏర్పాటు చేసికొనేవారనీ, ఆ నడిపలకలు కలవ

సందులనుంచి క్రిందికి జారేవనీ ప్రాచీనులైన స్పెయినువారు వ్రాసినవ్రాతలు మాకుగానీ, ఆ విషయంమీదనే తర్జనభర్జనలు జరిపిన మరి యెవరికిగానీ అర్థంకాలేదు. ఈ నడిపలక ఒక చిన్నసందులో ఇరికి ఉండటంచేత ఎటూ తిరిగిపోక, కేవలం చుక్కానిలాగా పనిచేస్తుంది.

ఆ రహస్యం మాకు ఎలా తెలిసిందంటే, గాలి నిబ్బరంగా వీస్తూ, సముద్రం కల్లోలితం కాకుండా ఉన్నప్పటినుంచీ, రెండురోజులపాటు మేము చుక్కానిమీద చెయ్యి వెయ్యవలసిన అవసరం లేకపోయింది. మేము సరిచేసిన నడిపలకను కదలకుండా ఉండటానికి ఒకసందున ఇరికించాము. అప్పటినుంచీ, పశ్చిమముఖంగా వెళ్ళే నావ వాయవ్యముఖమై, అప్రతిహతంగా ముందుకు సాగిపోజొచ్చింది. ఈ నడిపలకను లాగివేస్తే, వెనకటిమోస్తరుగా పశ్చిమాభిముఖమైంది. మళ్ళీ ఆ సందులోనే సగంవరకు దానిని ఇరికిస్తే, నావ అభిముఖ్యం కూడా కొంతవరకు వాయవ్యానికి మళ్ళింది. ఈ విధంగా ఈ నడిపలకను ముందుకూ, వెనుకకూ జరపటంవల్ల, నౌకను మేము కోరినవైపు మళ్ళించగలిగాము. చుక్కానితో అవసరమే లేకపోయింది. ఇదే 'ఇంకా' ప్రజలు చేసిన చమత్కారం. తెరచాపమీది వాయుపీడనంతో నౌకాస్తంభం సుస్థిరంగా ఉండటానికి తగుపిధంగా, నావ ఎటూ ఒరిగిపోకుండా చెయ్యటంకోసం, ఇటువంటి సులువుసూత్రం కనిపెట్టారు. ఈ నావలో నౌకాస్తంభానికి ముందుభాగం ఒక చెయ్యివంటిదనుకొంటే, వెనుకభాగం ఇంకొక చెయ్యివంటిదౌతుంది. నడిపలక వెనుకభాగం బరువైతే నావముందుభాగం గాలి ఊగించినట్లల్లా

ఊగేది; నడిపలకముందు భాగమే బరువైతే, నావ వెనుక భాగం గాలితోపాటు తిరిగేది. నావముందు, వెనుకభాగాలతో వాయుశక్తికి కల సంబంధాన్ని బట్టి, నౌకాస్తంభానికి అత్యంత సన్నిహితంగా ఉండే నడిపలకలో కలిగే మార్పు ఏమీలేదు. వాయువు వెనుకనుంచే వీస్తున్నట్లైతే, నడిపలకల ప్రయోజనం కనిపించేదికాదు. అప్పుడు నిరంతరం చుక్కాని సేవచెయ్యక పోతే, నావను నిలబెట్టటం అశక్యంఅయేది. అలా ఎంతో శ్రమ పడితేనే, కొంచెంకొంచెంగా నావ పురోగమించేది. వేణుమందిర కవాటమూ, మేము భోజనాలుచేసే ప్రదేశమూ నావ కుడిభాగాన ఉన్నాయి వచ్చే అలలన్నీ ఎడమవైపునుంచే వస్తున్నాయి.

చుక్కానిదగ్గరనే ఉండి, దానిని త్రిప్పుతూ అవస్థపడటం కంటె, నావ నడిపలకను ముందువెనుకలకు జరుపుతూనే, కావలసిన వైపు నావనుత్రిప్పుతూ ఉండవచ్చును. ఈ విధంగానే మా ప్రయాణం సాగించగలిగే వాళ్ళము. అయితే నావ నడిపలకలను ఒక సాధారణపద్ధతిలోనే అమర్చుకొని, చుక్కాని తెడ్లు వెయ్యటమే మాకు ఎంతోకాలంనుంచీ అలవాటైంది. అలవాటు మార్చుకోటం ఎవరికైనా కష్టమే కదా?

మా సముద్రయానంలో ఇటు తరువాత మహాఘట్టం, ఆ కృత్రిమపర్వతంలాగానే కంటికి కనిపించేదికాదు. మేము సముద్రయానం ప్రారంభించినతర్వాత అది నలభై అయినోరోజు. 78° వ రేఖాంశంనుంచి 108° వ రేఖాంశందాకా వచ్చాము. ముందున్న ద్వీపాలకు ఇక సగందూరంలో ఉన్నాము. తూర్పున దక్షిణ అమెరికా మాకు 2000 మైళ్ళదూరంలో

ఉన్నది. పడమట పాలినేషియా కూడా అంతేదూరం. ఆ సమయంలో మాకు దగ్గరిభూభాగాలు గాలపగా దీవులు. ఇవి కేవలం తూర్పుగాగానీ, ఈశాన్యంగాగానీ, లేక ఆ రెంటికీ నడిదిక్కుగా ఉన్నాయి. లేకపోతే తూర్పుద్వీపాలున్నాయి. ఇవి మాకు కేవలం దక్షిణదిశగా ఉన్నాయి. ఎటువెళ్ళాలన్నా ఈ పారావారంమీద అయిదువందలమైళ్లకు పైగా ప్రయాణం చెయ్యాలి. పసిఫిక్ మహాసముద్రంమీద సాధారణంగా నౌకలు ప్రయాణంచేసే మార్గాలన్నింటికీ చాలా ఎడంగా పోతూ ఉన్నందువల్ల, మాకు ఎక్కడా ఎన్నడూ ఒక్క ఓడకూడా కనబడలేదు.

భూభాగానికి ఇంత అతిదూరంగా ఉన్నామనే చింత మాకు కలుగలేదు. ఎందువల్లనంటే, మేము ముందుకు వెళ్ళుతూఉంటే, మాతోబాటు అజ్ఞాతంగా నభోమండలం క్రిందికి జారిపోతున్నది. మా నావా, సముద్రమూ, సముద్రోపరిదృశ్యమూ, ఈ ప్రపంచం యావత్తూ ఒకేవిధంగా ఉంటున్నది.

కోన్-టికీ కేంద్రంగాకల ఒక మహావృత్తం ధనుర్వక్రమైన గగనరేఖతో కలిసి తిరుగుతున్నట్లున్నది. అందువల్లనే యేమో గతరాత్రి కాన్పించిన నక్షత్రాలే తిరిగి మా మీదుగా దొర్లిపోతున్నాయి.

## శాంతమహాసముద్రంమీద ii

సాగరం కల్లోలసంకులం కాని సమయాలలో అప్పుడప్పుడు మేము చిన్న రబ్బరుడింగీలో ఎక్కి, నావకు దూరంగా పోయి ఛాయాచిత్రాలు తీసేవాళ్ళం. సముద్రం సుప్రసన్నంగా

కనిపించిన మొట్టమొదటి ఘట్టం నేను మఱవలేను. డింగీలో ఇద్దఱు మనుషులుకూర్చుని పోతూఉంటే, తోలుతిత్తివంటి సాధనంతో నీటిమీద తేలిపోతున్నట్టు ఉన్నది. వారు ఎంతో దూరం పోనేలేదు. అంతలోనే కెళ్లు ఒకమూలపెట్టి, విఱగబడి నవ్వటం మొదలుపెట్టారు. అలవచ్చి ఎత్తివేస్తుంటే, మళ్ళీమళ్ళీ వచ్చే కెఱటాలమధ్య కనబడీకనబడకుండా పోతున్నారు. ఒక క్షణం కనిపిస్తే మఱుసటిక్షణంలో అదృశ్యులవుతున్నారు. ఇంకోక్షణంలో మళ్ళీ ప్రత్యక్షమౌతున్నారు. మేము కనిపిస్తే చాలు, పొట్టచెక్కలయ్యేటట్లు నవ్వుతున్నారు. ఆ నవ్వులతో సర్వసాగరం ప్రతిధ్వనిస్తున్నది. మేము అయోమయంగా ఒకరిమొగాలొకరు చూచుకొన్నాము. "డింగీలోని వారిద్దరూ మావైపుచూచి అలా విఱగబడి నవ్వటానికి కారణం ఏమిటి? మా ముఖాల్లో ఏం కనబడుతున్నదీ; బాగా పెరిగిన గడ్డాలుతప్పితే? అయితే ఈ గడ్డాలు వారికి ఇప్పుడే కనబడ్డాయా? రోజూ చూస్తున్నవేగా! తప్పకుండా వారికి మతిభ్రమణం కలిగి ఉంటుంది;" అనుకొన్నాము. "లేదా వెచ్చని సూర్యకిరణాలు తగిలేసరికి ఉల్లాసంతో పరవశులౌతున్నారేమో!" అనీ అనుకొన్నాము. అలా నవ్వినవ్వి, మఱి నవ్వలేక, కళ్ళల్లో నీరు తిరుగుతుండగా, వచ్చి, నావమీదకు చేరారు. "ఎందుకంత నవ్వుతున్నా"రని మేము అడగటానికి ముందే, "అలా డింగీలో వెళ్లి చూచిరండి!" అని మమ్మల్ని బలవంతపెట్టారు.

మా నలుగురిలోనూ ఇద్దఱం వెంటనే డింగీలో ఎక్కి వెళ్ళాము. ఒక పెద్దకెఱటం వచ్చి మమ్మల్ని లేవనెత్తింది. తత్క్షణం మేముకూడా, కూలబడి, నవ్వటం మొదలుపెట్టాము.

నవ్వీనవ్వీ, సాధ్యమైనంతవఱకు స్తిమితపడి, మళ్ళీ నావ చేరు కొన్నాము మిగిలిన యిద్దఱుమాత్రం నిశ్చలంగానే ఉన్నారు. వారికి మేము నలుగురమూ పిచ్చివాళ్ళులాగా కనిపించాము. మఱి వారు మా మాదిరిగా అటువెళ్ళి రాలేదుగదా!

దూరాన్నుంచిచూస్తే, మేమూ, మా నౌకారత్నమూ ఎలా కనిపించవచ్చునో; మేము ఊహించలేదు; చూడలేదు. అలా చూచింది అప్పుడే. అందువల్లనే వచ్చింది అంత నవ్వూనూ. నావ దూలాలు చిన్న అలల్లో మునిగిపోయాయి - విశాలమైన ద్వారంతో, వామనావతారంలాగా ఉన్న వేణుమందిరం, ఆ అలల్లో ఊగిసలాడుతున్నది. పైకప్పు అంతా లేచిపోయింది. నౌకనుచూస్తే ప్రాచీనపు నార్వే దేశస్థుల పూరిల్లు జ్ఞాపకానికి వచ్చింది. సముద్రంలో కొట్టుకొని వస్తున్న పూరింటికప్పులాగా ఉన్నది నావ. అదిన్నీ పెరిగినగడ్డాలతో ఎండదెబ్బకు వాడినముఖాలతో మీదకు చేరిన క్రూరజనంతో నిండి, శిథిలితమైన అటకలాగా ఉన్నది. మా వెనక ఏదైనా పడవగనుక వచ్చినట్లయితే, డింగీలో ఉన్నప్పుడు నవ్వీ నవ్వీ అలసినట్టే, నావమీద ఉన్నప్పుడున్నూ ఆపరాని నవ్వుతో అవస్థపడేవాళ్ళమే. ఎంత సామాన్యమైన అలకూడా వేణుమందిర కుడ్యాన్ని సగంవఱకూ ఆవరిస్తున్నది. నిర్నిరోధమైన ద్వారాన్నుంచి లోపలదూరి, అక్కడ పరుండి ఆవులిస్తున్న గడ్డాలవారిని ముంచివేసేట్టు కనబడుతున్నది. కాని అంతలోనే నావ పైకిరావటంవల్ల, ఈ చింపిరిజుట్టు ద్రిమ్మరులు సురక్షితులై, యథాస్థానాల్లోనే ఉంటున్నారు. మఱీ పెద్దకెఱటం వచ్చినప్పుడు, వేణుమందిరమూ, తెఱచాపా, నౌకాస్తంభమూ

సమస్తమూ ఆ జలపర్వతం మాటున పడిపోతున్నవి. కాని, ఉత్తరక్షణంలోనే ఎప్పటిమాదిరిగా వేణుమందిరమూ, అందులో పరున్న బ్రిమ్మరులూ ప్రత్యక్షమౌతున్నారు.

మాకు అదంతా అసహ్యంగా కనిపించింది. మానావ విశిష్టతవల్లనే సర్వం సవ్యంగా జరిగిపోతున్నదని గ్రహించలేక పోయాము.

మళ్లొకసారి వెనుకటిలాగానే వినోదించాలనీ డింగీ మీద బయటికి వెళ్ళాము. ఆ పర్యాయం చావుతప్పి, కన్ను లొట్టపోయినంతపని అయింది. వాయువేగమూ, తరంగతీవ్రతా మా ఊహాలకు మించిపోయాయి. కోన్-టికీ గమనవేగమూ అతిశయించింది. అది మేము గమనించలేదు. పరిస్థితులు బోధ పడ్డ తర్వాత డింగీలోనుంచి దూకి, సముద్రంలో పడీ, ఈది తేనే, ప్రాణాలు దక్కేటట్లు కనబడింది నావ మాకోసం ఆగేట్టు లేదు. వెనుకకు తిరిగి, మానద్దకు రావటానికి అంతకన్న వీలు లేదు. దానిమీదఉన్న మా బాలకులు తెఱచాపను దించి వేశారు. అయినా ప్రయోజనం లేకపోయింది. వాయు పీడనం వేణుమందిరంమీద కేంద్రీకృతమైంది. అందువల్ల నావ అదేపనిగా కొట్టుకుపోతున్నది. ఇక్కడ ఈ చిన్నడింగీలో కూర్చుని, చిన్నచిన్న తెడ్లతో ఎంతతొందరగా పోవటానికి యత్నించినా, నావను అందుకోలేకపోయాము. డింగీ నీటిమీద దొర్లి పడేట్టు ఉన్నది. అలానే జరిగితే చేసేదేమిటి? ఆ సమ యంలో మా అందరిమెదడుల్లోనూ ఒకే ఆశయం మెదులు తున్నది. ఏది ఏమైనా మేము చెల్లాచెదరు కాగూడదు. నిజంగా ఆ సమయంలో నిమిషం యుగంగా కనబడ్డది. ఎల్లా

వెళ్ళామో! ఎల్లా నావమీదికి చేరుకొన్నామో! ఆ ఘట్టం తలచుకొంటే ఇప్పటికీ ఒళ్లు జలదరిస్తుంది.

ఆ రోజు మొదలుకొని, విశృంఖలంగా డింగీమీద బయలుదేరరాదని తీర్మానించుకొన్నాము. ఒకవేళ బయటికి వెళ్ళవలసివస్తే, ఒక పెద్దమోకుతో డింగీని నావకు కట్టిఉంచాలనీ, ఏదైనా అపాయం సంభవిస్తే, నావమీద ఉన్నవాళ్లు ఆ మోకు మూలాన డింగీని నావదగ్గఱకు లాగవచ్చుననీ అనుకొన్నాము. అందువల్ల వాయుగతి సుకుమారంగానూ, శాంత మహాసముద్రం అతిసాలా సార్థకంగానూ కనిపిస్తే తప్ప, మేము ఎన్నడూ బయటికి వెళ్ళలేదు. అయితే, ఈ నియమాలన్నీ విధించుకొనేటప్పటికి పాలినేషియాకు సగందూరంలో ఉన్నాము. ఇక్కడనుంచీ శాంతమహాసముద్రం సర్వత్ర భూగోళాన్ని పరివేష్టించి, విలువంపుగా వంగిఉంటుంది. అందుచేత మేము కోన్-టికీ నుంచి బయలుదేరి, వినీలరోదోంతరాళంలో సుదూరం పయనించి, సురక్షితంగా తిరిగి రాగలిగేవాళ్ళము. దూరం వెళ్ళినకొద్దీ, నావ చిన్నదై పోతున్నట్టు కనిపించి, తెఱచాపకూడా కనుమరుగైనప్పుడు ఒంటరితనం స్ఫురించేది. వ్యాకించిన నీలసాగరం, దానిని ఆవరించిఉన్న అసిత నభోంతరాళం ఏకీభవించిన చోటికి నీలిమ యావత్తూ ప్రవహించిపోయి, గూడు గట్టుకొన్నట్లుండేది. ఒక్కొక్కప్పుడు లోకం మమ్మల్ని వెలివేసిందేమో ననిపించేది. ఎందువల్లనంటే, ఎటుచూచినా ఎవరూ లేరు. అంతటా కజ్జల నైల్యంమాత్రమే దృగ్గోచరమౌతుంది. ఒక్క చండభాస్కరుడు లేనట్లైతే, దానికి ఆద్యంతాలంటూ వినిపించవు. భానుకిరణాలు వెచ్చవెచ్చగా, పసిడికాంతుల్తో

మా కంఠాల్ని పెనవేసికొనేవి. అప్పుడు సర్వ దిఙ్మండలలో దూరాన కనబడే తెలిచాపకొన ఒక్కటీ, అయస్కాంతం లాగా మమ్మల్ని ఆకర్షించేది. అప్పుడు వెనుకకు తిరిగి, సత్వరంగా ప్రయాణించి, నానమీదకు చేరి "మళ్ళీ మా ప్రపంచంలో మాయింటికి వచ్చాము; అమ్మయ్య!" అనుకొనే వాళ్ళము. వేణుమందిరంలో తల దాచుకొని పూర్వవాసనతో ఆనందపరవశులమయే వాళ్లము. వేణుమందిర వివృతద్వారం నుంచి కనబడే ఎండలో నిర్మలంగా కనిపించే నీలసాగరం చూస్తుంటే, మనస్సులో అనంతమైన ఉల్లాసం కలిగేది. మళ్ళీ సముద్రం మీద విహరిద్దామనే కుతూహలం కలిగేవరకూ, ఈ వాతావరణానికి అలవాటుపడి ఉండేవాళ్లము.

డోలాందోళితమవుతూఉండే వేణుమందిరం పరిస్థితి మా మనస్సులమీద ఎల్లా పనిచేసిందీ తప్పక చెప్పాలి. దాని పొడుగు 14 అడుగులు; వెడల్పు 8 అడుగులు. అలల తాకిడికీ, గాలి విసురుకీ చెక్కుచెదరకుండా ఉండటంకోసం, మేము నిలబడితే తలఎత్తటానికి వీలులేనంత మట్టే తక్కువ ఎత్తుగా కట్టాము. ఆ మందిరం గోడలూ, పైకప్పూ కూడా వాసాలే. వాటిపైన గట్టి వెదురుతడకలు అమర్చాము. మందిరం లోపల కనిపించే పచ్చివాసాలూ, పండువాసాలూ కూడా మాకు నేత్రపర్వం చేసేవి. ఆ గోడలే తెల్లగా ఉంటే అటువంటి ఆనందం కలగదు. మందిరం పొడవులో సుమారు మూడో వంతు పొడుగుండే ద్వారంనుంచి సూర్యకాంతి చక్కగా ప్రసరించేది. పెద్దపెద్దదూలాలతో ఎత్తుగా కట్టి, సందులేకుండా గోడలుపెట్టి, లోపలా, బయటా వెల్లవేసిన మందిరంకంటె ఈ

పరిస్థితుల్లో ఇదే సురక్షితస్థానం అనే విశ్వాసం కలిగింది. ఇలా తోచటానికి హేతువేమిటని, ఆలోచించిఆలోచించి, చివరకు ఒకసమాధానం చెప్పుకొన్నాము. గాలి గట్టిగా వీచిందంటే, వెదురుతడకలు నిలుస్తాయా? తాటాకులు ఆగుతాయా? సుదీర్ఘమైన ఈసముద్రయాత్రలో ఇటువంటిమందిరంలోఉండటానికి ఎవరు ధైర్యం చెయ్యగలరు? నిజం చెప్పవలసివస్తే, అప్పటిదాకా ఆ మందిరంలో మేము సురక్షితంగా ఉండగలమనే ధైర్యం మాకు లేదు. సముద్రశక్తిని తట్టుకోగలశక్తి దీనికెక్కడిది? కల్లోల ఘూర్ణితమవుతూఉన్న మహాసముద్రానికీ, దాని మీద తేలిపోతూఉన్న ఈ చిన్నగుడిసెకూ, సహజమైన ఐక్యం లేదు. కాబట్టి ఆ కెరటాల్లో ఈ చిన్నగుడిసెకు స్థానంలేదు. దీనిలో వాటికీ స్థానంలేదు. మేము నావమీద ఉన్నంతసేపూ ఆ కుటీరమూ, దాని వాసనా, పరమసత్యంగానూ, దొర్లిపడుతున్న కెరటాలు మిథ్యగానూతోచేవి. దూరాన రబ్బరుడింగీలో నుంచి చూస్తే, ఆ దొర్లిపాట్లను కెరటాలూ కుటీరమూ వినిమయం చేసుకుంటున్నాయి. కెరటం వచ్చిపడితే, బాల్సా దుంగలు ఆ నీటిని జారవిడుస్తూ, తారాజువ్వల్లాగా, సముద్రాన్ని దూసుకుపోతూఉన్న ప్రత్యక్షదృశ్యాన్నిబట్టి, నౌకా మధ్యాన ఎప్పటికప్పుడు పొడిగా కనబడే వేణుమందిరంమీద మాకు అచంచలవిశ్వాసం ఏర్పడ్డది. ప్రయాణం సుదీర్ఘంగా కనబడుతున్నకొద్దీ, మా చిన్నగుడిసె మాత్రమే మాకు సురక్షితప్రదేశమని భావిస్తూవచ్చాము. మా యెదురుగా దొరలి పడుతున్న మహాసముద్రాన్ని చూస్తుంటే, ఏదో సినీమా చూస్తున్నట్లు ఉన్నదేకానీ, భయం కలగటంలేదు. శతచ్ఛిద్ర

పైన మా కుటీర కుడ్యం ఎత్తు అయిదడుగులే. నీటిమట్టానికి ఒకటిన్నర అడుగుల ఎత్తున మాత్రమే ఉన్నది అయితే నేమి? బయట ఉండీ ఉండీ, అందులో ప్రవేశించగానే వేల కొద్దీమైళ్లు ప్రయాణం చేసిచేసి, సాగరప్రమాదాలకు గురి కాని ఒక నికుంజం ప్రవేశించినట్లు తోచేది. అప్పుడు మాగడ్డి పరుపులమీద వెల్లకిల పరుండి, గాలికి కదులుతున్న కొమ్మ ల్లాగా ఊగుతున్న హరితవేణుదండాల్ని విలోకిస్తూ, సరసవన పరిమళాన్ని ఆఘ్రాణిస్తూ ఆనందించేవాళ్ళము.

ఒకొ్కక్కప్పుడు దూరాన్నుంచి మా నావను చూడా లనే ఆ కుతూహలంవల్ల, రాత్రులందుకూడా, బయటికి వెళ్ళే వాళ్ళం. ఎగిరిపడుతున్న బొగ్గునలుపు నీటిపైన ఆవరించిఉన్న ప్లాంక్టన్ల మూలాన, ఆకాశాన ఆడుతూ, వెలుగుతూ, ఉన్నట్లున్న నక్షత్రాలు నీటిలో ప్రతిఫలించటం అరుదుగా ఉండేది. ఆ చీకట్లో మాకు ఆ నక్షత్రాలే ప్రపంచం. అది క్రీ.వె. 1947వ సంవత్సరమో, క్రీ. పూ. 1947వ సంవత్సరమో మాకు పట్టేదికాదు. మేము ఆ విధంగా జీవించాము. అంత ఉత్సా హంగా కాలం గడిపాము. యంత్రయుగానికి పూర్వంకూడా, మానవజీవితం సర్వసంపన్నంగానే ఉండేదని గ్రహించాము. నవీన మానవజీవితంకంటె, ప్రాచీన మానవజీవితం ఎన్నోరెట్లు భోగభాగ్యాలతో, ఆనందోత్సాహాలతో తులదూగేది. కాలమూ, కాలంతోవచ్చిన పరిణామమూ కూడా, కదలిపో తున్నవి. నాటిసత్యం నేటికీ సత్యమే. నాటి పంచభూతాలే నేటి పంచభూతాలు కూడా! ఎప్పటికీ ఇవి ఇంతే. కాని నక్షత్రరాశి క్రింద చెక్కుచెదరని అనంతాంధకారంలాగా, అప్రతిహతంగా,

సాగిపోయే కాలప్రవాహంలో, మనము మాత్రము మునిగి పోతాము. ఆ రాత్రివేళలో, కోన్-టికి అలలమీదలేచి మళ్ళీ క్రుంగిపోతున్నది. దానికీ, మాకూ మధ్యలో విసీలజలం తెగ వర్షిస్తున్నది. వెన్నెలలో, నావదగ్గఱ ఒక విచిత్రవాతావరణం ఏర్పడ్డది. నాచుమొక్కలతో చలిస్తున్న పెద్దదుంగలూ, వికింగ్ తెఱచాపచుట్టూ నలుచదరమైన నీలరేఖా, కప్పు పైకిలేచిన వేణుమందిరమూ, దానికివెనుక వెలుగుతున్న కొవ్వువత్తి దీపమూ, ఈ సమస్తమూ ఏదో యక్షగంధర్వ కథల్లోనో, మాంత్రికగాథల్లోనో కనిపించే దృశ్యంలాగా ఉన్నదికానీ, యథార్థదృశ్యంలాగా కనిపించలేదు. మాటిమాటికీ నావ సంపూర్ణంగా అదృశ్యమౌతున్నది. అప్పటికప్పుడే జలధారలు జాఱిపోతుండగా, పరిపూర్ణరూపంతో ప్రత్యక్షమౌతున్నది.

అంత మహాసముద్రంలోనూ ఒంటరిగా కనిపించిన నౌకా, కనిపిస్తున్న వాతావరణమూ చూస్తుంటే, విసనకఱ్ఱ రూపంలోఉండే ప్రాచీన నౌకలు జ్ఞాపకం వచ్చాయి. ఈ మహాసముద్రంమీద యానం ప్రారంభించిన మొట్టమొదటి మానవజాతివారు అటువంటివాటిని ఉపయోగించారు. నూతన దేశాల్ని అన్వేషించాలనే ఆశయంతో ఆ విధంగా వారు అతి దూరం ప్రయాణించేవారు. పెరూ, ఈక్వెడార్లు రెంటినీపాలించిన తూపక్ యుపాంక్వీ అనే ఇంకారాజు, స్పానియార్డులకు పూర్వమే, బాల్సా నావలమీద, వేలకొద్దీసేనతో, పసిఫిక్ మహాసముద్రాన ఎక్కడో ఉన్నట్లు వదంతిగా ఉన్న ద్వీపాల్ని అన్వేషించటానికి బయలుదేరాడు. అతనికి రెండుద్వీపాలు కనిపించాయి. అవి గాలపగా ద్వీపాలే; అని కొందఱి అభి

ప్రాయం. ఎనిమిది నెలలు ఈవిధంగా సముద్రంమీద తిరిగితిరిగి, యుపాంక్వీ ప్రభువు తిరిగి, ఈక్వెడార్ చేరుకొన్నాడు. అనేక శతాబ్దాల క్రిందట, అటువంటి నౌకల్లోనే, కోన్-టికీ దళం పాలినేషియా ద్వీపాలను చేరుకొన్నది. అటు తరువాత మళ్ళీ వారికి వెనుకకు రావలసిన అగత్యమేమున్నది?

మేము తిరిగి నావమీదకు చేరుకొన్నాము. అందఱమూ వేణుమందిరంలో కొవ్వువత్తి దీపంచుట్టూ కూర్చుని, మాకు పదిహేనువందలయేండ్ల క్రిందటి నావికవీరుల సాహసగాథలు చెప్పుకోవటం మొదలు పెట్టాము. నాటివారి అనుభవాల్ని జ్ఞాపకంచేసుకొని, ఉత్సాహపూరితులమౌతున్నాము. గడ్డాల వారి నల్లని నీడలు తెఱచాపమీద కనబడుతున్నాయి. ఆ నీడలు చూడగానే, పెరూలోని శ్వేతవర్ణుల సుదీర్ఘశ్మశ్రువులు జ్ఞాపకానికి వచ్చాయి. వారితో కలసి, పురాణశిల్ప పరిశీలన కోసం మెక్సికోనుంచి మధ్యఅమెరికావఱకూ, దక్షిణఅమెరికా వాయవ్యభాగాల్లో చాలానఱకూ, అంటే పెరూ దేశంవఱకూ కూడా, ప్రయాణం చేశాము. ఇక్కడ ఏదో అద్భుతమైన ఇంద్రజాలం జరిగినట్లుగా, 'ఇంకా' ప్రజలరాకకు పూర్వమే, ప్రాచీన నాగరకత అదృశ్యం అయింది. తిరిగి పశ్చిమానికిపోగా ఇప్పుడు మేము చేరుకోబోతున్న దీవులలో పునర్దర్శనం కలిగింది. పూర్వకాలపు నాగరకజాతుల నిపుణ నావికులు అట్లాంటిక్ మహాసముద్రంపైనుంచి బయలుదేరి, అంత సామాన్యపు నౌకలమూలాన్నే పశ్చిమసముద్ర ప్రవాహాన్ని అధిగమించి, కేనరీద్వీపాలనుంచి మెక్సికో జలసంధివైపు వీచే వ్యాపార పవనాన్ని తట్టుకొని, ప్రయాణం చెయ్యగలిగారా? అయితే ఆ

దూరమంతా కూడా నేను ప్రయాణం చేస్తున్నంత కానే కాదు. "ఇక్కడ సముద్రుడొక్కడే తప్ప మఱి ఎవరూ లేరు;" అనే నమ్మకం ఇక లేకపోయింది. మెక్సికోలోని అజ్టెక్సు నుంచి, పెరూలోని ఇంకాలవఱకూ వ్యాపించిన ఇండియన్ నాగరకతా విశేషం సముద్రాలుదాటి తూర్పువైపు వ్యాపించిందనీ, ఆసియాలో వేట, చేపలువట్టటం ప్రధానవృత్తులైన అమెరికన్ ఇండియనులు అమెరికాకు చేరుకోవటమే దానికి ప్రారంభమనీ, వారు ఇరవైవేల సంవత్సరాలక్రిందనో, ఇంకా దానికి కూడా పూర్వమో, అమెరికా చేరారనీ, అనేక పరిశోధకులు సహేతుకంగా చెప్తూన్నారు. అమెరికన్ ఇండియన్లు సైబీరియానుంచి అమెరికాకు వచ్చారట! మెక్సికోనుంచి పెరూవఱకూ విస్తరించిన ఉత్తమసంస్కృతి క్రమాభివృద్ధి పొందినట్లు నిదర్శనమే లేకపోవటం అతివిచిత్రం. గతకాలపు సంస్కృతి ఇదీ అనీ, ఇక్కడనుంచీ ఇండియన్ల సంస్కృతి అభివృద్ధి అయిందనీ, నిర్ధారణచేసుకొనేవఱకూ, పురావస్తు పరిశోధకులు లోతుకు వెళ్ళినకొద్దీ, సంస్కృతి మహోన్నతంగా కనిపిస్తూ ఉంటుంది. నాడూ, నేడూకూడా, నాగరకతాభివృద్ధికి అవకాశాలున్న ఉష్ణప్రాంతాలకంటె, అట్లాంటిక్ ప్రవాహం చొచ్చుకొని వచ్చే ప్రాంతాల్లో, అంటే, మధ్యఅమెరికా, దక్షిణఅమెరికాల్లోని ఎడారి ప్రదేశాల్లోనూ, అటవీ ప్రదేశాల్లోనూ నాగరకత వర్ధిల్లి ఉంది.

దక్షిణ సముద్రపుద్వీపాల్లోనూ, ఇల్లాగే కనబడుతున్నది. పెరూకి అత్యంత సన్నిహితంగా ఉన్నది తూర్పు (ఈస్టర్) ద్వీపము. నాగరకతాచ్ఛాయలు అక్కడ చాలా

సాంద్రంగా కనిపిస్తాయి. అయితే, ఆ చిన్నద్వీపంలో సారవంతమైననేల లేనేలేదు. ఎక్కడచూచినా, వట్టి బీడుమాత్రమే. అంతేగాక, ఇది ఆసియాఖండానికి మిగిలిన పసిఫిక్ దీవులన్నింటికంటెనూ, అతిదూరంగా ఉన్నది.

మా ప్రయాణంలో సగందూరం ముగిసేసరికి, పెరూ నుంచి తూర్పు(ఈస్టర్) ద్వీపం ఉన్నంతదూరం వచ్చాము. ఆ పురాణద్వీపం మాకు దక్షిణాన ఉన్నది. సాధారణ నౌకను కేవలం సముద్రత్వం సార్థకం అయ్యేచోట నడిపించాలనే ఉద్దేశంతో, మేము పెరూ మధ్యదేశపు తీరందగ్గఱనుంచీ, తిన్నగా భయంకర సముద్రంవైపు నడిపించాము. అందువల్ల, ఆ ద్వీపానికి పెడపెడగానే వచ్చాము. అలాకాకుండా, కోన్-టికీ శిధిల నగరం ట్యావ్వాన్నాకో దగ్గఱనే దక్షిణాభిముఖంగా ప్రయాణం చేసిఉంటే, గాలివిసురు తేడాలేకపోయినా ప్రవాహావేగం అంతగా లేని మార్గాన ఆ ద్వీపంవైపు వెళ్లిఉండే వాళ్ళం.

మేము 110° పశ్చిమరేఖాంశం దాటినతర్వాత, పాలినేషియన్ సముద్రభాగంలో ప్రవేశించాము. ఇప్పుడు పెరూ తీరానికి పాలినేషియన్ 'ఈస్టరు' ద్వీపమే మాకంటె దగ్గరైంది. దక్షిణ సముద్రపుదీవులు ఇప్పుడు మాకు సమతలంలో ఉన్నాయి. అవి ద్వీపసముదాయమంతటిలోనూ, అతి ప్రాచీనమైన సంస్కృతికి కేంద్రంగాఉన్నవి. రాత్రి వచ్చేసరికి, అంతవఱకూ మాకు మార్గదర్శకుడైన మిత్రుడు, ఆకాశసౌధంనుంచి జాఱి, సముద్రజలాల్లో మునిగిపోయాడు. అతనితో సప్తవర్ణ సమన్వితమైన తేజస్సుకూడా అంతరించింది. నిశాచేలాంచ

లాల్లో ప్రొద్దు మాటుపడగానే గడ్డాలతోకూడిన మా పెద్ద తలకాయలు తెఱచాపమీద ప్రత్యక్షమైనాయి.

కాని 'ఈస్టర్' ద్వీపంలో ఇంతకంటె విపరీతమైనశిరస్సులున్నాయి. అవి శిలానిర్మితాలు. వాటి గడ్డాలు సూదిలాగా, మొనతేలి ఉంటాయి. ముఖలక్షణాలు శ్వేతవర్ణుల్ని పోలి ఉంటాయి. అనేక శతాబ్దాలనాటి రహస్యాన్నిగురించి ఆలోచిస్తున్నట్టు కనబడతాయి. 1722 వ సంవత్సరంలో, యూరపియనులు ఆ ద్వీపంలో తొలిసారి అడుగుపెట్టినప్పుడే, అవి అక్కడ అదేవిధంగా ఉన్నాయి. ఈనాటి పాలినేషియన్లకు 22 తరాల క్రిందటకూడా, అవి అక్కడ అదేవిధంగా ఉన్నాయి. ప్రస్తుత జాతివారు అక్కడ ప్రవేశించినప్పుడు అక్కడ అద్భుత సంస్కృతి సంపదతో తేజరిల్లుతున్న ప్రాచీనవాసులలో బాల్యాం గడిచిన పురుషులనందఱినీ నిర్మూలించారు. అప్పటినుంచీ ఆ పాషాణభూత శిరస్సులు ఘనీభూతమైన పురాతన రహస్యాలకు ప్రధానచిహ్నాలతోపాటు నిలిచిపోయాయి. ఆ ద్వీపంలో, చెట్టుచేమలు లేని ఏటవాలు నేలల్లో, ఉన్న ఈ అత్యున్నత విగ్రహాలు ఆకాశాన్ని చుంబిస్తున్నట్లు కనబడుతాయి. అవి మూడునాలుగు అంతస్తులమేడ ఆక్రమించినంత మేర ఆవరించిఉంటాయి. పూర్వకాలపు ప్రజలు అంతంతపెద్ద విగ్రహాలని ఎల్లా నిర్మించగలిగారు? నిర్మించిన చోటినుంచి అక్కడికి ఎలా తేగలిగారు? ఏ విధంగా ప్రతిష్ఠించగలిగారు? ఇంతేకాక నేలమట్టానికి ముప్ఫైఆరు అడుగుల ఎత్తున ఉన్న ఆ విగ్రహాశిరస్సుల పైభాగాన బ్రహ్మాండమైన ఒక అరుణశిలను విగ్గుగా అమర్చారుకూడా. దీనినిబట్టి ఏమనుకోవచ్చును? నేటి

గొప్పగొప్ప ఇంజనీర్లకుకూడా, అశక్యంగా కనిపించే క్లిష్టసమస్యలను పరిష్కరించిన ఆనాటి శిల్పశాస్త్రజ్ఞుల కళానైపుణ్యమూ, బుద్ధిబలమూ ఎటువంటివో !

పెరూ నావికుల బుద్ధిసూక్ష్మతతో పోల్చిచూస్తే, 'ఈస్టరు' ద్వీపంలోని ఈ అద్భుతం నిజంగా అంత అద్భుతం అనిపించకపోవచ్చును. అయినప్పటికీ ఈ ద్వీపంమీద నిలిచిన ప్రాచీన సంస్కృతిచిహ్నాలు కాలపురుషుని దంష్ట్రిలకు కొంచెమైనా పడకుండానే ఉన్నవి.

'ఈస్టరు' ద్వీపం ఒక చల్లారిన అగ్నిపర్వత శిఖరం. ఇక్కడ నివసించిన ప్రాచీనులు సముద్రతీరంనుంచే రాతి బాటలు నిర్మించారు. నౌక దిగగానే, ఈ రాతిబాటమీదనే అడుగుపెట్టగలము. ఇక్కడ పరిశీలిస్తే సముద్రం ఆనాడు ద్వీపాన్ని ఏ విధంగా పరివేష్టించి ఉండేదో, ఈ నాడున్నూ రేఖామాత్రంకూడా తప్పకుండా అదేవిధంగా ఉన్నదని స్పష్టమౌతుంది. ఇది అనాదిగా ఇతర భూభాగంతో ఎంతమాత్రమూ సాన్నిహిత్యంలేని చిన్నదీవి. అంతేకాని సముద్రమగ్నం కాగా, మిగిలిన ఏ ప్రత్యేకఖండభాగమూ కాదు. చిరకాలంనుంచీ కూడా, పసిఫిక్ ద్వీపాల యావత్సంస్కృతి సంపదకూ కేంద్రంగా ఉన్నది.

ఈ ద్వీపం ఉలిరూపంలో ఉన్నది. దీని మధ్యభాగంలో, శిథిలమైన అగ్నిపర్వతబిలం కనిపిస్తుంది. దీనికి దిగువ, శిల్పులకు విస్మయం కలిగించే కళాఖండాల గని ఉన్నది. అది ప్రదర్శనశాలమాత్రమే కాదు. కళాసృష్టి కేంద్రం కూడాను. ద్వీపాన్ని ఆక్రమించుకొన్న విజాతీయుల క్రూర హింసాచర్యలకు వెఱచి,

అప్పటిదాకా చెక్కుతూఉన్న బొమ్మలనూ, పరికరాల్ని విడిచిపెట్టి, శిల్పులు పలాయితులయ్యారు. అందువల్లనే, సగమో, ముప్పాతికో తయారై, అలాగే పరిత్యక్తాలైన శిల్పాలనేకం ఇప్పటికీ కనిపిస్తాయి. ఆ రోజుల్లో, ఈ బిలానికి దిగువ భాగంలో అనుదినమూ శిల్పులు ఎల్లా పనిచేస్తూ ఉండేవారో, ఈ దృశ్యాన్నిబట్టి ఊహించుకోవచ్చును. వారు ఉపయోగించిన జాతిగొడ్డళ్ళు, చెకుముకి జాతివలె కఠినమైనవి. వారు నాగరకులయినప్పటికీ, కోన్-టికీ శిల్పులలాగానే, ఇనుము అంటే, ఎలా ఉంటుందో, తెలియనివారని తోస్తుంది. పెరూ నుంచి పలాయితులయిన కోన్-టికీ శిల్పులుకూడా, అండెస్ పీఠభూమిదగ్గఱ ఇదేవిధమైన కొన్ని పెద్దశిల్పాలను విడిచిపెట్టి వెళ్లారు. ఈరెండు చోట్లలోనూ, శ్వేతవర్ణుల శిలావిగ్రహాలు పెద్దపెద్ద గడ్డాలున్నవి ఉన్నాయి. ఒక్కొక్కవిగ్రహం ముప్ఫైనలభై అడుగులఎత్తు ఉంటుంది. అక్కడా, ఇక్కడాకూడా, ఈ శిల్పసృష్టి పర్వతప్రాంతాననే జరిగింది. ఇందుకు ఉపయోగపడ్డ గొడ్డళ్లుకూడా, అతికఠినమైన ఒకేరకం జాతితో తయారైనవే. ఈ విగ్రహాలకు పైన నీడకోసంకానీ, వీటికిచుట్టూ ప్రాకారాలకోసంకానీ మహాశిలలు అమర్చటం రెండుచోట్లలోనూ కనిపిస్తుంది. మఱి ఆ దుర్వహపాషాణాల్ని మైళ్ళకొద్దీ దూరాలనుంచి ఎలా తీసుకురాగలిగారో! అంత ఉన్నతంగా ఉన్న విగ్రహాలకు పైభాగాల్లో ఎలా చేర్చగలిగారో!

'ఈస్టరు' ద్వీపంలోని పర్వతబిలానికి దిగువ సొరంగాలవంటి ప్రదేశాల్లో, అసంపూర్ణాలుగా మిగిలిన ఎన్నో పెద్దపెద్ద విగ్రహాలు ఉన్నాయి. వాటినిచూస్తే, ఏయేదశల్లో, ఏయే

విధంగా, శిల్పసృష్టి జరుగుతూ వచ్చిందో, బోధపడుతుంది. శిల్పులు పలాయనం చెయ్యవలసివచ్చిన సమయానికి, చాలా వఱకు పూర్తి అయిన బొమ్మలలో, మఱీ పెద్దది అరవై అడుగుల ఎత్తు ఉన్నది. ఇదే కొఱతలేకుండా తయారైనట్లయితే, దీని శిరోభాగాన ఆచ్ఛాదనగా ఒక పెద్దఱాతిపలకకూడా అమర్చటం జరిగేది. అప్పుడది ఒక ఎనిమిది అంతస్తులమేడ అంత ఉండేది. ఒక్కొక్క విగ్రహమున్నూ, ఒక్కొక్క ఱాతిబండలో నుంచి సృష్టి అయినదే. ఆ విగ్రహాలదగ్గఱ పడి ఉన్న పరికరాల్ని చూస్తే, ఒక విగ్రహం దగ్గఱ ఏకకాలంలో ఒకరికంటె ఎక్కువమంది పనిచేసేవారు కారని తెలుస్తుంది. పెరూ శిల్పాల లాగానే, ఇక్కడి శిల్పాలున్నూ, వెనుకకు ఆనుకొని, చేతులు గట్టుకొని, అఱచేతులు ఉదరాలకు తాకుతూఉండే భంగిమలో, అతివిశదంగా నిర్మించిన తరువాత, వాటిని ఏయేచోట్ల ప్రతిష్ఠించాలో అక్కడకు చేర్చేవారు. విగ్రహనిర్మాణం పూర్తి అయిన చివఱిఘట్టంలో, ఇంతపెద్ద విగ్రహాన్ని, పర్వతశిఖరం ప్రాంతాన వెనుకకు ఆన్చి నిలబెట్టేవారు. అలా నిలవటానికి వీలుగా, విగ్రహం వెన్నుభాగాన చిన్నగట్టువంటిది మిగిల్చి ఉంచేవారు. అటుతరువాత ఆగట్టువంటి భాగాన్నికూడా చెక్కివేసేవారు అప్పుడు విగ్రహం పడకుండా ఉండటానికి పెద్ద గుండ్రాళ్ళను అమర్చేవారు.

వీటిలో ఎక్కువ శిల్పాలని బిలానికి దిగువను ఉన్న ఏటవాలు నేలమీదకు చేర్చేవారు. మఱీ పెద్దవాటినైతే, పర్వతోపరిభాగానికిచేర్చి, అక్కడనుంచి గమ్యస్థానాలకు కొనిపోయి, ఒక శిలావేదికమీద ప్రతిష్ఠించి, విగ్రహం పైభాగాన పెద్ద

శాతిపలకను ఆచ్ఛాదనంగా అమర్చేవారు. ఈ విగ్రహాల్ని ఎగుమతి చెయ్యటం నట్టి అభూతకల్పనయేమో అనిపించ వచ్చునుకానీ, అది కేవలం యథార్థమే దానిని కాదనలేము. పెరూనుంచి పలాయితులవుతూ; అండెస్ పీఠభూమిదగ్గర తాము నిర్మించి తెచ్చుకొన్న శిల్పాలను వదలివెళ్ళిన శిల్పులు ఈ పద్ధతిలో మంచినిపుణులని ఆ శిల్పాలవల్లనే బోధపడు తున్నది. అవికూడా, ఈ ఈస్టర్ ద్వీపపు విగ్రహాల నమూనా లోనూ, ఇంతపెద్ద పరిమాణాల్లోనూ ఉన్నాయి. ఈ ఈస్టరు ద్వీపంలోని శిల్పాలు చాలాపెద్దవీ, అసంఖ్యాకమైనవీ, అయినప్ప టికీ, ఇక్కడి శిల్పుల రచనలో ఒక ప్రత్యేక విశిష్టత ఉన్నప్ప టికీకూడా, ఇక్కడనుంచి పలాయితమైన సంస్కృతివిశేషమే అమెరికాకు దగ్గర ఉన్న తక్కిన పసిఫిక్ ద్వీపాలలోకూడా కనిపిస్తున్నది. అన్నిచోట్లలోనూ, ఇటువంటి శిల్పాలే మానవ రూపంలో నిర్మించారు వాటిని ఏకొండ ప్రాంతంలోనో సృష్టించటం, అక్కడనుంచి దేవాలయ ప్రదేశానికి తీసుకు రావటం జరిగేది మార్క్వెసాస్‌లో ఒక ఇతిహాసం విన్నాను. అందులో ఈ విగ్రహాలను ఉత్పత్తి స్థానాలనుంచి ఉద్దిష్ట ప్రదే శాలకు తీసుకువెళ్ళే విధం వివరంగా ఉన్నది. ఇది సరిగా టాంగటాబూ ఉన్నతద్వారం దగ్గరకు ఆాతి స్తంభాల్ని చేర్చటం గురించి అక్కడి ప్రాచీనులు చెప్పేకథల్లో మాదిరిగానే ఉన్నది. ఇందువల్ల ఆ ప్రజలే ఆ పద్ధతినే ఈస్టరు ద్వీపంలోనూ అనుసరించారని ఊహించవచ్చును.

బిలంలో శిల్పి పనిచెయ్యటానికి చాలాకాలం పట్టేది కానీ, ఎక్కువమంది శిల్పులతో అవసరం ఉండేదికాదు.

విగ్రహనిర్మాణం పూర్తికాగానే, అక్కడనుంచి ఎగుమతి కూడా చాలాతేలికగా జరిగేది. అయితే, దీనికిమాత్రం చాలామంది మనుష్యులుకావాలి. ఈస్టరుద్వీపం పరిమాణంలో చిన్నదైనా, అంతస్సారాన్నిబట్టి పెద్దదే. అక్కడ మత్స్యాలు విశేషంగా లభించేవి. వ్యవసాయం బాగా జరిగేది. పెరూ దేశపు చిలగడదుంప విశేషంగా ఉత్పత్తిఅయేది. ఆకాలంలో ఇక్కడి జనసంఖ్య ఏడెనిమిదివేలు ఉండవచ్చునని పరిశోధకుల అభిప్రాయం. ఆ పెద్దపెద్ద విగ్రహాలను బిలాన్ని ఆనుకొన్న ఏట వాలు గట్టుమీదుగా శిఖరానికి చేర్చటానికి సుమారు వెయ్యి మంది ఉంటే చాలు. అక్కడనుంచి గమ్యస్థానాలకు వాటిని ఈడ్చుకొని పోవటానికి అయిదువందలమంది ఉంటేనే చాలు. చెట్ల పై పొరలతోగానీ, పీచు మొదలయినవాటితోగానీ, పెద్ద పెద్ద మోకులు తయారుచేసి, వాటిని కొయ్యచట్రాలకు బిగించి, వాటిమీద ఆ పెద్దపెద్ద జాతివిగ్రహాలను చేర్చి, ఆ కొయ్యచట్రాన్ని దుంగలమీద, చిన్నచిన్న గుండ్రాళ్ళ మీదుగా ఈడ్చుకొనిపోయేవారు. ఆ దుంగలకూ గుండ్రాళ్ళకూ 'టారో' అనే మూలికపసరువల్ల తేలికగా జారిపోయేగుణం కలిగించటంవల్ల, అవి సులభంగా దొర్లుతూఉండేవి. ఆ ప్రాచీన నాగరకప్రజలు మోకులు తయారుచెయ్యటంలో నిపుణులని ప్రసిద్ధి. దక్షిణ సముద్రద్వీపాలలోనూ, ముఖ్యంగా, 'పెరూ' దేశంలోను, కొన్ని మోకులు కనిపించాయి. అవి మానవ వక్షస్థలం అంతలావుగాఉన్నాయి. అవి కొన్నికొన్ని వాగులమీద వంతెనలుగా ఉపయోగపడేవంటే, ఆ ప్రాచీనులకు ఈ విద్యలో ఉన్న నేర్పు ఎంత ప్రశంసనీయమో ఊహించుకోవచ్చును.

ఆ పెద్ద రాతివిగ్రహాలు గమ్యస్థానం చేరిన తర్వాత, వాటిని నిలబెట్టడం ఎట్లాగా; అనేది మహాకసమస్య. అక్కడ ఏటవాలుగా ఒక రాతిగోడ కట్టేవారు. ఈ రాతివిగ్రహాన్ని ఆ ఏటవాలు ప్రదేశంనుంచి, కాళ్ళవైపు పట్టుకొని ఈడ్చుకు వచ్చేవారు. ఇలా ఆ విగ్రహం నిర్దిష్టస్థానానికి చేరుకొనేది. అక్కడఉన్న ఒకకన్నంలో దాని పాదాలు పడేట్టుగా దొర్లించే వారు. అక్కడనుంచి త్రాళ్ళతో పైకి లాగగానే, విగ్రహం నిర్దిష్టస్థానంలో నిలిచేది. ఇదే ఉపాయంతో ఒక పెద్ద రాతిపలకను ఆ గోడమీదకు దొర్లించి, విగ్రహానికి శిరోభాగంలో ఆచ్ఛాదనంగా అమర్చేవారు. అది విగ్రహం శిరంమీద నిశ్చలంగా నిలబడ్డ తర్వాత, ఈ రాతిగోడను తొలగించి వేసేవారు. విగ్రహాల్ని అమర్చటంకోసం ఈ విధంగా ఏటవాలుగా నిర్మించబడ్డ రాతిగోడలు 'ఈస్టరు'ద్వీపంలో అనేకప్రదేశాల్లో ఇప్పటికీ కనబడుతాయి ఆ విగ్రహాల్ని అక్కడకి చేర్చకపోవటం మూలాన ఈ గోడలు ఇలానే మిగిలిపోయాయి. ఆ చాతుర్యం ప్రశంసనీయం. ఈ అద్భుతక్రియా విశేషంలో నమ్మరాని విషయం ఏమీలేదు. నమ్మకపోతున్నాము అంటే, ప్రాచీన మానవ బుద్ధిబలాన్ని మనం చిన్నచూపు చూస్తున్నామన్న మాట. మానవశక్తినీ, కాలాన్నీ, వారు ఎంతచక్కగా వినియోగించుకొన్నదీ, ఇటువంటివాటిని చూస్తేనే మనం గ్రహించగలం.

అయితే, వారు ఇలాంటిశిల్పాలు ఎందుకు నిర్మించినట్టు? విగ్రహం శిరస్సుమీద కిరీటంలాగా అమర్చటానికి వారు పని చేసేచోటఉన్న రాళ్ళలోనుంచే ఎంచుకోక, ఎక్కడో నాలుగు మైళ్ళదూరంలో ఉన్న ఎఱ్ఱరాతినే ఎందుకు కోరి తెచ్చు

కొన్నారు? దక్షిణ అమెరికాలోను, మార్క్వెసాస్ ద్వీపంలోనూ కొన్నిచోట్ల విగ్రహం యావత్తూ ఎఱ్ఱరాతితోనే తయారు చెయ్యబడ్డది. ఆ జాతికోసం వారు ఎంతో దూరం వెళ్ళారు. పాలినేషియాలోనూ, పెరూ దేశంలోనూ కూడా ఎఱ్ఱటి తలపాగా గాని, టోపీగాని, ఉన్నతపదవికి ఒక ప్రధాన చిహ్నంగా ఉండేది.

ఆ శిల్పులు ఈ విగ్రహాల్ని ఈ రూపాల్లోనే ఎందుకు నిర్మించారో విచారించాలి. ఈ ద్వీపానికి మొట్టమొదట వచ్చిన యూరపియనులకు తీరప్రాంతంలో ఒకరకం విచిత్రపద్ధతిలో ఉండే శ్వేతవర్ణులు కనిపించారు. అటుతర్వాత ఇదే తెగకు చెందిన మఱికొందఱు కనిపించారు. కానీ వారు పెద్దగడ్డాలు పెంచినవారు. ఆదిమజాతికి చెందిఉండిన్నీ, వైదేశికుల చేతుల్లో చావని స్త్రీలూ బాలురూ కొందఱు కనిపించారు. ఆదిమవాసులు తమ పూర్వులలో కొందఱు తెల్లటివారనీ, కొందఱు గోధుమవర్ణంగా ఉండేవారనీ, చెప్తారు. ఆ గోధుమవర్ణం వారు ఇరవైరెండు తరాల క్రిందట పాలినేషియాకు వచ్చారనీ, శ్వేతవర్ణులు సుమారు యాభైఏడు తరాల క్రిందట తూర్పువైపు నుంచి పెద్ద నౌకల్లో వచ్చారనీకూడా చెప్తారు. తూర్పు నుంచివచ్చిన జాతికి "దీర్ఘకర్ణులు" అనేపేరు ప్రసిద్ధమయింది. ఎందుచేతనంటే వారు తమ చెవులకు కొంచెం బరువైనవస్తువులు వ్రేలాడగట్టేవారట. అలా కట్టడంవల్ల, చెవులు పొడుగ్గా సాగి, బుజాలకు తగులుతూ ఉండేవట. "దీర్ఘకర్ణులు" అటు తరువాత కొంతకాలానికి ద్వీపం ఆక్రమించుకొన్న "హ్రస్వకర్ణుల" చేతుల్లో హతులయినారు. ఈస్టరు ద్వీపంలో కనబడే

విగ్రహాలన్నింటికీ చెవులు బుజాలవరకూ ఉన్నాయి. అంటే, వీటిని సృష్టించిన శిల్పుల చెవులుకూడా, అల్లాగే ఉండేవనీ గ్రహించవచ్చును.

పెరూ దేశంలోని ఇంకాల ఇతిహాసాలనుబట్టి సూర్యవంశ ప్రభువైన కోన్-టికీ యొక్క ప్రజల్లో, కొందఱు శ్వేతవర్ణులు ఉండేవారనీ, వారు తప్పకుండా గడ్డాలు పెంచేవారనీ, ఇంకా ప్రజలు వారిని "పెద్దచెవులు" అని పిలిచేవారనీ తెలియవస్తున్నది. ఈ "పెద్దచెవులు" అని పేరుపొందినవారు పైనచెప్పినట్లుగా చెవులు బుజాలకు తగిలేటంతగా సాగేట్లు ఏవో బరువు వస్తువులు చెవులకు వ్రేలాడగట్టకొనేవారట! అండెస్ పర్వతాల దగ్గఱ శిల్పాలు వీరివే. ఇంకాలు వీరితో టిటికాకా సరస్సులోని ఒకద్వీపంలో యుద్ధంచేసి తరిమివేశారు.

ఇప్పుడు విచారణచేస్తే తేలేదిది : కోన్-టికీ పాలితులయిన "పెద్దచెవులు" అని పేరుకల శ్వేతవర్ణులు పెరూదేశం నుంచి పశ్చిమాభిముఖంగా పారిపోయారు. అప్పటికే వారికి శిల్పనిర్మాణంలో మంచి చాతుర్యం అలవడిఉన్నది. టికీపాలితులయిన "దీర్ఘకర్ణులు" అనే ప్రసిద్ధికల శ్వేతవర్ణులు ఈస్టర్ ద్వీపానికి తూర్పువైపునుంచి వచ్చారు. "పెద్దచెవులు" అనే ప్రసిద్ధిగల శ్వేతవర్ణుల కళాకౌశలం ఎటువంటిదో "దీర్ఘకర్ణులు" అని ప్రసిద్ధులయిన శ్వేతవర్ణుల కళాకౌశలంకూడా అటువంటిదే. ఒకరికి ఒకరు ఎంతమాత్రం తీసిపోరు. ఈస్టర్ద్వీపాల్లోని అత్యుత్తమ శిల్పాల్లోగూడా, పెరూ శిల్పాలకంటె రేఖామాత్రమైనా అభ్యున్నతి గోచరించదు.

పెరూలోని పెద్దరాతి విగ్రహాలకూ, పసిఫిక్ ద్వీపాల

లోని పెద్దరాతి విగ్రహాలకూ, చాలా పోలికలు కనబడుతు న్నాయి. కాని పసిఫిక్ దీవుల్లోని శిల్పకళను పరిశీలిస్తే, ఒక ద్వీపంలోని శిల్పాలకూ, వేరొక ద్వీపంలోని శిల్పాలకూ, ఇంత సామ్యం కనిపించదు. మార్క్వెసాస్ ద్వీపాల్లోనూ, తహీతిలోనూ ఉన్న ఇటువంటి విగ్రహాలను సాధారణంగా 'టికీ' అనే పేర్కొంటారు. అక్కడ కీర్తిశేషులైన పిమ్మట దేవతలుగా భావించబడే మహాసీయుల ప్రతిమలవి. మరి ఈస్టరుద్వీపంలోని విగ్రహాల అరుణకిరీటాలను గురించి వివరించవలసిందే. ఇది వరకు చెప్పినట్లు, పాలినేషియా ద్వీపాలన్నింటిలోనూ, చెదురుగా కొంతమంది ఉండేవారు. ఆ కుటుంబాల్లోని వారందరూ ఎర్రగా ఉంటారు. వారి జుట్టుకూడా ఎర్రగానే ఉంటుంది. వీరందరూ మొట్టమొదట అక్కడకువచ్చిన శ్వేతవర్ణులసంతతి వారని, అక్కడిప్రజలు చెప్పుతున్నారు. కొన్నిద్వీపాల్లో మత-సంబంధమైన వేడుకల్లో పాల్గొనేవారు వారి ప్రాచీనుల రూపాలను తలపించటానికి, తెల్లనిశరీరమూ, ఎఱ్ఱనిజుట్టూ౦కల వేషాలను ధరించటం ఉన్నది. ఈస్టరుద్వీపంలో వారి కోత్సవాలు జరిగేటప్పుడు ప్రధానవ్యక్తి జుట్టు పూర్తిగా తీసివేసికొంటాడు. అప్పుడు అతనితలకు ఎఱ్ఱరంగు వేస్తారు. ఈస్టరులోని విగ్రహాలకు తలపైన అరుణకిరీటంలాగా కనిపించే ఎఱ్ఱరాయి, జుట్టుముడి ఆకారంలో మలిచిఉన్నట్లు కనిపిస్తుంది. ద్వీపవాసుల్లో కొందరు జుట్టు ఇలాగే ముడివేసికొంటారు. సరిగా నెత్తిమీద గుండ్రని కాయఉన్నట్లు ఉంటుంది. కొన్నికొన్ని జాతుల్లో, ఇలా నెత్తి మీదికి ముడివచ్చేట్టు జుట్టు బంధించటం సంప్రదాయసిద్ధంగా కనబడుతున్నది గదా!

ఈస్టరు ద్వీపవాసులైన శిల్పుల చెవులు పొడుగ్గా సాగి ఉండేవి; కాబట్టి, వారు సృష్టించిన విగ్రహాల చెవులు కూడా అదేవిధంగా చేశారు. విగ్రహానికి జుట్టు ముడిగా అమర్చటానికి, వారు ప్రత్యేకంగా ఎఱ్ఱరాతినే ఉపయోగించటానికి కారణం తమ జుట్టు ఎఱ్ఱగా ఉండటంచేతనే. విగ్రహాల గడ్డాలు కొనదేలి ముందుకు పొడుచుకొని వచ్చినట్లు కనిపిస్తాయి. ఆ శిల్పులు గడ్డాలు పెంచుకొనేవారు కాబట్టి, విగ్రహాలను ఆ విధంగానే సృష్టించారు. విగ్రహాల ముఖలక్షణాల్లో ఒక ప్రత్యేక శ్వేతజాతి కనుముక్కుతీరు కనిపిస్తుంది. ముక్కు సన్నగా వంపులేకుండా ఉంటుంది. పెదవులు పల్చగా సన్నని అంచుకట్టినట్లు ఉంటాయి. ఆ శిల్పులు కేవలం మలయాద్వీపకల్పంనుంచి వచ్చిన జాతికే చెందినవారు కాకపోవటమే దీనికి కారణం. విగ్రహాలకు తలలు పెద్దవీ, కాళ్లు చిన్నవీ; చేతులు ముడుచుకొని, పొట్టమీదకు చేరిఉంటాయి. ఇవి ఇల్లాగే నిర్మించటానికి కారణం ఏమిటంటే, పెరూలోకూడా, పెద్దపెద్ద విగ్రహాలను ఇల్లాగే నిర్మించేవారు. అదే సంప్రదాయం ఇక్కడా అవలంబించారు. ఇక్కడి విగ్రహాలకు చేసే అలంకరణం యావత్తూ, ఉదరంచుట్టూ పటకా మాత్రమే. టిటికాకా సరస్సు దగ్గరి కోన్-టికీ శిథిలాల్లో కనిపించిన విగ్రహాలకుకూడా, ఇటువంటిదే పటకా ఉన్నది. ఇది పురాణవర్ణనలప్రకారం సూర్యదేవుని పటకా. మనం చూచే ఇంద్రధనుస్సే అది. ఒకప్పుడు సూర్యదేవుడు మాంగరేవాలోని ప్రజలయందు ప్రసన్నుడై, తన బిడ్డలైన శ్వేతవర్ణుల్ని అక్కడకు పంపించాడనీ, అప్పుడే అద్భుత మహిమగల తన పటకానికూడా అక్కడకు విసిరివేశాడనీ,

మాంగరేవాలో ఒక పురాణకథనల్ల తెలుస్తున్నది. ఒకప్పుడు పెరూ దేశంలోనూ, ఈ ద్వీపాల్లోనూ ఉండే ప్రజలు తాము సూర్యపుత్రులమని చెప్పుకొనేవారు.

ఈస్టరుద్వీపం పేరు పటంలో చూడటమే తప్ప, అక్కడి అద్భుతవిషయాలు చూడటానికి వెళ్ళకుండా, తిన్నగా పాలినేషియాకే ప్రయాణంచేస్తున్నాం, దీపంచుట్టూ నలుగురమూ కూర్చుని, ఈస్టరు పూర్వచరిత్ర చెప్పుకొని కాలక్షేపం చేసేవాళ్ళము. కాని ఆ ద్వీపంలో తూర్పుదేశాల నాగరకతా, సంస్కృతీ విశేషంగా ఉన్నవి. అసలు దానిపేరే అందుకు తగ్గట్టు ఉన్నది కదా!

ఒకప్పుడు కొందరు డచ్చివారు ఈస్టరు పండుగనాడు ఆ ద్వీపంలో అడుగుపెట్టటం జరిగింది. అందువల్ల వారు దానికి "ఈస్టరుద్వీపం" అని నామకరణం చేశారు. అయితే డచ్చివారు వెళ్ళటానికి పూర్వం ఆ ద్వీపానికి పేరే లేదా — అంటే, ఒకటేమిటి? చాలా సార్థకనామాలున్నాయి. పాలినేషియన్ భాషలో దీనికి మూడు పేర్లకు తక్కువలేవు.

"టీ-పెటో-టీ హెనూ" అనేది ఒక పేరు. "ద్వీపాలకు నాభి, లేక కేంద్రం" అని దీని అర్థం. కావ్యపరిభాషలో ఉన్న ఈ పేరు ఇక్కడికి పశ్చిమాన ఉన్నద్వీపాలకంటె దీనికొక ప్రత్యేకత స్ఫురింపజేస్తున్నది. ఇది పాలినేషియన్లు దీని విశిష్టతకు అనుగుణంగా ఎన్నడో పెట్టినపేరు. ద్వీపానికి తూర్పు భాగంలో "దీర్ఘకర్ణులు" మొట్టమొదట అడుగు పెట్టిన చోటికి దగ్గరలో అతినిపుణతతో తయారైన శాలిగ్రామం ఒకటి కని పిస్తుంది. దీనికి "బంగారుబొడ్డు" అనిపేరు. తర్వాత తర్వాత

ద్వీపాని కంతటికీ ఇదే కేంద్రస్థానంగా భావించటంకూడా జరిగింది. ప్రాచీన పాలినేషియన్ కళోపాసకులు ద్వీపానికి తూర్పు తీరాన "బంగారుబొడ్డు" చెక్కి, ఇటకా పశ్చిమాన తమ అధీనంలో ఉన్న నానాద్వీపాలకంటెనూ, పెరూ దేశానికి అత్యంత సన్నిహితంగా ఉన్న ఈ ద్వీపాన్నే ప్రత్యేకాభిమానంతో తమ ద్వీపాలకు నాభిగా ఎంచుకొన్నారు. అందుచేత ఇది సార్థక నామమే. పాలినేషియన్ ప్రజల పురాతన సంప్రదాయాల్నీ, విశ్వాసాల్నీ పరిశీలిస్తే, వారి నూతన ద్వీపాన్వేషణ ఇక్కడి నుంచే ఫలిస్తూ రావటంవల్ల, దీనిని ద్వీపాలకు జన్మస్థానంగా భావించారని తెలుస్తుంది. తరువాత వారు అనేక ద్వీపాలకు వెళ్ళినా, వాటికీ తమ మాతృభూమికీ అనుబంధం కలిగించింది ఈ చిన్నద్వీపమే. అందువల్లకూడా వారికి దీనిమీద ప్రత్యేకాభిమానం కలిగింది.

"రాపా-న్యూ" అనేది ఈ ద్వీపానికి రెండవపేరు. "పెద్ద రాపా" అని దీనిఅర్థం. "చిన్నరాపా" అనేదివి ఇంకొకటి ఉన్నది అది ఈ పెద్దరాపాకు పశ్చిమంగా ఎంతోదూరాన ఉన్న ఇంత ద్వీపమే. ఆనాటిప్రజలు తమకు మొట్టమొదట కనిపించిన ద్వీపాన్ని "పెద్ద రాపా" అనీ అటుతర్వాత కనిపించిన వాటిని అవి మొదటిద్వీపంకంటె చిన్నవి కాకపోయినా, "చిన్న రాపా" అనికానీ, "క్రొత్త రాపా" అనికానీ పేర్కొనేవారు. "చిన్న రాపా"లో నివసిస్తున్న ప్రాచీనులు తమ పూర్వీలు "పెద్దరాపా"నుంచి వచ్చారనీ, అది తమ ద్వీపానికి తూర్పుగానూ, అమెరికాకు అత్యంత సన్నిహితంగానూ ఉన్న ఈస్టరు ద్వీపమే అనీ అంటారు. ఇందువల్ల తూర్పుదేశాలనుంచి ఇక్క

డికి ప్రజలు వలసవచ్చారనే విషయం మరింత స్పష్టమౌతున్నదిగదా!

దీని మూడవపేరూ చిట్టచివరి పేరూకూడ "మాతా-కిటే-రాణి" "స్వర్గంవైపుచూచే కన్ను" అని దీనిఅర్థం. "తహితీ, మార్క్వెసాస్, హవాజీ మొదలైన మహాపర్వతమయ భూభాగాలతో పోల్చిచూస్తే, ఎక్కడా అంతఎత్తు కనిపించని ఈ ద్వీపానికి ఈపేరు ఎల్లా చెల్లుతుంది?" అని, దీనిని చూచీ చూడకముందే సందేహం కలుగుతుంది. పాలినేషియాభాషలో రాణీ, స్వర్గం అనేవి అనేకార్థాలున్న మాటలు. అది వారి పూర్వుల మాతృభూమి. సూర్యదేవుని అనుగ్రహానికి పాత్రమైన పవిత్రభూమి. "టికీ"కి ఒకప్పుడు రాజధానిగా ఉన్న గిరిదుర్గం అసంఖ్యాకాలుగా ఉన్న ద్వీపాలన్నింటికీ తూర్పున మొట్ట మొదట కనిపించేది కావటంవల్ల పాలినేషియన్లు దీనికి ఈ "స్వర్గంవైపు చూచేకన్ను" అనే పేరుపెట్టటం సముచితమే.

అండెస్‌లో కోన్-టికీ నగర శిథిలాలకు దిగువనున్న ఒక ప్రదేశానికి కూడా "మాతా-కిటే-రాణి"వలెనే ధ్వనించే పెరూవియన్ పేరు ఉన్నది. అది పసిఫిక్ సముద్రతీరాన ఈ ఈస్టరుద్వీపానికి ఎట్టయెదురుగా ఉన్నది. ఈ రెండుపేర్లూ ఒకే విధంగా ఉండటానికి, ఏమైనా కారణం ఉన్నదేమో; అని పిస్తుంది.

నావమీద ఆరుబయట కూర్చున్నప్పుడు ఈస్టర్ ద్వీపాన్ని గురించిన ప్రసంగాలతోనే కాలం గడచిపోయేది. ఆ అద్భుతకథల్లో మేముకూడా కొన్నిపాత్రలమైనట్లుగా భావించుకొని, ఆనందించేవాళ్ళం. "టికీ" నాటినుంచీకూడా, మేము

నూతనప్రదేశాల్ని అన్వేషించటం తప్ప మఱోపని లేకుండా, సముద్రంమీద తిరుగుతూనే ఉన్నట్టు భావించుకొనేవాళ్లం.

ఇప్పుడు సముద్రమూ అలలూ కన్పిస్తూనేఉన్నా వాటిని గుఱించిన ఆలోచన ఒక్కటీ వచ్చేదికాదు. వాటినిగుఱించి ఆలోచించవలసినదేమున్నది ? అవి మాకు సుపరిచితాలే. నావ మీద ఉండగా వాటికీ మాకూ కల పొత్తు ఎటువంటిదో కూడా తెలుసు. సొరచేపకూడా అనుదిన దృశ్యమానం అయినది. దాని చరిత్ర మాకు సువిదితమే. అది కేవలం మేము కూర్చున్నచోటికి అడుగునుంచి పోతూఉన్నా, ఈ డకోసం చూచేవాళ్ళం కాము. అసలు కూర్చున్నచోటినుండి కదలటమే లేదు. అంత నిర్భయంగా ఉండటమే కాకుండా, ఒకొక్కప్పుడు దాని తోకపట్టుకొని నావమీదకు ఈడ్చేవాళ్లము కూడాను అది పాపం బలంకొద్దీ గింజుకొనేది. రానురాను సొరచేపతో బలాబలాల పరీక్షకు "త్రాటియుద్ధం" త్రాడు లేకుండానే ఆడటం అలవాటయింది. మాకు మొదటనుంచీ ఉన్న ఆందోళనకానీ, ఆవేశంకానీ యిప్పుడు లేవు. ఏ పని చేసినా సులువుగానూ, వినూతనమార్గంలోనూ చేస్తున్నాము. బేడిసచేపలను అవలీలగా పట్టుకొంటున్నాము. అవి అన్నీ తినాలంటే మాతరం కాదు. అయితే అన్నింటిని పట్టుకోవటం దేనికి ? బేడిసలకూ మాకూ కొంతసేపు కాలక్షేపంకోసమే. 'ఇందులో క్రొత్తదనం ఏమిటీ?' అంటే, గాలం లేకుండా చేపను పట్టటం. ఒక ఎగిరేచేపను దారానికి కట్టి నీటిలో వదలిపెట్టేసరికి, బేడిసలు అమాంతం దానిమీదికి ఉఱికేవి. ఇంతలో మేము దారాన్ని లాగివేసేవాళ్ళము. అప్పుడు

బేడిసలకూ మాకూ పోరాటం సిద్ధం. ఒక బేడిస తప్పుకొంటే మరొకటివచ్చి ఆ స్థానంలో నిలిచేది. ఇల్లా కొంతసేపు వినోదించిన తర్వాత ఎగిరేచేప పూర్తిగా బేడిసలపాలయ్యేది.

సొరచేపలతోనూ ఇదే ఆట సాగించాము. ఒక మత్స్య ఖండమో, పనికిమాలినవస్తు సంచయమో త్రాటిచివఱకట్టి నీళ్ళలో పడవేసే వాళ్ళము. అలవాటుప్రకారం ఒకప్రక్కకు తిరిగి ఈదుకొని రావటానికి బదులుగా, ముట్టె పైకెత్తుకొని, ఆ వస్తువును మ్రింగాలనే ఆతురతతో సొరచేప నోరు విశాలం చేసికొంటూ వచ్చేది. అది దగ్గఱకు వచ్చి ఎఱను మ్రింగటానికి సిద్ధంగా ఉన్న సమయంలో త్రాడు లాగివేసేవాళ్ళం. ఇల్లా ఎన్నిపర్యాయాలు వంచించినా, పాపం! ఆ సొరచేప నోరు ఆడిస్తూనే ఉండేది కానీ, అవతలకు పోయేదికాదు. దానిని బుద్ధిహీనత అనే అనాలో, ఆశావాదిత్వం అనే అనాలో మాకు బోధపడలేదు. చివఱకు అది రొట్టెముక్కకోసం ప్రాధేయపడుతున్న పెంపుడుకుక్కలాగా, నీటినుంచి నావ అంచుకు తలఎత్తి, దాని ముట్టెకు పైగా ఉన్నసంచిని అందుకోటానికి యత్నించేది కూడాను. ఆ దృశ్యంచూస్తే జంతు ప్రదర్శనశాలలో మేతఅందుకొనే నీటిగుఱ్ఱం జ్ఞాపకానికివచ్చేది. జూలైనెల చివఱలో ఒకరోజున సముద్రయానం ఆరంభించి మూడునెలలు గడచిన తర్వాత దినచర్య పుస్తకంలో ఇల్లా వ్రాసికొన్నాము:

"రోజూ మావెంటబడే సొరచేపతో చెలిమిచేసికొన్నాము. భోజనసమయంలో ఆ ముక్కల్నీ ఆ ముక్కల్నీ ప్రోగుచేసి దాని వివృతవదనంలో పడవేశాము. అది మా

వెనుక వస్తూఉంటే, భయంకరంగా ఉన్నప్పటికీ, సాధువుగా మాఊుతున్న పెంపుడు కుక్కలాగా ఉండేది. సొరచేప నోటిలో మనం చిక్కకోనంతకాలం అది చూడ ముచ్చటగానే ఉంటుంది. ఆమాట కాదనటానికి వీలులేదు. ఒక్కస్నానం చేసేటప్పుడు తప్ప, మిగిలిన సమయాలలో అది మా వెంట వస్తూ ఉంటే ఏదో వినోదంగానే ఉండేది ”

ఒకరోజున మామూలుగా మేము సొరచేపలకు వేసే ఎఱను ఒక త్రాటికి కట్టి, ఆ త్రాడు ఒక వెదురు కఱ్ఱకు బిగించి ఉంచాము. కఱ్ఱ మా చేతిలో ఉండేదీ; ఎఱ సొరచేప పట్టుకోవలసిందీకదా! ఇంతలో ఒక కెఱటంవచ్చి ఈ మా సాధనం తుడిచిపెట్టుకొని పోయింది. మేము విస్మయంతో చూచాము. కొంతసేపటికి మాకు వెనుక సుమారు రెండు వందల గజాలదూరాన మా వెదురుకఱ్ఱ కొట్టుకొని రావటం కనబడింది. అకస్మాత్తుగా అది నీళ్ళమీద నిలబడి పరుగెత్తు కొని వస్తోంది. ‘చూడగా చూడగా, ఈ వాసం అనాయాసంగా వచ్చి, తన ఆవాసంలో నిక్కి నిలబడేట్టున్నదే!’ అనుకొన్నాము. అది మాకు చేరువ అయ్యేసరికి చూస్తే, దాని అడుగున పది అడుగుల పొడుగైన సొరచేప కనిపించింది. దానిపైన ఉన్న ఈ వెదురుకఱ్ఱ పెరిస్కోపు అనే దూరదర్శినీ యంత్రమేమో అనిపించింది. చేప సంచి నయితే మ్రింగిందికానీ, త్రాడు కొఱకలేదు. మేము వింతపడి చూస్తూఉండగానే, చేప ముందుకు సాగిపోయింది.

మేముగనుక మొదటినుంచీ పరీక్షగా చూస్తూ వచ్చి ఉంటే, సన్ననికత్తులలాగా ఉన్న ఆ సొరచేపకోఱలు అయి

దాటుపరుసలు మాకు బాగా కనిపించిఉండేవి. ఇక నిద్రపోయినా కలలోకూడా అవే కనిపిస్తూ ఉండేవి.

ఒకరోజున నట్‌తోపాటు ఒక సొరచేప ఈదుతున్నది. అతను దానిని గమనించలేదు. అప్పటినుంచీ నావకు దూరంగా పోయి ఈదరాదని కట్టడ చేసికొన్నాము. మేము ఈతలో పరవశులవుతూఉంటే, నావ పురోగమనంలో అవశ్యమై దూరం కావచ్చును. లేదా ఏ సొరచేపఅయినా ప్రాణాంతకం కావచ్చును. అయితే ఒకరోజున సముద్రంలో ఏ ప్రాణీకూడా, అంటే ప్రాణాంతకమైనది, సంచరిస్తున్నజాడ కనబడలేదు. అంతకుముందే మాతోవస్తున్న సొరచేపల నన్నింటినీపట్టి నావ పార్శ్వాన పడవేశాము. అందువల్ల సముద్రస్నానానికి అనుమతి లభించింది అయితే ఒక్కటంటే ఒక్కమునుక వేసి రావాలి. అంతకంటె ఎక్కువసేపు ఉండటానికి వీలులేదు నట్ తత్క్షణం సముద్రంలో దూకివెళ్ళాడు. అతను తిరిగివస్తూఉంటే, నౌకా స్తంభంపైన ఉన్న మాకు నీటిలో అతనినీడకంటె పొడుగయిన నీడ ఇంకొకటి కనబడ్డది. ఆనీడ అతనిని అనుసరిస్తున్నది. మేము ఆందోళనతో కేకలువేశాము. నట్ తొందరగానే నావ సమీపించి పైకి రాబోతున్నాడు. అయితే ఆ ఛాయకూడా అతనికంటె లోతున ఈదుతూవచ్చి అతన్ని కలుసుకొన్నది. అతను నావ ఎక్కుతూఉంటే ఆ నీడకూడా పైకివచ్చింది. అది ఒక సొరచేప. దానిపొడుగు ఆరడుగులు. అది అతని పొట్టక్రింద నుంచే పైకివచ్చి, మళ్ళీ ఎందుచేతనో దిగజారి నావప్రక్కనే ఆగి పోయింది. మా మిత్రుణ్ణి మ్రింగనందుకు కృతజ్ఞతా సూచకంగా మేము దానికి ఒక బేడిసతల బహూకరించాము.

సాధారణంగా సొరచేపకు ఏదైనా కనబడినప్పటికంటె, ఆ పదార్థంవాసనే ఆకలి పుట్టిస్తుందంటారు. ఇది ఎంతవఱకు నిజమో తెలుసుకోటానికి మేము నావఅంచున కూర్చుని కాళ్లు నీళ్ళల్లో పెట్టేవాళ్లము. అంతలో సొరచేప వచ్చేది. కాళ్లు పైకి తీసికోగానే అది పృష్ఠాన్ని మావైపు త్రిప్పి ఎటోపోయేది. మేము చేపలను సముద్రంలో కడిగి తీస్తూఉంటేనూ, మఱి ఎందువల్లనైనానూ నీటిలో నెత్తురుజాడ కనిపిస్తే, అంతవఱకూ నీటిఅడుగున ఎక్కడో ఆకృతులు మాత్రమే కనిపిస్తూఉండే సొర చేపలు అమాంతం పైకి వచ్చి, నీలకాచ పాత్రల్లాగా అల్లంత దూరాన కాచుకొని ఉండేవి. మా దగ్గఱఉన్న సొరచేపల ప్రేగులు విసరివేస్తే అవి అయోమయంగావెళ్ళి వాటిని తాకేవి. అవి స్వజాతి కాలేయాన్నే తినేవి. వాటిక్రౌర్యం అటు వంటిది. మేము నీళ్ళలో పాదం పెట్టితేచాలు; రివ్వునవచ్చివచేవి. పాదం దొఱకకపోతే అది కనిపించిన చోట నావదూలాల్ని కోఱలతో గ్రుచ్చివేసేవి. సొరచేవ లనే వాటికి సొరచేప లున్నాయి; అంటే, అవి స్వశరీరంతప్ప మఱిదేన్నీ కనికరించవు. స్వజాతినే చంపుకొని తింటాయి; అని భావం.

చిట్టచివఱికి మేము సొరచేపల తోకలు ఊడదియ్యటం మొదలుపెట్టాము. జంతువులతోకలు ఊడదియ్యటమేమిటి ? ఇదేం సరదా ? అని ఎవరైనా అసహ్యించుకోవచ్చును కాని సొరచేపతోక ఊడదియ్యటంలో ఎంత వినోదం ఉన్నదో తెలిస్తే, అలా అనరు. ఇది కేవలం అనుభవైకవేద్యం, అత్యంతహృద్యం అయిన చోద్యం.

సొరచేప తోక చేతికి చిక్కటంకోసం ముందుగా దానికి

ఏదైనా మేత వెయ్యవలసివచ్చేది. ఆహారంకోసం అది తల పైకి ఎత్తేది. సాధారణంగా దానికి వెయ్యవలసిన ఆహారం ఒక సంచిలో వేసి ఉంచేవాళ్లం. అలా కాకుండా మనం చేతులారా అందిస్తే, అది నోరారా అందుకోవాలనుకొంటే, అది ఆ ఎఱనుమాత్రమే కాకుండా మన చేతుల్నికూడా కబళించి వేస్తుంది. అప్పుడు వినోదం కాస్తా విషాదంగా మాఱిపోతుంది. కుక్కలకుగానీ, మచ్చికఅయిన ఎలుగుబంట్లకుగానీ ఏదైనా పెట్టబోతే, అవి ఆ భోజ్యాన్ని కోఱలతో కఱచిపట్టి దానిలో కొంతగానీ, సర్వంగానీ లాగుకొని పోతాయి. అటువంటి సమయాల్లో ఒక్కొక్కప్పుడు మనకు చేతివేళ్ళు గాయపడ వచ్చును గదా! కాని వీటికీ సొరచేపలకూ ఉన్న భేదం ఏమిటీ అంటే, ఎఱ మనచేతుల్లో ఉన్నంత వఱకు కుక్కలుగానీ, ఎలుగులుగానీ కొంచెం చనువవుతాయి గానీ, సొరచేప అలా చనువు గాదు. ఎవడైనా ఒక బేడిసను పట్టుకొని నిల్చుంటే, సొరచేప వచ్చి క్షణంలో సగం చేపను కొఱికికొని పోతుంది. మిగతా సగంచేప మాత్రం చేతిలో మిగులుతుంది. ఇక ఆ సొరచేపను పట్టుకోవటం ఏలాగు? మేము ఒక ఉపాయం ప్రయోగించాము. ముందుగా బేడిసను రెండు సమభాగాలుగా నిలువునా చీల్చేవాళ్ళము. ముందు ఒక చీలిక అందించేవాళ్ళం. అదితిన్న సొరచేపకు రెండవది అందిస్తే అది దాన్ని అందుకొని. ఱంపాలవంటి త్రిభుజాకారపు దంతాలతో కఱకఱ నములుతూ వెనుకకు తిరిగేది. అలా తిరిగి, నావ అడుగుకు మెల్లగా చేరుకొంటూఉండేది. ఆసమయంలో దానితోక నీటికి కొంచెంపైగా ఉండటంవల్ల తటాలున పట్టుకోటానికి వీలుకలిగేది. సొరచేప

శరీరం మెఱుగు కాగితంలాగా ముట్టుకొంటే గీచుకొని పోతుంది. ఒక్క తోకదగ్గఱ మాత్రం ఆకఱకుదనం ఉండదు. అందుచేత పట్టుకొంటే అక్కడే పట్టుకోవాలి. అటువంటి పట్టు చిక్కితే మాత్రం ఎన్నడూ జాఱవిడిచే వాళ్ళంకాదు. ఆ జంతువు బలం కూడదీసికోవటానికి ముందే మేము ఒక్క ఊపుతో ఇవతలకు ఈడ్చి దూలాలకు కట్టివేసేవాళ్ళం పాపం! ఒకటి రెండు క్షణాలపాటు ఆ మహామీనానికి ఏమీ తోచేది కాదు. తరువాత అది పూర్వకాయాన్ని అటూ ఇటూ చలింపజేస్తూ, తప్పించుకొని పోవటానికి ప్రయత్నం చేసేది. కాని, ఆప్రయత్నంలో దానిబలం యావత్తూ కేంద్రీకరించ టానికి వీలులేదు. అసలు దాని మహావేగానికి కారణం ఆ పుచ్ఛం మాత్రమే. దానికి ఇంకా ఱెక్కలు ఉన్నప్పటికీ, అవి నీటిమీద తేలి ఉండటానికీ, ప్రక్కలకు తిరగటానికీ మాత్రమే పనికివస్తాయి. తోకఱెక్క చలనంవల్లనే సొరచేప ఎంతవేగంగా నైనా ఈదగలదు. కనుక ముందుగా మాకు తోక చిక్కి ఉండ టంవల్ల, విస్మయంతో అది నిరుపాయమూ, పరాజితమూ అయి, కొంతసేపటికి అచేతనమై పడి ఉండేది. అటువంటిస్థితిలో దానిని బాగా ఇవతలకు లాగి వెయ్యటానికి అవకాశం కలిగేది. సాధారణంగా అప్పటికి మేము దానిదీర్ఘ శరీరంలో సుమారు సగంభాగం మాత్రమే పైకిచేర్చి ఉండేవాళ్ళం. అటు తరువాత మిగిలిన సగంకూడా పైకి లాగటానికి ప్రయత్నిస్తూ ఉంటే, తెలివి తెచ్చుకొని అది గింజుకొనేది. తల అటూ ఇటూ త్రిప్పుతూ అతి భయంకరంగా ఎగిరిపడేది. అటువంటి సమ యంలో మేము దానిని గట్టిగా తోక దగ్గఱ కట్టివేసి, దూరంగా

వెళ్ళిపోయే వాళ్ళం. దానికి ఏమాత్రం అందుబాటులో ఉన్నా మా ప్రాణాలు మావి కావు. అది అదేపనిగా ఎగిరిపడుతూ, వెదురు తడక విఱుగగొట్టుతూ, తోక చివఱ భాగాన్ని విసరి కొట్టుతూ చాలా గల్లంతు చేసేది. అయః కఠినాలైన దాని నఖాల్లో నలిగిపోనిది ఉండదేమో! విశాలవదనం భీకరంగా తెఱచి అందినదాన్ని చీల్చి వెయ్యాలని, కోఱలన్నీ బయట బెట్టి, గాలినే కఱుస్తూ ఉండేది. ఒక్కొక్కప్పుడది కొంతసేపు అటూ ఇటూ ఎగిరిపడి, తరువాత నిస్పృహతో పడి ఉండేది కానీ, సర్వసాధారణంగా మేము దానితోక మొదట ఉచ్చు బిగించే ఉన్నా, అది రోషంతోనో, బాధతోనో; చెప్పలేము కానీ, నావ దూలాల్ని కఱచి కఱచి, కోఱలన్నీ విఱిగిన తర్వాతగానీ అదఱిపాటు మానేది కాదు.

సారచేపను చూడగానే, చిలుకలో అపూర్వమైన సంచలనం కలిగింది. అది వేణుమందిరంలో నుంచి తుఱ్ఱున ఎగిరి పోయింది. దిక్కూ మొక్కూ కనబడనట్లు అల్లాడుతూ, ఎక్కడ దాగుకోవాలా; అని ఆతురదృక్కులతో నలువైపులూ పరికించిపరికించి, కుటీరాగ్రాన వ్రాలి, ప్రాణాలు దక్కా యనుకొన్నట్లు కనబడింది. కాని, అంతటితో కుదురుగా కూర్చోక, వెన్నుగాడిమీద ఆ చివఱనుంచి ఈ చివఱకూ, ఈ చివఱనుంచి ఆ చివఱకూ తిరుగుతూ, ఱెక్కలు టప టప లాడిస్తూ, భయాతిరేకంతో అఱవటం మొదలుపెట్టింది. ఇటీవలనే దానికికూడా, ఉత్తమ నావిక లోకంలో సభ్యత్వం లభించింది. వెనుకటి రోజుల్లోనైతే కోన్-టికీ మీద ఆఱుగురం మాత్రమే ఉన్నా మనుకొనేవాళ్ళం. కాని యిప్పుడు చిలుక

కూడా మాతోబాటు లెక్కకు వచ్చింది. అందువల్ల మేము ఏడుగురమైనాము. జోహాన్స్‌కూడా మిత్రబృందంలో కలిసినా అతని శరీరంలో చల్లనిరక్తం ప్రవహిస్తున్నది. కాబట్టి, అతనిని ఒకడుగా లెక్కించలేదు. రాత్రిపూట పంజరంలో ఒదిగి వేణుమందిరం దాటకపోయినా, పగలు మాత్రం మా కీరమిత్రం మందిరోపరిభాగాన ఎగురుతూనో, ఏ స్తంభాన్నైనా కఱచిపట్టి ఉయ్యాల లూగుతూనో వ్యాయామ ప్రదర్శనం చేస్తూ ఉండేది. నౌకా స్తంభాన్ని సుదృఢంగా నిలవటానికి కట్టిన మోకులు తీవ్రమైన గాలి నిరంతరం వీస్తూ ఉండటంవల్ల స్తంభం ఊగిపోతూ ఉంటేనూ, విశేషమైన ఎండలవల్ల వ్యాకోచం కలగటంచేతనూ బిగువు తగ్గిపోయేది. అప్పుడు తిరిగి వాటిని గట్టిగా బిగించవలసి వచ్చేది. స్తంభం చండ్ర కఱ్ఱతో తయారైంది కాబట్టి అది చాలా బరువు. కేవలం ఇనుప కడ్డీలాగానే ఉంటుంది. ఒక్కొక్కప్పుడు మోకులైనా తెగిపోతాయిగానీ, ఒరిగిన స్తంభం పైకిలేవదేమో అనిపిస్తుంది. మోకులే తెగితే స్తంభం ఎటైనా పడవచ్చు. ఆ వైపున ఉన్న మనిషి తల చితికిపోవచ్చు. ఇటువంటి సమయాల్లో మేము మా శక్తిసామర్థ్యాలు యావత్తూ వినియోగించి స్తంభాన్ని సరిగా నిలవటానికి విశ్వప్రయత్నం చెయ్యవలసి వచ్చేది. అట్లా మేము నానావస్థలూ పడి మోకులు బిగిస్తూ ఉంటే, ఈ చిలుక పైన కూర్చుండి "లాగండి! లాగండి! హా హ్హా హ్హా హ్హా!" అంటూ విపరీతంగా పరిహాసిస్తూ ఉండేది. ఆ పరిహాసానికి మేముకూడా నవ్వటం మొదలుపెట్టేసరికి, అది వినోదంతో నలువైపులా ఎగురుతూ, మోకులు పట్టుకొని ఊగుతూ ఉండేది.

మొట్టమొదట మా రేడియోవారికి చిలుకతో పెద్దయిబ్బంది కలిగేది. వారు తమ సామగ్రితో ఒకమూల కూర్చుండి, ఓక్లహామాలోని రేడియోవారితో సంభాషిస్తూ వారిమాటలు వినటానికి శబ్దగ్రాహక యంత్రాలు చెవిదగ్గఱ పెట్టుకొని ఉండే వారు. అకస్మాత్తుగా వారికి మాటలు వినిపించేవికావు. వారు విస్మయంతో తమ సాధనాలను పరిశీలించుకొనేవారు. ఎందువల్ల యంత్రం పనిచెయ్యటంలేదో; వారికి తెలిసేదికాదు. చిలుక పాపం తీఱుబడిలేకుండా, ఏరియల్ తీగల్ని కొఱికివేస్తూ ఉండేది. అయితే ఇది మొదటిరోజుల్లో మాత్రమే. అప్పట్లో ఏరియలు బెలూనుతో నౌక పైభాగాన కట్టిఉంచాము. ఒక రోజున చిలుకకు జబ్బుచేసింది. అది రెండురోజులపాటు పంజరంనుంచి బయటికిరాలేదు. ఆహారం ముట్టలేదు. రెట్టవేస్తే తళతళా మెఱిసింది. ఆ మెఱుపు ఎలావచ్చింది? అందులో ఏరియల్ తీగ లున్నాయి! అవి కనిపించేసరికి మా మిత్రులకు పశ్చాత్తాపం కలిగింది. అమాయికంగా తీగల్ని కొఱికినందుకు దానిని ఎంత తిట్టుకొన్నాము! దానికే తెలివిఉంటే, ఇల్లా తన ప్రాణంమీదకు తెచ్చుకొనేపని ఎందుకుచేస్తుంది? అని చిలుక మీద జాలిపడ్డాము. చిలుకకూడా తన అవివేకానికి పశ్చాత్తాపపడినట్లే కనిపించింది. అటుతర్వాత అది మా మిత్రులకు బాగా ఆప్తబంధువైనది. అది యంత్రం ఉన్నమూలనేతప్ప నిద్రించేది కాదు.

రెండు నెలలపాటు చిలుకతో మేము హాయిగా కాలక్షేపం చేశాము. ఒకరోజున ఒక పెద్దఅల వచ్చింది. ఆ సమయానికి మా కీరమిత్రం చుక్కాని స్తంభంమీదనుంచి క్రిందికి

వస్తున్నది. అంతే! ఆ తరువాత అది మాకు కనబడలేదు. సముద్రంపాలే అయిందో, మరి ఎక్కడకైనా వెళ్ళిపోయిందో తెలియదు. దానికోసం నావ ఆపటానికికానీ, వెనుకకుపోయి అన్వేషించటానికికానీ వీలు లేదుకదా!

చిలుక తప్పిపోయినరాత్రి మాకు ఎవరికీ ఏమీ తోచ లేదు. ఎవ్వడైనా, మనలో మనకుకూడా, ఇలా విడిపోవటం సంభవించవచ్చునేమో, అనుకొన్నాము. రాత్రిపూట కావ లాలో కాలుజారి సముద్రంలోపడితే మాగతీ అంతే; అని మాకు తెలుసు.

అప్పుడు వెనుకటికంటె కట్టుదిట్టాలు ఎక్కువ చేసి కొన్నాము. రాత్రి కావలాలో భద్రతాబంధాలు పెంచు కొన్నాము. మాటిమాటికీ,అందఱం ఉన్నామా,లేదా,అని పరీ క్షించుకొంటున్నాము. ఎవరైనా వెంటనే 'ఓ' అనకపోయినా, కనబడకపోయినా, సముద్రంలో పడ్డారేమో; అనుకొని, శోకాలు ప్రారంభిస్తున్నాము. ఒకరికొకరం ధైర్యం చెప్పుకోటం పోయి, భయపడేవాళ్ళనుచూచి మఱింత భయపడుతున్నాము. పరిస్థితులు సవ్యంగా ఉండటంవల్ల వెనుకటి రెండునెలల్లోనూ సురక్షితంగా ఉండగలిగామనికూడా మఱచి పోతున్నాము. ఒక్కఅడుగు పొరపాటుపడ్డా, ఒక్కపని అనాలోచితంగా చేసినా, మా చిలుకగతే మాకు పట్టుతుంది. ప్రమాదంఅనేది రాత్రిపూటనే జరుగుతుందని నిశ్చయంఏమిటి? పట్టపగలు జరుగగూడదని ఎక్కడున్నది?

నిస్తంత్రీయంత్రంఉన్న (వైర్‌లెస్)మూల చిలుక ఖాళీచేసి పోయింది. కానీ ఆ మఱునటిరోజున బాగా ప్రొద్దుఎక్కేసరికి మా

విచారం మఱచిపోయాము. మాకు కొద్దిరోజుల్లోనే కావలసి నన్ని సొరచేపలు చిక్కాయి. వాటిని కోసినప్పుడు టన్నీ చేపల తలలతోపాటు నల్లగా వంపుతిరిగిన చిలుకముక్కులూ, ఇంకా కొన్ని విచిత్రపదార్థాలూ కనిపించాయి. అయితే బాగా పరిశీలించినప్పుడల్లా, ఆ నల్లనిముక్కులు సొరచేప ఉదరంలో జీర్ణమైన స్క్విడ్ చేపల అవయవాలే అని స్పష్టమయేది.

మా నిస్తంత్రీ యంత్రనిర్వాహకు లిద్దఱికీ మొదటినుంచీ కూడా ఆ యంత్రందగ్గఱ తీఱనిపని ఉంటూవచ్చింది. హంబోల్టు ప్రవాహంలో మొట్టమొదటిరోజునే ఒక కెఱటం వచ్చి, వారి సామగ్రియావత్తూ తడిపివేసింది. అందుచేత వాటిని తైలవస్త్రం (కాన్వాసు)తో కప్పవలసి వచ్చింది. తర్వాత మా చిన్ననావ మీద పెద్దఎత్తున ఏరియల్ అమర్చటం ఎట్లాగా! అనే సమస్య బయలుదేఱింది. ఒక గాలిపటంతో ఏరియల్ని బాగా పైకి పోయేట్లైతే చేశారుగానీ, ఒక మహాతరంగం ఆ గాలిపటాన్ని తన పొట్టబెట్టుకొన్నది. అప్పుడు మామిత్రులు ఒక రబ్బరుగుమ్మటం ద్వారా మళ్ళీ ఏరియల్ని పైకి పంపించారు. కాని, అదికూడా, ఎండ బాగాతగిలేసరికి, టప్పుమని పగిలిపోయి సముద్రంలోపడ్డది. అటుపైన చిలుకమూలాన ఏరియల్స్ చెడిపోతూ వచ్చాయి కదా! దీనికితోడు హంబోల్టుప్రవాహంలో పదిహేనురోజులు గడిచిన తర్వాత నిర్జీవమండలానికి చెందిన ఆండెస్ ప్రాంతానికి వచ్చాం. ఇక్కడ అసలు వాయుచలనం ఉన్నట్లే కనిపించదు. మూతవేసిన సబ్బుపెట్టెలోని గాలి ఏమాత్రమో, ఇక్కడా అంతే!

కాని, ఒకనాటిరాత్రి టార్‌స్టీను యత్నం ఫలించింది అకస్మాత్తుగా గాలితెఱ వచ్చింది. అందువల్ల క్రొత్తగా నిస్తంత్రీయంత్రాన్ని అమర్చుకొని, దానిద్వారా స్వీడన్‌లోని ఒకమిత్రునికి వార్త పంపటానికి ప్రయత్నిస్తూఉన్న లాస్ ఏంజిలస్ నివాసికి టార్‌స్టీను పిలుపు వినిపించింది. అతను మా యంత్రం ఎటువంటిదో, అడిగి తెలుసుకొని, సంతృప్తిపడ్డాడు. తర్వాత అతను టార్‌స్టీను ఊరుపేరులూ, అతని తాత్కాలిక నివాసస్థలమూ మొదలైనవి అడిగాడు. టార్‌స్టీన్ వాటి కన్నింటికి జవాబులు చెప్పేసరికి, వాయుగతి భేదంవల్ల మా యంత్రంలో క్లిక్కు-క్లిక్కు-మనే శబ్దాలు బయలుదేరాయి. కొంతసేపు ఏమాటా వినిపించలేదు. కాని, తర్వాత పాపం అవతలివ్యక్తి మళ్ళీ మమ్మల్ని పిలిచి, తన పేరు "హాల్"అనీ, తనభార్య పేరు "అన్నా"అనీ, ఆమె స్వీడన్‌కుటుంబంలో పుట్టిందనీ, మా కుటుంబాలకు మా క్షేమం తెలియబరుస్తాననీ చెప్పాడు.

ఇంత ప్రపంచంలో మా ఉనికీ, కుశలమూ గుర్తించింది లాస్‌ఎంజిలస్‌లోని మహాజనంలో ఒక సామాన్య చలనచిత్ర యంత్రనిర్మాతకుడైన "హాల్" అనే అతను ఒక్కడుమాత్రమే. అతనుకూడా, అంతకుముందు మమ్మల్ని ఎఱిగినవాడు కాదు. మా పరిచితులందఱూ ఉపేక్షించిఉండగా, ఈ అపరిచిత వ్యక్తితో మాకు ఈ అనుబంధం ఏర్పడటానికి కారణం ఏమిటి? ఏమిటీ విచిత్రం! అని మేము చాలా ఆశ్చర్యపడ్డాము. ఆరాత్రి మొదలుకొని, "హాల్" ఉరఫు "హెరాల్డు కెంపెల్" అతని మిత్రుడు "ఫ్రాంక్ క్వేవాస్" ప్రతిరాత్రీ మా నావనుంచి వెళ్లే వార్తలు అందుకొనేవారు. తర్వాత హెర్మన్‌పంపిన సంక్షిప్త

వార్తలకు మధ్య అమెరికా వాతావరణ పరిశీలకసంఘం వారి వద్దనుంచి రెండు టెలిగ్రాములు వచ్చాయి. తర్వాత నట్ టార్ స్టీనులు మఱికొంతమంది నిస్తంత్రీ యంత్రసంపన్నులతో కూడా మాట్లాడటం మొదలుపెట్టారు. ఈ శ్రోత్రమిత్రులు కొటోడెన్‌లోని ఎజిల్ బర్గ్ అనే వ్యక్తిద్వారా నాక్వేకు శుభాకాంక్షలు అందజేశారు.

కొద్దిరోజులు మాత్రం సముద్రమధ్యంలో నిస్తంత్రీ యంత్రం ఉన్నవైపున సముద్రజలం విశేషంగా తాకుతూ ఉన్నందున ఆయంత్రం అసలే పనిచెయ్యలేదు. మా మిత్రులు రాత్రింబగళ్లు ఆ యంత్రాన్ని మరమ్మతు చేస్తూనే ఉన్నారు; కాని ప్రయోజనం కనబడలేదు. మారేడియో మిత్రులందఱూ నావ ఎక్కడో మునిగి పోయిందనుకొన్నారు. కాని ఒకరోజు రాత్రి ఎల్ $1_2$బి సంకేతం వినిపించింది. మఱుక్షణంలో ఒక పెద్దసందడి వినవచ్చింది. ఎన్నో వందలమంది అమెరికన్ల కంఠాలు ధ్వనించాయి. ఒకరి తర్వాత ఒకరు జవాబిచ్చారు. నిస్తంత్రీ యంత్రం ఉన్న చోటికి వెళ్ళితే, అక్కడి తీగవల దగ్గఱ ఎవరో కూర్చుని ఉన్నారేమో; అనిపించేది. సముద్రోదకంతో ఆ ప్రదేశమంతా నాసనాని ఉండేది. అందుచేత జాఱిపడకుండా ఉండటంకోసం ఏప్రక్కనైనా చేతులు ఆన్చి, నెమ్మదిగా వెళ్ళవలసి వచ్చేది. అలావెళ్ళుతూంటే, ఎవరో అకస్మాత్తుగా పట్టుకొన్నట్లు తోచేది. ఇంత దేనికి? యంత్ర సామీప్యంలోపడి ఉన్న చిన్న రబ్బరు ముక్క తియ్యబోయినా, దొంగను పట్టుకొన్నట్లు ఏదో అదృశ్యభూతం మమ్మల్ని పట్టుకొనేది. ఆ అదృశ్యభూతం మఱి ఏదోకాదు. విద్యుచ్ఛక్తి! యంత్రం

మీాట ముట్టుకోనీ ముట్టుకోనకముందే, వెనుక నుంచీ, ముందు వేళ్ళలో నుంచీకూడా విద్యుదాఘాతం ప్రసరించేది. యంత్రం సుప్రతిష్ఠితమై ఉండగా అక్కడనుంచి చిన్న పెన్సిలు తీసుకోబోయినా, ఆ పెన్సిలుపై చెక్క నిప్పులు కక్కేది. శరీరం అంతా జలదరించటం, నెత్తిమీద రోమ రోమమూ ఒక్కసారి నిట్టనిలువుగా లేచిపోవడం జరిగేవి. టార్స్టీనూ, నట్టూ, చిలుకా మాత్రమే అక్కడ తిరగవచ్చును. తక్కినవాళ్ళం నలుగురమూ వెలిపడ్డవాళ్ళమే. ఆ యంత్రానికి మేము అస్పృశ్యులం అని తోచిందేమో! అందువల్ల మేము మా నలుగురికీ హెచ్చరిక కోసం ఒక అట్టమీద "అపాయం" అని వ్రాసి, ఆ ప్రదేశానికి ముందు కట్టి ఉంచాము.

ఒకనాటిరాత్రి నట్ యంత్రం చేరువనే దీపంముందు కూర్చుని భోజనంచేస్తున్నాడు. మధ్యలో హఠాత్తుగా నాశాలు పట్టుకొని లాగాడు. నేను తెల్లబోయి చూచాను. అతనుచాలా ఉత్సాహంగా కనిపించాడు. "ఒస్లోకు అవతల నివసిస్తున్న "క్రిస్టియన్ అముండ్సెన్" అనే వ్యక్తితో మాటలు సాగించానోయ్!" అన్నాడు. ఇదికొంచెం అద్భుతవిషయమే. మా యంత్ర శక్తి చాలా పరిమితమైనది కాబట్టి, 6 వాట్లకంటె ఎక్కువ పంపలేదు. ఈ సంఘటన జరిగింది ఆగస్టు రెండవ తేదిన. అప్పటికి భూవలయంమీద 60 డిగ్రీలకంటే ఎక్కువే ప్రయాణం చేశాం. ఒస్లో మా ఉనికినిబట్టి చూస్తే భూగోళం అవతలప్రక్క ఉన్నది. హాకన్ రాజుకు ఆ మఱునటిరోజుకు 75 సంవత్సరాలు పూర్తి అయినవి. అంటే 76 వ జన్మదినోత్సవం అన్నమాట. మేము నావమీదఉండే, ఆయనకు మా అభినందనలు అందజేశాము-